అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 29-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 12 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50



జార్ఖండ్‌లో ఘోర రైలు ప్రమాదం

- 12మంది మృతి..
- రైల్వేట్రాక్ దాటుతున్న వ్యక్తులను ఢీకొనడంతో.. 11లో..

నేడే డీఎస్సీ నోటిఫికేషన్

ఉపాధ్యాయ పోస్టులు 11,062

- పాత డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు
- అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు : పాఠశాల విద్యాశాఖ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దయ్యింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గురువారం కొత్తగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు ఆమె ప్రకటించారు. కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆ దరఖాస్తులను కొత్త నోటిఫికేషన్‌లో పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. వారు మళ్లీ దరఖాస్తు చేయొద్దని కోరారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో డీఎస్సీ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనుంది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం 5,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీని నిర్వహిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ఉపాధ్యాయ పోస్టులను పెంచాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. దీంతో గత నోటిఫికేషన్‌లో ఉన్న 5,089 ఉపాధ్యాయ పోస్టులకు అదనంగా 5,973 పోస్టులను కలిపి 11,062 పోస్టులను ...11లో



ఓఆర్ఆర్ టోల్ టెండర్లపై విచారణ

నివేదిక వచ్చాక సీబీఐ, లేదా మరో సంస్థతో దర్యాప్తు

- రీజినల్ రింగ్ రోడ్డు వరకు హెచ్ఎండీఏ పరిధి విస్తరణ
- లే అవుట్లలోని ప్రభుత్వ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలు
- హుస్సేన్ సాగర్ చుట్టూ దుబాయ్ మోడల్ టూరిజం స్పాట్లు : హెచ్ఎండీఏ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) టోల్ టెండర్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో హెచ్ఎండీఏ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వానికి రావాల్సిన భారీ ఆదాయానికి గండి పడేలా తక్కువ రేటుకు టెండర్లు కట్టబెట్టిన తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస ధర నిర్ణయించకుండా టెండర్లు ఎలా పిలిచారంటూ అధికారులను ప్రశ్నించారు. అందులో ఎవరెవరి ప్రమేయముంది? ఏయే సంస్థలున్నాయి? అనే విషయాలపై దర్యాప్తు జరపాలని ఆదేశించారు. టెండర్లలో జరిగిన అవకతవకలు, అనుసరించిన విధానాలు, ఫైళ్లు కదిలిన తీరుపై పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశిస్తూ హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రా పాలీకి ఆ బాధ్యతలు అప్పగించారు. టెడర్లలో ఫైళ్లు ఏవైనా మిస్సయినట్టు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులు, బాధ్యులైన ఉద్యోగులపై వ్యక్తిగతంగా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. టెండర్ల కేటాయింపుపై పూర్తి నివేదిక అందిన తర్వాత కేబినేట్లో చర్చించి సీబీఐ లేదా అదే స్థాయి మరో దర్యాప్తు సంస్థకు విచారణ బాధ్యతలు అప్పగిస్తామని సీఎం చెప్పారు. టెండర్లకు ముందు ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రతి నెలా గరిష్ఠంగా ఏడాదికి రూ.600 కోట్ల ఆదాయం వచ్చేదని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. 30 ఏండ్ల లీజు గడువులో రూ.18 వేల కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం రావాల్సి ఉండగా, కేవలం రూ.7,380 కోట్లకు ఐఆర్‌బీ కంపెనీకి ఎలా అప్పగించారంటూ ముఖ్యమంత్రి ఆరా తీశారు. హెచ్ఎండీఏ అనుసరించిన టెండర్ విధానంతోనే ప్రభుత్వం రూ.15 వేల కోట్లకుపైగా నష్టపోయిందని సమావేశంలో ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేయిస్తేనే, నిజాలు బయటకు వస్తాయని సీఎం అభిప్రాయపడ్డారు. టెండర్ దక్కించుకున్న కంపెనీ ప్రభుత్వంతో చేసుకున్న కాంట్రాక్టు అగ్రిమెంట్‌ను చూపించి 49 శాతం వాటాను విదేశీ కంపెనీలకు అప్పగించిందనీ, ...3 లో..

దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా మైనార్టీలు

- మోడీ హయాంలో భయానక పరిస్థితులు
- పాలకులే ఘర్షణలకు కారణమవుతున్నారు
- మణిపూర్, గుజరాత్ అల్లర్లే సాక్ష్యం
- కేసీఆర్‌కు ఓటేస్తే...మోడీకే ప్రయోజనం
- కేంద్రంలో లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించండి : క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వివరాలు 3లో

2029లో జమిలి ఎన్నికలు..!

లా కమిషన్ ప్యానెల్ ప్రతిపాదన..

- శాసన సభల నిబంధనలు మూడు దశల్లో మార్పు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగంలో 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనే అంశంపై కొత్త అధ్యాయాన్ని జోడించి, 2029 నాటికి దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించాలని లా కమిషన్ సిఫారసు చేసే ...11లో

ఐదుగురు ఐఏఎస్‌ల బదిలీ

- 8 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, 32 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్థానచలనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల బదిలీల పర్వం కొనసాగుతూనే ఉంది. బుధవారం మరో ఐదుగురు ఐఏఎస్ అధికారులకు స్థాన చలనం కలిగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మెదక్‌కు బదిలీ చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్‌గా ఉన్న బీహెచ్ సహదేవ్‌రావును జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా, నల్గొండ అదనపు కలెక్టర్ హేమంత కేశవ పాటిల్‌ను హైదరాబాద్ అదనపు కలెక్టర్‌గా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న రాజర్షిషాను ఆదిలాబాద్ కలెక్టర్‌గా, స్నేహ శబరీశ్‌ను కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్‌గా నియమించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 8 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, 32 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాల మేరకే ఈ బదిలీలు జరిగినట్టు సమాచారం.



ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు 4,88,113 మంది హాజరు
- 19,641 మంది గైర్హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 5,07,754 మంది దరఖాస్తు చేయగా, 4,88,113 (96.14 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 19,641 (3.86 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. కరీంనగర్‌లో ఒకరు, నిజామాబాద్‌లో ఒకరు, జనగామలో ఒకరు చొప్పున ముగ్గురు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని పేర్కొన్నారు. సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు సెట్ ఏ ప్రశ్నాపత్రాన్ని ...11లో





రోడ్డున పడిన నేతన్న

ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వస్త్ర పరిశ్రమ సంక్షోభం

- 70శాతానికి పైగా మరమగ్గాలు ఆగిపోయాయి
- సీఎంను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరతాం : నేతన్నల మహాధర్నాలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ - సిరిసిల్ల

గత ప్రభుత్వ నిర్వాకం.. ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యను పరిష్కరించాలని కోరతామని చెప్పారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన నేతన్నల మహాధర్నాలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసి నేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఎంపీగా పనిచేస్తున్న బండి సంజయ్ దేవుడి పేరిట రాజకీయాలు తప్ప.. ఏ ఒక్కరోజు నేత కార్మికుల సమస్యలపై మాట్లాడలేదని విమర్శించారు. నేత కార్మికులు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బండికి తగిన బుద్ధి చెబుతారన్నారు. మత రాజకీయాలు చేస్తూ దేవుడి పేరిట మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీకి ఈసారి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. గత రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల నేత కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చినట్టు ప్రచారం చేసుకుందే తప్ప కనీసం బతుకమ్మ చీరల బకాయిలు కూడా చెల్లించలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా కేటీఆర్‌ను గెలిపిస్తే.. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో నేత కార్మికుల సమస్యలపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం నేతన్నల పట్ల ఆయనకు ఉన్న శ్రద్ధ కనిపిస్తోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ చీరల బకాయిలు ఇవ్వకపోవడమే కాకుండా కార్మికులకు వచ్చే నూలు రాయితీ రూ.18కోట్లు కూడా మంజూరు చేయలేదని చెప్పారు. ఇప్పటికే బతుకమ్మ చీరలకు సంబంధించిన ఆర్డర్ ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు ఇవ్వకపోవడంతో ...11లో

శాంతిభద్రతలపై కేంద్రం పెత్తనమేంది?

వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్‌పై కేసులెత్తేయాలి

- ఎన్ఐఏ జోక్యాన్ని తెలంగాణ సర్కార్ అడ్డుకోవాలి
- అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయాలి : రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీనియర్ జర్నలిస్టు, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్‌పై ఎన్ఐఏ పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శాంతిభద్రతల అంశం రాష్ట్రాల పరిధిలోనిదనీ, దానిపై కేంద్ర ప్రభుత్వ పెత్తనమేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్ఐఏ జోక్యాన్ని అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ...11లో

అఖిలేశ్ యాదవ్‌కి సీబీఐ సమన్లు

లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలపై కేంద్రం దాడులు



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ సమీపిస్తున్న తరుణంలో..ప్రతిపక్షాలపై కేంద్రం దాడులకు దిగుతోంది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎనిమిది సార్లు సమన్లు జారీ చేసింది. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ని కూడా అవినీతి ఆరోపణలపై అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా అక్రమ మైనింగ్ కేసులో సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) బుధవారం సమన్లు జారీ చేసింది. సాక్షిగా విచారణకు హాజరుకావాలని సమన్లలో పేర్కొంది. గురువారం దర్యాప్తు సంస్థ ప్రశ్నించే అవకాశం ఉన్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. అఖిలేశ్ యాదవ్ 2012 నుంచి జూన్, 2013 మధ్య మైనింగ్ శాఖను నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఏడు జిల్లాలు, షామ్లీ, కౌశాంబి, ఫతేపూర్, డియోరియా, సహారాన్‌పూర్, హమీర్‌పూర్, సిద్ధార్థనగర్ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ కేసులు నమోదయ్యాయి. 2012 నుంచి 2016 మధ్య కాలంలో నిబంధనలను పాటించకుండా ప్రభుత్వ అధికారులు కొన్ని అక్రమ మైనింగ్ స్థలాలను కేటాయించారని ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌జీటీ ఆదేశాలను ఉల్లంఘించి మైనింగ్ హక్కులు కూడా ఇచ్చారని సీబీఐ పేర్కొంది.

అంతామాయం...

కాదేదీ కల్తీకనర్హం అన్నట్టుగా తయారైంది పరిస్థితి. పాలపొడి, వంటనూనె, కొబ్బరినూనె, నెయ్యి, తేనె, అల్లంపేస్ట్ ఇలా తినే వస్తువుల నుంచి తాగే శీతల పానీయాలు, సబ్బులు, మసాలాలు ఏదైనా కల్తీ చేసేస్తున్నారు. డేట్ అయిపోయిన వస్తువులను అందంగా ప్యాకింగ్ చేసి లేబుల్స్ వేసి అమ్ముతున్నారు.

పైన బ్రాండెడ్.. లోన కల్తీ

- అసలుకు నకిలీకి తేడా తెలియకుండా లేబుల్స్
- బ్రాండెడ్ కంపెనీల పేరుతో దందా
- తిన్నా తాగినా ప్రమాదమే..
- ఎక్స్‌పైరీ వస్తువులు.. అందంగా ప్యాకింగ్
- అధికారుల తనిఖీలు అంతంతే..
- ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజల ఆరోగ్యంతో తమకేం పని.. వ్యాపారమే పరమావధిగా అక్రమాలకు పాల్పడుతున్నారు. వినియోగదారులకు.. ఆ వస్తువులు నకిలీవా.. మంచివా తెలియకుండా బ్రాండెడ్ కంపెనీల పేరుతో అమ్ముతున్నారు. పైన స్టిక్కర్ చూస్తే బ్రాండెడ్.. లోన వస్తువులు కల్తీ ఉంటున్నాయి.

తాజాగా హైదరాబాద్ నగరంలో నకిలీ అల్లం పేస్ట్ తయారీ బయటపడింది. ఇలా తరచూ నకిలీ వస్తువులు, ప్యాకింగ్‌లో పురుగులు బయటపడుతున్నా అధికారుల తనిఖీలు.. చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయని ఆరోపణలు పెద్దఎత్తున వస్తున్నాయి. చూస్తూ ఊరుకుంటే మేస్తూ పోయిన చందంగా హైదరాబాద్ నగరంలో పోనుపోను ...11లో

కూలీల ఆటోను ఢీకొన్న బస్సు

- నలుగురు మహిళల మృతి



నవతెలంగాణ-మోతె

మిరప ఏరేందుకు ఆటోలో వెళు న్న కూలీలను బస్సు ఢీకొట్టడంతో నలుగురు మృతిచెందారు. ఈ ఘటన బుధవారం సూర్యాపేట జిల్లా మోతె మండలం హుసేనాబాద గ్రామంలో జరిగింది. ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండల పరిధిలోని రామసముద్రం గ్రామానికి చెందిన కందుల నాగమ్మ(60), చెవుల నారాయణమ్మ(62), రెమిడాల సౌభాగ్యమ్మ(60), రేపాల గ్రామానికి చెందిన పోగుల అనసూయమ్మ(70) మోతె మండలంలోని హుసేనాబాదలో మిరప ఏరడానికి బయల్దేరారు. కేశవాపురం వెళ్లే మార్గంలో ఉన్న అండర్‌పాస్ వద్ద ఆటోను ఖమ్మం జిల్లా మధిర డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొట్టింది. దాంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు సూర్యాపేట ఏరియాస్పత్రి లో చికిత్స పొందుతూ చనిపోయారు. మృతదేహాలకు ఏరియాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం పోలీసులు బంధువులకు అప్పగించారు. బాధితురాలు బెల్లంకొండ స్రవంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

- రిమ్స్ ఎదుట ఆదివాసీ సంఘాల రాస్తారోకో



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అస్వస్థతకు గురై రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. జైనథ్ మండలం మాంగూర్ల గ్రామానికి చెందిన మహేశ్వరి మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఆమె మంగళవారం అస్వస్థతకు గురవ్వడంతో పాఠశాల సిబ్బంది ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణం గానే తమ కుమార్తె మృతిచెందిందంటూ కుటుంబీకులు ఆరోపించారు. ఇందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఏటీడబ్ల్యూఓ కారణమంటూ ఆదివాసీ సంఘాల నాయకులు కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. బుధవారం రిమ్స్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 62,830	▼	10
22 క్యారెట్లు	- 57,590	▼	10
కిలో వెండి	- 75,400	▼	100



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	140
రిటైల్ (లైవ్)	రూ.	162
స్కిన్‌తో	రూ.	235
స్కిన్‌లెస్	రూ.	267

మేడారంలో ఘనంగా తిరుగువారం పండుగ

- ముగిసిన మేడారం మహా జాతర ఘట్టం




నవతెలంగాణ -తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క - సారలమ్మ పూజారులు బుధవారం తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. దాంతో మేడారం మహాజాతర ఘట్టం పూర్తిగా ముగిసినట్టు పూజారులు ప్రకటించారు. ఆదివాసీ పూజారులు దేవాలయాలను శుద్దిచేసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వాటికి తాళాలు వేశారు. కాగా తిరుగువారం సందర్భంగా మేడారంలో భక్తుల రద్దీ నెలకొంది. జాతరలో కీలక ఘట్టమైన సమ్మక్క వన ప్రవేశంతో జాతర శనివారం పరిసమాప్తమైంది. మేడారం గద్దెపై నుంచి చిలకలగుట్టకు సమ్మక్క చేరుకుంది. కన్నెపల్లికి సారలమ్మ, పూనుగొండ్లకు పగిడిద్దరాజు, కొండాయికి గోవిందరాజు పయనమయ్యారు. వన దేవతలు గద్దెలు విడిచే సమయంలో మేడారంలో వర్షం కురవడం విశేషం. వర్షాన్ని శుభ సూచకంగా భావించిన భక్తులు జయజయ ధ్వానాలు చేస్తూ అమ్మలకు ఘనంగా వీడ్కోలు పలికారు. తిరుగువారం మేడారం జాతరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వనదేవతలకు మొక్కులు చెల్లించుకుని, నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు.

గొర్రెల మందపై వీధి కుక్కల దాడి

- 120 గొర్రెలు మృత్యువాత



నవతెలంగాణ-తుంగతుర్తి

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామం లో మంగళవారం రాత్రి గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో 120 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. బాధితుడు దాయం రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నేండ్లుగా తన మామిడితోటలో 300 గొర్రెల పెంపకం చేపట్టాడు. రోజు మాదిరిగానే మంగళవారం సాయం త్రం గొర్రెలను షెడ్లలో తోలారు. పనివాళ్లు రాత్రి పది గంటల వరకు అక్కడే ఉండి ఇంటికెళ్లారు. ఆ తర్వాత వీధి కుక్కలు ఫెన్సింగ్ వైర్ కింద నుంచి మట్టి ని తోడి ద్వారం చేసుకొని గొర్రెల షెడ్డులోనికి ప్రవేశించాయి. 120 గొర్రెలను చంపేశాయి. మరో 20 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఎన్నికల కోడ్‌కు ముందే సీఏఏ ?

ఇస్లామిక్ దేశాల నుంచి వలస వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం

మతాన్ని నిరూపించే పత్రాన్ని సమర్పించాలి

- మతపరమైన వేధింపులపై ఆధారాలు అవసరం లేదు
- 15 రోజుల్లో నిబంధనలు నోటిఫై అవుతాయి : హోం శాఖ వర్గాలు



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ప్రవర్తనా నియమావళి అమలులోకి రాకముందే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుకు సంబంధించిన నిబంధన ల ను ప్రకటించే అవకాశం ఉంది. ఈ చట్టాన్ని 2019లోనే పార్లమెంట్ ఆమోదించిన విషయం తెలిసిందే. దీనిపై దేశంలోని కొన్ని ప్రాంతాల్లో నిరసనలు వ్యక్తమ య్యాయి. రానున్న పదిహేను రోజుల్లోనే సీఏఏ అమలు నిబంధనలను నోటిఫై చేయవచ్చునని హోం మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. 'నేను కచ్చితమైన తేదీని చెప్పలేను. కానీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రాకముందే నిబంధనలను నోటిఫై చేస్తాము' అని హోం శాఖ అధికారి ఒకరు తెలిపారు.

ఎన్నికల తేదీలను ప్రకటించిన వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుంది. వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. సీఏఏను నాలుగు సంవత్సరాల క్రితమే ఆమోదించినప్పటికీ నిబంధనలను నోటిఫై చేయకపోవడంతో అది అమలుకు నోచుకోలేదు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుండి వలస వచ్చిన ముస్లిమేతరులు భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులు హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, పార్సీలు, జైనులు, బౌద్ధులు అయి ఉండాలి. పైన తెలిపిన మూడు ఇస్లామిక్ దేశాల్లో ఈ మతాలకు చెందిన వారు వేధింపులకు గురవుతున్నారని అభిప్రాయపడుతున్న ప్రభుత్వం వారికి పౌరసత్వం మంజూరు చేయాలని భావిస్తోంది.

దరఖాస్తుదారులు 2014 డిసెంబర్ 31వ తేదీకి ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుండి భారత్‌కు వలస వచ్చారని ధృవీకరించేందుకు ఏయే పత్రాలు అవసరమవుతాయన్న విషయాన్ని నిబంధనల్లో నోటిఫై చేస్తారు. ఆ పత్రాన్ని భారత ప్రభుత్వం జారీ చేసి ఉండాలి. అది 2014 డిసెంబర్ 31 లోగా పొంది ఉండాలి. 'ఉదాహరణకు ఎవరైనా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారని అనుకోండి. అతను తన మతాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. ఎవరైనా 2014 డిసెంబర్ 31వ తేదీకి ముందు ఆధార్ పొంది ఉండి, చట్టంలో ప్రభుత్వం నిర్దేశించిన ఆరు మతాలలో ఏదైనా ఒక దానికి తాను చెంది ఉన్నానని ప్రకటించి ఉంటే దానిని కూడా అంగీకరిస్తారు. అదే విధంగా మతాన్ని సూచించే ఏ పత్రమైనా ఆమోదయోగ్యమే' అని హోం శాఖ వర్గాలు వివరించాయి.

సీఏఏ కింద దరఖాస్తులు సమర్పించడానికి కాలపరిమితి నిర్ణయించాలన్న అసోం డిమాండ్‌ను కూడా అంగీకరించవచ్చునని హోం శాఖ వర్గాలు తెలిపాయి. దరఖాస్తు చేసుకునేందుకు మూడు నెలల గడువు ఇస్తే సరిపోతుందని అసోం అభిప్రాయపడుతోంది. మతపరమైన వేధింపులకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని నిబంధనల్లో పొందుపరచకపోవచ్చు. ఎందుకంటే దేశంలోకి వలస వచ్చిన వారందరూ వేధింపులకు గురైన వారేనని లేదా వేధిస్తారేమోనన్న భయంతో వచ్చిన వారేనని ప్రభుత్వం భావిస్తోంది.

లోక్‌సభ ఎన్నికల లోగానే సీఏఏను అమలు చేస్తామని పలువురు కేంద్ర మంత్రులు ఇటీవలి కాలంలో ప్రకటిస్తు న్నారు. పశ్చిమ బెంగాల్‌లో గత సంవత్సరం డిసెంబర్ 26న కేంద్ర హోం మంత్రి అమిత్ షా బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ 'సీఏఏపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వలసవాదులను తరచుగా తప్పుదోవ పట్టిస్తున్నారు. మీకు స్పష్టం చేస్తున్నాను. సీఏఏను అమలు చేసి తీరతాం. దానిని ఎవరూ ఆపలేరు. ప్రతి వారికీ పౌరసత్వం లభిస్తుంది. అందుకు మా పార్టీ కట్టుబడి ఉంది' అని చెప్పారు.

మానవ జీవన ప్రమాణాల మెరుగుదలకు శాస్త్రం

సైన్స్‌ను కెరీర్‌గా ఎంచుకోండి

- నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ గ్రెగ్ ఎల్.సెమెంజా
- గీతంలో 'భారతదేశ అభివృద్ధి కోసం దేశీయ పరిజ్ఞానం'పై సదస్సు



నవతెలంగాణ-పటాన్‌చెరు

సైన్స్ (శాస్త్రం) ఎన్నో ఆవిష్కరణలకు బాటలు వేసి, మానవ జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతోందని, దానిని కెరీర్‌గా చేసుకోవాలని వర్ధమాన శాస్త్రవేత్తలు, నోబెల్ బహుమతి గ్రహీత, జాన్స్ హాప్కి స్కూల్ ఆఫ్ మెడిసిన్లోని జెనిటెక్ మెడియన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ గ్రెగ్ ఎల్.సెమెంజాతో సూచించారు. 'రా' ఆవిష్కరణను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. 'భారతదేశ అభివృద్ధి కోసం దేశీయ పరిజ్ఞానం'పై నిర్వహించిన సదస్సులో గ్రెగ్ మాట్లాడుతూ.. తన పాఠశాల రోజులు, విద్యా బుద్ధులు నేర్పి ఎదిగేందుకు ఊతమిచ్చిన తన అభ్యసకురాలు డాక్టర్ రోజన్ ఎస్. నెల్సన్‌ను గుర్తు చేసుకున్నారు. ముందుగా ఒక ఆలోచనతో ముందు కొచ్చినప్పుడు దాన్ని పరీక్షించాలని, దానికి తమలోని సృజనాత్మకతతో పాటు శాస్త్రీయ ఆలోచనలు అభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు. తన పరిశోధన నోబెల్ బహుమతి పొందిన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ.. శరీరంలో ఆక్సిజన్ స్థాయిలను నియం త్రించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రొటీన్ హెస్టోని ప్రేరేపించగల కారకాన్ని కనుగొనడానికి దారితీసిన సంచలనాత్మక పరిశోధనను విశదీకరించారు. అంతర్ విభాగ జ్ఞానాన్ని మార్పిడి చేసుకునే, సహకార వేదికలుగా తోడ్పడే సెల్ కల్చర్ ల్యాబ్, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంట్ ఫెసిలిటీ ల్యాబ్‌లను ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు.

సుస్థిర భవిష్యత్తు కోసం హరిత కార్యక్రమంగా ఒక మొక్కను నాటారు. ఆ తరువాత కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించారు. తొలుత భారత శాస్త్ర, సాంకేతిక విభాగం కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్‌ను పరిచయం చేయడంతో పాటు జాతీయ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరిం చారు. గీతం హైదరాబాద్ అదనపు ప్రొఫెసర్ డీఎస్. రావు, డాక్టర్ గ్రెగ్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఎపిస్టెమో వికాస్ లీడర్ షిప్ స్కూల్, కానరి గ్లోబల్ స్కూల్, డీపీఎస్-మియా పూర్, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్, పల్లవి ఇంటర్నే షనల్ స్కూల్ - కీసర, జెనెసిస్ ఇంటర్నేషన్ స్కూల్ (మూడు శాఖలు), పయనీర్స్ ఇంటర్నేషన్ స్కూల్, రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్ వంటి ఎనిమిది విభిన్న పాఠశాలం నుంచి దాదాపు 800 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని డాక్టర్ గ్రెగ్‌ను అడిగి పలు సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత పిటిషన్‌పై విచారణ మార్చి 13కు వాయిదా

- ఇరుపక్షాలు తుది వాదనలకు సిద్ధం కావాలని సుప్రీంకోర్టు ఆదేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో దర్యాప్తు సంస్థలు తనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా చూడాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మార్చి 13కు వాయిదా వేసింది. అలాగే ఆనాడు చేపట్టే తుది విచారణకు సిద్ధం కావాలని ఆదేశించింది. లిక్కర్ స్కాంలో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తనకు జారీ చేసిన సమన్లు రద్దు చేయాలని కోరుతూ గతేడాది మార్చిలో కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో ఈ పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం... కేంద్ర మాజీ మంత్రి చిదంబరం సతీమణి నళిని చిదంబరం, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీల పిటిషన్లతో ట్యాగ్ చేసింది. ఈ పిటిషన్లు బుధవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం ముందు జాబితా అయ్యాయి.

అయితే ఇతర పిటిషన్లపై విచారణతో సమయం లేకపోవడంతో కవిత పిటిషన్ ధర్మాసనం ముందు రీచ్ కాలేదు. కాగా కవిత తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కవిత పిటిషన్ విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే ఈడీ మళ్లీ నోటీసులు ఇచ్చిందని, కావున పిటిషన్ పై త్వరగా విచారణ చేట్టాలని కపిల్ సిబల్ అభ్యర్థించారు. తదుపరి విచారణకు రెండు రావాల టైం కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం... ప్రస్తుతం సమయం లేనందున రెండు వారాల తర్వాత విచారిస్తామని, ఈలోపు ఇరుపక్షాలు తుది వాదనలకు సిద్ధం కావాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను మార్చి 13న చేపడతామని వెల్లడించింది.

గృహజ్యోతి మార్గదర్శకాలు ఇవీ...

కరపత్రాల రూపంలో విస్తృత ప్రచారం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన లబ్దిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం ఈ స్కీంను ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అమల్లోకి తెస్తున్నామనీ, మార్చి 1వ తేదీ నుంచి 200 యూనిట్ల వరకు గృహ వినియోగ విద్యుత్‌కు 'సున్నా' బిల్లు వస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ స్కీం మార్గదర్శకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నది. దానికోసం సీఎం రేవంత్‌రెడ్డి పేరుతో కరపత్రాలను ముద్రించారు. వీటిని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తున్నారు. ఈ స్కీం పట్ల ప్రజల్లో ఉన్న అనుమానాలకు నివృత్తి లభిస్తుందని ప్రభుత్వం భావిస్తున్నది.

- ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఈ పథకం వర్తిస్తుంది.
- దరఖాస్తుదారులు ఆధార్ అనుసంధానించి తెల్లరేషన్‌కార్డును కలిగి ఉండాలి. దీనికి గృహ విద్యుత్ కనెక్షన్ కూడా అనుసంధానమై ఉండాలి.
- 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే అర్హత కలిగిన కుటుంబాలన్నీ ఆ నెలలో జీరో బిల్లు అందుకుంటాయి.
- ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 39.9 లక్షల కుటుంబాలు లబ్ది పొందుతాయి.
- అర్హతలు ఉండీ జీరో బిల్లురాని గృహ వినియోగదారులు తిరిగి దరఖాస్తు చేసుకొనే సదుపాయం ఉంది.
- ఎమ్మార్వో ఆఫీసు, మున్సిపల్ కార్యాలయాల్లో గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. తెల్ల రేషన్‌కార్డు, లింక్ చేయబడిన ఆధార్, గృహ విద్యుత్ కనెక్షన్ నెంబర్లు సమర్పించాలి.
- అర్హతలున్న వినియోగదారులు దరఖాస్తుల్ని ధ్రువీకరించుకొనే అవకాశం కల్పించినందున, వారి నుంచి బిల్లు రికవరీ కోసం ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరు.

భువనగిరి మున్సిపల్ చైర్మెన్
పదవి కాంగ్రెస్ కైవసం

- చైర్మెన్‌గా పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మెన్‌గా మాయ దశరథ
- అసంతృప్తితో కౌన్సిలర్ పచ్చర్ల హేమలత రాజీనామా



నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మున్సిపల్ చైర్మెన్ పదవి కాంగ్రెస్ వశమైంది. చైర్మెన్‌గా కాంగ్రెస్‌కు చెందిన పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మెన్‌గా మాయ దశరథ ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్ చైర్మెన్ ఎన్నిక కోసం అధీకృత అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.జయశ్రీ సమక్షంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎక్స్ అఫీషియో సభ్యులతో కలుపుకొని మొత్తం 36 మంది సభ్యులకు.. 30 మంది హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన వెంటనే బీజేపీ నుంచి నల్లమాస సుమ.. చైర్మెన్ అభ్యర్థిగా బొర్ర రాకేష్ పేరును ప్రతిపాదించగా, ఉదయగిరి విజయ్ కుమార్ బలపర్చారు. కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్మెన్ అభ్యర్థిగా పోతంశెట్టి వెంకటేశ్వర్లు పేరును జిట్టా వేణుగోపాల్ రెడ్డి ప్రతిపాదించగా.. కైరంకొండ వెంకటేశ్వర్లు బలపర్చారు. బొర్ర రాకేష్‌కి 5 ఓట్లు, పోతంశెట్టి వెంకటేశ్వర్లుకి 17 ఓట్లు వచ్చాయి. అనంతరం పోతంశెట్టి వెంకటేశ్వర్లుని చైర్మెన్‌గా అధికారి ప్రకటించారు. తదుపరి వైస్ చైర్మెన్ ఎన్నికలో కాంగ్రెస్ నుంచి మాయ దశరథ పేరును రత్నపురం బలరామ్ ప్రతిపాదించారు. జనగాం కవిత బలపర్చారు. పోటీ ఎవరూ లేకపోవడంతో వైస్ చైర్మెన్‌గా మాయ దశరథ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు.

అసంతృప్తిలో కాంగ్రెస్ వాదులు..

వైస్ చైర్మెన్ ఎంపిక విషయంలో కాంగ్రెస్‌లో కొందరు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సిలర్ పచ్చర్ల హేమలత వెంటనే రాజీనామా పత్రాలను కమిషనర్‌కు అందజేశారు. సీనియర్ కౌన్సిలర్ ప్రమోద్ కుమార్, ఆర్‌బినగర్ కౌన్సిలర్ తంగళ్ళపల్లి శ్రీవాణి కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు.

దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా మైనార్టీలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మైనార్టీలు దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా బ్రతికే పరిస్థితులు దాపురించాయని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మత సామరస్యాన్ని ప్రోత్సహించాల్సిన పాలకులే ఘర్షణలకు కారకులు అవడం దురదృష్టకరమని అన్నారు. బుధవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా దేశంలో మైనార్టీల అభద్రతాభావ జీవనంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత భయానక పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 75 ఏండ్ల తర్వాత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మైనార్టీలు ద్వితీయ శ్రేణి పౌరులుగా బతికే పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో అల్లర్లు, ఘర్షణలు జరిగితే పాలకులు అణిచివేసేవారని, కానీ ఇప్పుడు పాలకులుగా ఉన్నవారే ఘర్షణలకు కారణమవుతున్నారని చెప్పారు. దీనికి మణిపూర్, గుజరాత్ ఘటనలే ప్రత్యక్ష ఉదాహరణలనీ, ఈ స్థితి దేశ శ్రేయస్సుకు మంచిది కాదనీ, పరమత సహనం పాటించాలని అభిప్రాయపడ్డారు. యూపీఏ పదేండ్ల కాలంలో రాహుల్‌గాంధీ కావాలనుకుంటే ప్రధానమంత్రి అయ్యేవారనీ, కానీ ఆయన ఏనాడూ పదవిని ప్రేమించలేదన్నారు. ప్రజలను ప్రేమించడం, వారందర్నీ కలిపి ఉంచడమే ఆయన లక్ష్యమని వివరించారు. దానికోసమే రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు జోడో యాత్ర చేపట్టారనీ, ఇప్పుడు రెండో విడతలో మణిపూర్ నుంచి గుజరాత్ వరకు యాత్ర చేస్తున్నారని తెలిపారు. ఘర్షణలు చోటుచేసుకుంటున్న మణిపూర్‌కు ప్రధానమంత్రి, కేంద్ర హౌం శాఖ మంత్రి వెళ్లలేదనీ, రాహుల్ గాంధీ వెళ్లడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చి ఘర్షణలను నిరోధించాయని గుర్తుచేశారు. తెలంగాణలో లౌకిక ప్రభుత్వం ఏర్పడిందనీ, కేంద్రంలోనూ లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. జాతీయ స్థాయి ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీల ఔచిత్యం లేదనీ, ప్రాంతీయ పార్టీలు గెలుచుకునే సీట్లన్నీ నరేంద్ర మోడీకి ఉపయోగపడుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 2014లో 11, 2019లో 9 ఎంపీ సీట్లు గెలిచారనీ, ప్రధాని నరేంద్ర మోడీ తెచ్చిన ఆర్టికల్ 370 రద్దు, జీఎస్టీ, నోట్ల ఉపసంహరణ, రైతు వ్యతిరేక బిల్లులకు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రతి దశలోనూ కేసీఆర్ కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారుకు మద్దతుగా నిలిచారని అన్నారు. ఈ నేపథ్యంలో ఓట్ల చీలికకు అవకాశం ఇవ్వవద్దనీ, జాతీయస్థాయిలో లౌకిక ప్రభుత్వ ఏర్పాటు కోసం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో క్రైస్తవ మైనార్టీలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మెదక్ డయాసిస్ బిషప్ పద్మారావు, రెవరెండ్ జాన్ జార్జ్, డాక్టర్ ఏఎమ్‌జే కుమార్, శ్యామ్ అబ్రహం, అనిల్ థామస్‌తో పాటు వివిధ చర్చిలకు చెందిన క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, ఇండిపెండెంట్ చర్చిల ప్రతినిధులు ఉన్నారు. చర్చిల ఆస్తుల ఆక్రమణ సహా పలు సమస్యలను వారు ముఖ్యమంత్రికి వివరించారు. వీటి పరిష్కారంపై సీఎం సానుకూలంగా స్పందించారు.

బండి ప్రజాహిత యాత్రపై కోడిగుడ్ల దాడి



నవతెలంగాణ-భీమదేవరపల్లి

కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ నిర్వహిస్తున్న ప్రజాహిత యాత్రపై గుర్తు తెలియని వ్యక్తులు కోడిగుడ్లతో దాడికి పాల్పడ్డారు. నాలుగు రోజులుగా బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య పోటాపోటీగా అడ్డగింతలు, పరస్పర ఆరోపణలు చోటుచేసుకుంటున్న సంగతి తెలిసిందే. మంగళవారం రాత్రి హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం, రసూల్‌పల్లి మీదుగా యాత్ర చేపట్టి కొత్తకొండ హరిత హోటల్‌లో బండి సంజయ్ బస చేశారు. ఈ సందర్భంగా 350 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. బుధవారం ఉదయం యాత్రలో భాగంగా కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ముస్తఫాపూర్ గట్ల నర్సింగాపూర్ గ్రామాల మీదుగా యాత్ర చేసి మాజీ ప్రధాని, భారతరత్న దివంగత పీవీ నరసింహారావు ఇంటికి చేరుకుని పీవీ కుటుంబ సభ్యులను సన్మానించారు. అనంతరం ఆయన కాన్వాయి ముల్కనూరు వైపు బయలుదేరగా.. బస్టాండ్ సమీపంలోని సందులో నుంచి కోడిగుడ్లు కాన్వాయ్‌పై విసిరారు. కోడిగుడ్లు కాన్వాయ్ కెమెరామెన్ పై పడ్డాయి. పోలీసులు అప్రమత్తమై వెతకగా ఎవరూ దొరకలేదు. దాంతో బండి సంజయ్ ముమ్మాటికి పోలీసుల నిఘా వైఫల్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంజయ్ యాత్ర ఎల్కతుర్తి వైపు వెళ్ళగానే ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య పోటాపోటీ ప్రసంగాలు, పోలీసులు భారీగా మోహరించడం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పసుపునకు రికార్డు ధర

క్వింటాకు రూ.14,255

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ మార్కెట్ యార్డ్‌లో ఈ సీజన్‌లో పసుపు ధర అధికంగా రూ.14,255 పలికిందని మార్కెట్ యార్డ్ సెక్రెటరీ వెంకటేశం బుధవారం తెలిపారు. వన్నెల్(బి) గ్రామానికి చెందిన రైతు పన్నాల మహిత తండ్రి రాజేందర్‌కు చెందిన పసుపు పంట 17 క్వింటాళ్లు విక్రయానికి మార్కెట్ యార్డుకు తీసుకురాగా.. రికార్డు ధర రూ.14,255 పలికినట్టు తెలిపారు. ఈ సీజన్‌లో ఎక్కువ ధర అని తెలిపారు.

గ్రూప్-1 తర్వాతే డీఎస్సీ పరీక్ష నిర్వహించాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాక పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు నాలుగు నెలల సమయం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. జూన్ తొమ్మిదిన గ్రూప్-1 రాతపరీక్షలను నిర్వహించిన తర్వాతే డీఎస్సీ పరీక్షలను జరపాలని సూచించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనను బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాతపరీక్షలను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సి వస్తే అందరికీ ఒకే విడతలో ఒకే ప్రశ్నాపత్రంతో జరపాలని కోరారు. విడతల వారీగా నిర్వహిస్తే నార్మలైజేషన్‌తో అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఐదు శాతం ఓపెన్ కోటా ఒకే జిల్లాకు కాకుండా రాష్ట్రమంతా అవకాశం కల్పించాలని సూచించారు. ఇంటర్, డిగ్రీలో 45 శాతం మార్కుల నిబంధనను తొలగించి 40 శాతానికి సవరించాలని పేర్కొన్నారు.

ఓఆర్ఆర్ టోల్ టెండర్లపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఆ కంపెనీతో ఆ సంస్థ చేసుకున్న లావాదేవీలపై కూడా దర్యాప్తు చేయాలని రేవంత్ అధికారులను ఆదేశించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల వైపు ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్ గా తీసుకుని హైదరాబాద్ అభివద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు రేడియల్ రోడ్లు నిర్మించాలని చెప్పారు. ఇప్పటికే అభివద్ధి చెందిన సిటీతో పాటు కొత్తగా విస్తరిస్తున్న శివారు మున్సిపాల్టీల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. మాస్టర్ ప్లాన్-2050కి అనుగుణంగా ప్రత్యేక కన్సల్టెన్సీతో సిటీ అభివద్ధికి విజన్ డాక్యుమెంట్ ను రూపొందించాలని సీఎం సూచించారు.

హెచ్ఎండీఏ ఆస్తుల రక్షణకు చర్యలు

హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు, భూములు అన్యాక్రాంతం కాకుండా డిజిటల్, జీపీఎస్ విధానాలతో మ్యాపింగ్ చేసి పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. సంస్థ ఆస్తులు ఆక్రమణకు గురి కాకుండా డీఐజీ స్థాయి ఐపీఎస్ అధికారినీ, ఇద్దరు ఎస్పీ ర్యాంకు అధికారులకు బాధ్యతలు అప్పగించాలనిసూచించారు. ల్యాండ్ పూలింగ్ స్థలాల అభివృద్ధి విషయంలో జిల్లా కలెక్టర్ల సహకారం తీసుకుని సమన్వయంతో పని చేయాలని సూచించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 8,374 ఎకరాల ల్యాండ్ పార్శిళ్లలో 2,031 పార్శిళ్లు వివిధ స్థాయిల్లో కోర్టు కేసుల్లో ఉన్నవాటిపై దృష్టి పెట్టాలన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్ తదితర పట్టణాలన్నింటా లే అవుట్లలో కమ్యూనిటీ అవసరాలకు ఇచ్చిన స్థలాలు తమ అధీనంలో ఉన్నాయా? లేదా ఆక్రమణకు గురయ్యాయా? అనే అంశంపై వెంటనే సర్వే చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాఠశాలల ఏర్పాటుకు ముందుకొచ్చే కార్పొరేట్ కంపెనీలు, పేరొందిన పాఠశాలల యాజమాన్యాలకు వీటిని అప్పగించాలని సీఎం సూచించారు. ఆ ప్రాంతంలోని పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు కనీసం 25 శాతం కోటా అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

టూరిస్టు స్పాట్ల అభివృద్ధికి చర్యలు

హుస్సేన్‌సాగర్‌తో అంబేద్కర్ విగ్రహం, ఎన్టీఆర్ పార్కు, తెలంగాణ అమరుల జ్యోతి, అటు నెక్లెస్ రోడ్డు నుంచి ఇందిరా పార్కు, సంజీవయ్య పార్కు వరకు మొత్తాన్ని ప్రపంచ స్థాయి సందర్శ నీయ ప్రాంగణంగా తయారు చేయాలని సీఎం ఈ సందర్భంగా సూచించారు. హుస్సేన్ సాగర్ చుట్టూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్రమణ లను తొలిగించి, పర్యాటకులు, సిటీ ప్రజలు తీరికవేళలో ఆనందంగా గడిపేలా ఈ ప్రాంతాన్ని రూపొందించాలని సీఎం అధికారులకు వివరించా రు. దుబాయ్ తరహాలో స్కై వాక్ వే, ఫుడ్ స్టాళ్లు, చిల్డ్రన్ అమ్యూజ్మెంట్ జోన్, అభివద్ధి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ ముఖ్యకార్య దర్శి దాన కిషోర్, ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏలో విజిలెన్స్ సోదాలు

విలువైన ఫైల్స్‌పై విచారణ 50 మంది బృందంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు

- చెరువులు, ప్రభుత్వ భూముల, హైరైజ్ పర్మిషన్లపై పరిశీలన
- పలు ఫైల్స్‌పై అనుమానాలు వ్యక్తం
- కొంత మంది అధికారులపై కేసులు నమోదయ్యే అవకాశం

నవతెలంగాణ - రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

హెచ్ఎండీఏ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. పలు కీలకమైన ఫైల్స్‌ను పరిశీలించినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలు బయ టపెట్టేందుకు సిద్ధమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు హెచ్ఎండీఏ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు సోదాలు చేపట్టడంతో అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. సచివాలయంలో హెచ్ఎండీఏ, మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరుపుతున్న సమయంలోనే విజిలెన్స్ అధికా రులు హెచ్ఎండీఏలో సోదాలు నిర్వహిం చడం చర్చనీయంశంగా మారింది. మరో రెండు రోజుల పాటు జీహెచ్ఎంసీ, జిల్లా టౌన్ ప్లానింగ్ కార్యాలయాల్లో సైతం సోదాలు నిర్వహించే అవకాశం ఉన్నట్టు సమాచారం. గత పదేండ్లలో ఇచ్చిన పర్మిషన్లలో ముఖ్యమైన వాటిపై విచారణ జరుగుతున్నట్టు తెలుస్తోంది. హెచ్ఎండీఏ పరిధిలో ప్రభుత్వ లెక్కల ప్రకారం సమారు 3500 చెరువులు ఆన్‌లైన్ డేటా నుంచి మాయమైనట్టు గుర్తించారు. అలాగే, హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, చెరువులను కబ్జా పెట్టిన వాటికి.. ప్రభుత్వ అధికారులు పర్మిషన్లు ఎలా ఇచ్చారన్నదానిపై ప్రభుత్వం పలు కీలకమైన ఫైల్స్‌పై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టినట్టు సమాచారం. ఈ విచారణలో విలువైన ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు మాయం చేసి లేఅవుట్, అపార్ట్‌మెంట్స్ నిర్మించడానికి పర్మిషన్లు ఎట్లా ఇచ్చారన్నదానిపై ఆర తీసినట్టు తెలుస్తోంది. ఏ నిబంధనాల ప్రకారం ఇచ్చారన్నదానిపై హెచ్ఎండీఏ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు ఒక్కో ఫైల్‌పై అధికారులను ప్రశ్నించారు. ఇందులో భాగంగా గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఎంత మంది అధికారులు పని చేశారు. ఏయే ఫైల్స్ క్లియర్ చేశారన్నదానిపై ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ హెచ్ఎమ్‌డీఏ కార్యాయంలో సుమారు 50 మంది విజిలెన్స్ అధికారుల బృందంతో ప్రభుత్వం తనిఖీలు చేపట్టింది. హెచ్ఎమ్‌డీఏ ప్లానింగ్ డైరెక్టర్స్ కార్యాలయాల్లో, ప్లానింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్స్‌ను విచారించినట్టు సమాచారం. ఇందులో పలు కీలకమైన ఫైల్స్‌లో తప్పులు దొర్లినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. అయితే తప్పుడు పర్మిషన్లు, ఆన్‌లైన్ పర్మిషన్లు కాకుండా, చేతి రాతలతో ఇచ్చిన పర్మిషన్లు సైతం ఉన్నట్టు సమాచారం. అక్రమ పర్మిషన్ల విషయంలో పలువురు అధికారులపై కేసులు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మరో రెండు రోజులు పాటు జీహెచ్ఎమ్‌సీ, జిల్లా టౌన్ ప్లానింగ్ కార్యాలయాలపై సైతం విజిలెన్స్ సోదాలు నిర్వహించనున్నట్టు సమచారం.



అండగా ఉండి ఆదుకుంటాం

- దుబాయ్ జైలు నుంచి విడుదలై వచ్చిన వారికి ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శ
- ఉపాధి కల్పిస్తామని భరోసా

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

ఉన్న ఊరిలో ఉపాధి కరువై పొట్టచేత పట్టుకొని దుబాయ్ వలస వెళ్లి ఓ హత్య కేసులో 18ఏండ్లు అక్కడ జైలు శిక్ష అనుభవించి ఇటీవల విడుదలై స్వగ్రామం చేరుకున్న సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరుకు చెందిన బాధితులను బుధవారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. ఎమ్మెల్యే కేటీఆర్‌ను చూడగానే బాధిత కుటుంబీకులు బోరున విలపించగా.. ఆయన వారిని ఓదార్చారు. వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. అధైర్య పడొద్దని, ఉపాధి కల్పించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భాష తెలియక తెలియని తప్పుకు 18ఏండ్లుగా జైలు శిక్ష అనుభవించిన వారిని విడిపించి స్వదేశానికి తీసుకొచ్చామన్నారు. ఇంకా ఒకరు దుబాయిలోనే శిక్ష అనుభవిస్తున్నారని, అతడిని కూడా విడిపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయవాదులు, విలేకరులు, కేంద్ర ప్రభుత్వం ఇలా ఎంతోమంది కృషి వల్ల ఏడు సంవత్సరాల జైలు శిక్ష కాలం మిగిలి ఉండగానే నలుగురు బాధితులు స్వదేశానికి తిరిగి వచ్చారని తెలిపారు. సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. బాధితులను స్వదేశానికి తీసుకురాకడమే కాకుండా.. ఉపాధి కల్పించే బాధ్యత తనపై ఉందన్నారు. ప్రభుత్వం కూడా బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయని, నకిలీ ఏజెంట్ల చేతిలో మోసపోయి గల్ఫ్ దేశాలకు వెళ్లి ఇబ్బందులు పడొద్దని సూచించారు. కేటీఆర్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చెరకుకు ధరేది...?

చెరకు పండించే రైతులకు గిట్టుబాటు ధర కరువైంది. ఫెయిర్ అండ్ రెమ్యునరేషన్ ప్రైస్(ఎఫ్ఆర్‌సీ)ని కొసరేసినట్టు పెంచి కేంద్రం చేతులు దులుపుకుంటుంది. రైతుల ఆదాయాలను రెండింతలు చేస్తామని వాగ్దానం చేసి ఎన్నికల్లో లబ్దిపొందిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ నిలువునా ముంచుతోంది. ఏడాదంతా కష్టపడి చెరకు పండిస్తే తీరా అరకొర ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి తప్ప పంటకు ధర పెరగట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క కేంద్రం నిర్లక్ష్యంచ మరో పక్క స్థానికంగా చక్కెర మిల్లులు క్రషింగ్ అయ్యాక రైతులకు బిల్లులివ్వకుండా ఎగ్గొట్టిపోతున్నాయి. పంటకు ధర రాక.. అమ్మాక చేతికి పైకం రాక రెండు రకాలుగా చెరకు రైతులు నష్టపోతున్న పరిస్థితి.



- ఎఫ్ఆర్‌సీ పెంపూ కొసరే
- అరకొర ధర తప్ప గిట్టుబాటు ధర ఇవ్వని కేంద్రం
- క్రషింగ్ చేశాక బిల్లులు ఎగ్గొడుతున్న మిల్లులు
- చెరకు రైతుల పట్ల మోడీ సర్కార్ నిర్దయ
- గిట్టుబాటు ధర కల్పించాలి : రైతు సంఘం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఎకరాల వరకు చెరకు పంట సాగవుతుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి, పత్తి తర్వాత చెరకు పంట అధికంగా సాగవుతోంది. ముఖ్యంగా జహీరాబాద్, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంఘం, సంగారెడ్డి, హత్నూర, టేక్మాల్, కంది, సదాశివపేట వంటి మండలాల్లో కలిపి 20 వేల ఎకరాల్లో చెరకును సాగు చేస్తున్నారు. దీర్ఘకాలిక పంట కావడంతో ఏడాదిలో ఒక పంట మాత్రమే చేతికొస్తుండగా.. దానికీ సరైన ధర లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట సాగుకు సంబంధించి ఎరువులు, పురుగు మందులు, దున్నకం, కూలీలు, రవాణా ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఆ మేరకు పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమయిందని రైతు సంఘాలు అభిప్రాయ పడుతున్నాయి.

ఎఫ్ఆర్‌సీ పెంచడంలో కేంద్రం తాత్సారం

కేంద్ర ప్రభుత్వం పెరిగిన సాగు ఖర్చులకు తగ్గట్టుగా ధర పెంచడంలో విఫలమవుతోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చెరుకు ఎఫ్ఆర్‌సీ (ఫెయిర్ అండ్ రెమ్యునరేషన్ ప్రైస్)ని స్వల్పంగా పెంచింది. కేంద్రం తీసుకున్న నిర్ణయం పట్ల రైతులు, రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం చెరకు పంట టన్ను ధర రూ.3150 ఉండగా.. గతేడాది రూ.3 వేలు ఉంది.. కేంద్రం రూ.150 ఎఫ్ఆర్‌సీ మాత్రమే పెంచింది. ఒక లీటర్ డీజిల్ ధర మేరకు కూడా టన్ను చెరకు ధర పెంచని పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు.

సాగు, కటింగ్, రవాణా ఖర్చుల భారం

చెరకు సాగుకు ఏడాదంతా రైతులు కష్టపడి పనిచేయాలి. చెరకు ముక్క నాటడం మొదలు పంట కటింగ్ వరకు ఏటేటా పెట్టుబడులూ పెరుగుతున్నాయి. ఒక్కో రైతు కనీసం ఐదు నుంచి పది పదిహేను ఎకరాల్లో చెరకు సాగు చేస్తున్నారు. కౌలుదారులే ఎక్కువగా ఉన్నందున అదనంగా కౌలు భారం కూడా పడుతుంది. పంట ఎదుగుదల కోసం నీటి పారుదల, ఎరువులు, పురుగు మందుల వాడకం కోసం వేలల్లో ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కేవలం పెట్టుబడులకు కూడా సరిపోవడం లేదని పలువురు చెరకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరకు నరికిన తర్వాత సరుకును మిల్లు వరకు తరలించే బాధ్యత చక్కర కర్మాగారానిదే ఉండేట్టు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రూ.9 కోట్ల బకాయిలు ఎగ్గొట్టిన ట్రైడెంట్

ట్రైడెంట్ చక్కెర మిల్లు యాజమాన్యం చెరకు రైతులకు రూ.9 కోట్ల బకాయిలు బాకీ పడింది. 2022-23 సీజన్‌లో 2.55 లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేశారు. టన్నుకు రూ.3270 చొప్పున ధర నిర్ణయించింది. మొదటి విడత టన్నుకు రూ.3 వేలు మాత్రమే చెల్లించింది. మిగతా రూ.270 పెండింగ్ పెట్టింది. జనవరి, ఫిబ్రవరిలో చెరకు సరఫరా చేసిన రైతులకు పూర్తి స్థాయిలో బిల్లులు బకాయి పడింది. జోన్ పరిధిలో ఉన్న 2287 మంది రైతులు కర్మాగారానికి చెరకును సరఫరా చేయగా.. వీరిలో 1699 మంది రైతులకు రూ.270 చొప్పున బకాయి పెట్టింది. మిగతా రైతులకు పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించాల్సి ఉంది. రూ.83 కోట్ల బిల్లులు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.74 కోట్లు మాత్రమే చెల్లించి మిగతా రూ.9 కోట్లు చెల్లించలేదు. రైతులకు రావాల్సిన బకాయిల్ని ఇప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే మాణిక్యరావు, నిజాం షుగర్ రివైవల్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ ఇతర ప్రతినిధులు కర్మాగారం యజమాని రామ్‌నాథ్‌తో చర్చలు జరిపారు.

చెరకు టన్ను ధర రూ.4500 ఇవ్వాలి: యాదవరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

చెరకు పండించే రైతులకు టన్నుకు రూ.4500 ధర ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఆర్‌సీని వంద, రెండు వందలు కాకుండా చెరకు సాగు ఖర్చుల్ని బట్టి రైతుకు గిట్టుబాటు ధర చెల్లించే విధంగా ధరల్ని ప్రకటించాలి. గతేడాది రూ.150 పెంచిన ప్రభుత్వం ఈ సారి ఎన్నికలున్నాయని మరో వంద అదనంగా పెంచింది. నిత్యం పెరుగుతున్న ధరల ప్రభావం వల్ల సాగు ఖర్చులు మాత్రం వేలల్లో పెరిగాయి. ట్రైడెంట్ కర్మాగారం చెల్లించాల్సిన రూ.9 కోట్ల బకాయి బిల్లుల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని రైతులకు ఇప్పించాలి. ప్రభుత్వ చక్కెర కర్మాగారాల్ని పునరుద్ధరించి అందుబాటులోకి తేవాలి.

సంపాదకీయం

రోడ్లు మింగేస్తున్నాయ్..

రెక్కాడితేగాని డొక్కాడని లక్షలాది మందిని పనుల్లేక ఆకలి కబళించడమే కాదు, ఆ కూలి పనులకెళ్లేటపుడో, వచ్చేటపుడో నల్లతాచులాంటి రోడ్లు, రోడ్లపై వాహనాలు కూడా మింగేయడం నేటి వాస్తవం. పది పదిహేను మంది నెక్కించుకుంటే గాని పెరిగిన పెట్రోల్ చార్జీలతో తమ జీవిత బండిని నెట్టుకుపోలేని ఆటోలు, పశువుల్లాగా మందే సుకుని నడిచే ట్రాక్టర్ ట్రాలీల్లో గ్రామాల మధ్య, రాష్ట్రాల మధ్య ఆకలే కందెనగా నడిచే లక్షలాది కూలీల జీవితాలు ఏ విధంగా అర్థాంతరంగా ముగిసిపోతున్నాయో నిన్న మోతే దగ్గర జరిగిన ప్రమాదమే సాక్ష్యం.

ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఏటా 13 లక్షల మంది ఉసురుతీస్తున్నాయి. మరో రెండు కోట్లకుపైగా క్షతగాత్రులవుతున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి గంటకు 53 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారని 2022 నాటి కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీరిలో 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వారే 69 శాతం.

మన రాష్ట్రంలో ఎక్కువ ప్రమాదాలు సా॥ 6 నుండి రాత్రి 9 గంటల మధ్యనే జరుగుతున్నాయి. గతేడాది మొత్తం 94వేలకు పై ప్రమాదాలు జరిగినట్టు గణాంకాలు చెప్తున్నాయి. ఇది మొత్తం దేశంలో జరిగిన ప్రమాదాల్లో 20 శాతానికి పైగానే ఉన్నాయి. ప్రమాదాల్లో పాదచారులే ఎక్కువగా మరణిస్తున్నారు. ప్రమాదాల నుంచి పాదచారులను కాపాడేందుకు 31 చోట్ల పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా... గతేడాదికంటే ఈ ఏడాది మృతుల సంఖ్య అధికంగా ఉంది.

రహదారుల్లో ఈ మధ్య చోటుచేసుకున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మొన్న ఏపీలో మిర్చి యార్డులో మిరప పంట అమ్మగా వచ్చిన రూ.10 లక్షల నగదుతో ఇంటికి బయల్దేరిన ముగ్గురు రైతులు ఆటో ప్రమాదంలో నగదుతోపాటు బుగ్గి కావడంతో ఆ కుటుంబాల వేదన వర్ణనాతీతం. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత సైతం ఈ వారంలోనే కారు ప్రమాదానికి బలయ్యారు. ఇలా ఎన్నో ప్రమాదాలు.

ఏడెనిమిది సెకన్లలోనే వంద కిలోమీటర్లకుపైగా వేగాన్నందుకునే బైకులు, కారులు, ఇతర వాహనాలు ఒక వైపు.. రాష్ట్రంలో గుంతలు, ఎగుడుదిగుళ్లతో నరకానికి నకళ్లుగా మారిన రహదారులు మరోవైపు.. ఉన్నాయి. కొన్ని దేశాల్లో వాహనాల ఉత్పత్తి దశలోనే స్పీడ్ కంట్రోల్‌కు అవసరమైన చర్యలు చేపట్టి అద్భుత ఫలితాలు సాధిస్తుండగా, మన దేశంలో అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. కార్పొరేట్ల ఒత్తిడికి తలొగ్గి అభివృద్ధి చెందిన దేశాల రహదారులకు అనువైన మితిమీరిన వేగంతో వెళ్లే వాహనాలకు ఇక్కడ అనుమతిస్తున్నారు. వీటికి అనుమతించడంలో ఉన్న శ్రద్ధ, రహదారుల అభివృద్ధిపైనా, సరైన భద్రతా ప్రమాణాలను



నెలకొల్పడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేకపోవడం.. సామాన్యుల ఉసురుతీస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఏటా 13 లక్షల మంది ఉసురుతీస్తున్నాయి. మరో రెండు కోట్లకు పైగా క్షతగాత్రులవుతున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి గంటకు 53 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారని 2022 నాటి కేంద్రప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీరిలో 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వారే 69 శాతం.


ఉపాధి మార్గాలు కుంచించుకుపోతున్నాయి. మోడీ సర్కారు ఏలుబడిలో... గత మూడేళ్లలో ఉపాధి హామీ పని దినాలు కోటి తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో పనులు వెతుక్కుంటూ దూర ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. పని కోసం నిత్యం ఆటోలు, లారీలు, వ్యాన్లు తదితర వాహనాల్లో వెళ్లే... వీరు ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి. రోడ్ సెస్ వసూలు చేయడంపైనున్న శ్రద్ధలో కొంతయినా రోడ్ల నిర్వహణపై పెట్టాలి. వసూలైన సెస్ సొమ్ము కొత్త రోడ్ల నిర్మాణానికి, ఉన్నవాటి నిర్వహణకు మాత్రమే ఉపయోగించాలి. అలా గాకుండా ప్రభుత్వాలు 'తమ' ప్రాధాన్యతలను బట్టి మళ్లించకుండా కట్టుదిట్టమైన నిబంధనలుండాలి. రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకునేందుకు సకల చర్యలు చేపట్టాలి.

ఈ ఏడాది మృతుల సంఖ్య అధికంగానే ఉంది. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్‌స్పీడ్, నిర్లక్ష్య డ్రైవింగ్ ఇత్యాది కారణాలతో 2023లో వేర్వేరు ప్రమాదాల్లో 121 మంది పాదచారులు మృతిచెందారు. వీరిలో అత్యధికులు వృద్ధులు, యాచకులే.

ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేసే సంఘాలు ఎప్పట్నించో మొత్తుకుంటున్న విషయమేమంటే రోడ్ ఇంజనీరింగ్ సిస్టమే మన దేశంలో, రాష్ట్రంలో అధ్వాన్నస్థితిలో ఉన్నాయి. మన తెలంగాణలో ఏడు వందలకు పైగా 'బ్లాక్ హోల్స్' ఉన్నట్టు గుర్తించినా ఈ పదేండ్లలో ఇంకా 300కి పైగా చోట్ల రిపేర్లు జరగలేదు. అదే చేసుంటే మహబూబ్‌నగర్ జిల్లా 'పాలెం' వద్ద బస్సు తగలబడి పదుల సంఖ్యలో ప్రయాణికులు మంటలకాహుతి అయ్యుండే వారే కాదని ప్రభుత్వ నివేదిక చూస్తే అర్థమవుతుంది.

నిదానంగా వెళ్లే వాహనాలు, అత్యంత వేగంగా వెళ్లే ఎస్.యు.వి. లాంటి వాహనాలు ఒకే రోడ్డుపై వెళ్లడం, అక్కడే సైకిల్స్ కూడా వెళ్లడం, టర్నింగుల వద్ద సరైన సిగ్నల్స్ లేకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వీటిని సరి చేయడం ప్రభుత్వాల బాధ్యత.

ఎన్నికల బాండ్లు- మోడీ అవినీతి, వంచన



నీలోత్పల్ బసు

మోడీ ప్రభుత్వం తీరుతెన్నులను స్పష్టంగా తెలిపే వ్యవహారం ఎలొక్టరల్ బాండ్లు. "చట్టబద్ధమైన" బ్యాంకింగ్ లావాదేవీగా ఎలొక్టరల్ బాండ్లను ప్రవేశపెట్టడం ద్వారా తాము మరింత పారదర్శకతను ప్రవేశపెడుతున్నామని, కార్పొరేట్ల విరాళాలను అందరికీ తెలిసేలా చేయనున్నామని, దాని వలన ఎన్నికల్లో నల్ల డబ్బు ప్రవహించడం నిలిచిపోతుందని చాలా గొప్ప కబుర్లు చెప్పారు. అంతవరకూ ఎవరు ఎవరికి ఎంత విరాళం ఇస్తున్నారో తెలియని పరిస్థితి ఉందని, ఇకముందు ఆ విధంగా ఉండబోదని ప్రకటించారు. కాని, సుప్రీం కోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు ఈ ప్రభుత్వం అసలు ఉద్దేశ్యాలను బయట పెట్టింది. "రాజుగారు- దేవతా వస్త్రాలు" కథలోని రాజు మాదిరిగా ఈ ప్రభుత్వం బండారం ఇప్పుడు నగ్నంగా బయటపడింది.

సుప్రీం తీర్పు సారాంశం

సుప్రీం కోర్టు తీర్పు ఎలక్టొరల్ బాండ్ల స్కీమును సంపూర్ణంగా కొట్టివేసింది. ఆ స్కీమును, దానితోబాటు ఆదాయపన్ను చట్టానికి, కంపెనీల చట్టానికి, ప్రజా ప్రాతినిధ్య చట్టానికి, రిజర్వు బ్యాంక్ చట్టానికి చేసిన సవరణలను సైతం చెల్లనివిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. ఈ మొత్తం ఎలొక్టరల్ బాండ్లకు సంబంధించిన వ్యవహారమంతా రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసేలా సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఉంది. ఈ దేశంలో కార్పొరేట్లు ఏ యే రాజకీయ పార్టీలకు నిధులు అందిస్తున్నాయో తెలుసుకునే ప్రాథమిక సమాచార హక్కు దేశ పౌరులందరికీ ఉందన్న మౌలిక ప్రాతిపదిక మీద ఈ తీర్పు ఆధారపడింది.

అసోసియేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రైట్స్ (ఎడిఆర్) అనే హక్కుల సంస్థ, భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్టు) ఈ ఎలొక్టరల్ బాండ్ల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కేసు దాఖలు చేశాయి. ప్రతివాదిగా కేంద్ర ప్రభుత్వం వాదించింది. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి, వారి వారి రాజకీయ పార్టీల గురించి పూర్తి సమాచారం తెలుసుకునే హక్కు వోటర్ల కు ఉందని, అటువంటి పూర్తి సమాచారం ప్రాతిపదికనే వారి వోటు హక్కు పూర్తిగా సద్వినియోగం అవుతుందని కేసు దాఖలు చేసినవారు వాదిస్తే, విరాళాలిచ్చే కార్పొరేట్ దాతల వివరాలను గోప్యంగా ఉంచుకునే హక్కు వారికి ఉందని ప్రభుత్వం తరఫున వాదించారు. ఐదుగురు న్యాయమూర్తులతో ఏర్పడిన ధర్మాసనం ఈ కేసులో ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. వారిలో నలుగురి తరఫున ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తీర్పు ఉత్తర్వులు రాయగా ఇంకొక న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా వేరే తీర్పు ఉత్తర్వులు రాశారు. ఐతే నిర్ధారణ విషయంలో తక్కిన నలుగురితోనూ ఆయన ఏకీభవించారు. అందరూ ఎలొక్టరల్ బాండ్లకు ఏ మాత్రమూ రాజ్యాంగబద్ధత లేదని నిర్ధారించారు. తమ వివరణలో న్యాయమూర్తులు ఇందుకు సంబంధించి చట్టాలకు చేసిన సవరణలు రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణం కల్పించిన సమాచారహక్కుకు భంగకరంగా ఉన్నాయని తెలిపారు. స్వేచ్ఛగా, న్యాయంగా జరగవలసిన ఎన్నికలను ఈ సవరణలు దెబ్బ తీస్తాయని అన్నారు. ఎలొక్టరల్ బాండ్ల ద్వారా ఎవరెవరు విరాళాలు ఇచ్చినదీ వెల్లడించాల్సిందేనన్నారు. తమ విరాళాలకు ప్రతిఫలాన్ని పొందడానికే రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు విరాళాలు ఇస్తాయి గనుక ఆ సమాచారం ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉండాలని అన్నారు. ఒకానొక కంపెనీ నష్టాల్లో నడుస్తున్నప్పటికీ ఆ కంపెనీ ఇచ్చే విరాళాలకు పరిమితులు లేకుండా చేస్తూ కంపెనీల చట్టానికి చేసిన సవరణ ఏకపక్షంగాను, రాజ్యాంగ విరుద్ధంగాను ఉన్నదని న్యామూర్తులు తమ తీర్పులో తెలిపారు. భారతీయ కంపెనీల విదేశీ అనుబంధ సంస్థల నుండి ఎన్నికల విరాళాలను అనుమతించడం వలన సర్వసత్తాకమైన మన వ్యవస్థలో ఎన్నికల ప్రజాస్వామ్యానికి, దేశ స్వావలంబనకు హాని జరుగుతుందని, భారతీయ పౌరులు చట్టబద్ధంగా తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే హక్కును ఇది దెబ్బ తీస్తుందని వారు తీర్పులో తెలిపారు.

మొత్తం 232 పేజీల తీర్పులో నలుగురు న్యాయమూర్తుల తరఫున ప్రధాన న్యాయమూర్తి వెలువరించిన తీర్పు 158 పేజీలు ఉండగా, జస్టిస్ ఖన్నా 75 పేజీల తీర్పులో తక్కినవారితో ఏకీభవించారు. "చట్టసభలకు, అధికార యంత్రాంగానికి ఉన్న అధికారాల రీత్యా, ప్రాధాన్యతరీత్యా" ఈ మాదిరి కేసుల విషయంలో న్యాయస్థానాలు తగు విధంగా లోతుగా ఆలోచించి నిగ్రహంతో వ్యవహరించాలంటూ ఈ కేసులో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోకుండా ఉండేలా ఒత్తిడి చేయడానికి ప్రభుత్వం చాలా ప్రయత్నించింది. కాని సుప్రీంకోర్టు ఆ ప్రయత్నాలను తిప్పికొట్టింది. "మన దేశ న్యాయ సూత్రాల అసలైన స్వభావం ప్రకారం" చూసినా ఈ ఎలొక్టరల్ బాండ్ల స్కీము ఆర్థిక విధానం కిందకు రాదని స్పష్టం చేసింది. రిజర్వు బ్యాంకు చట్టంలోని 31వ సెక్షన్ కు సవరణ చేయడం అనేది ఆర్థిక పరమైన అంశం కావొచ్చు కాని ఈ స్కీములో అది ప్రధానం కాదని, దాతల పేర్లను గోప్యంగా ఉంచడం, కార్పొరేట్ల విరాళాలపై పరిమితులు లేకపోవడం-ఈ రెండూ అసలు కీలకమైనవి అని, అవి ఎన్నికల ప్రక్రియకు సంబంధించినవి అని అభిప్రాయపడింది. ఆ కారణంగా ఈ కేసులో సర్వోన్నత న్యాయస్థానానికి జోక్యం చేసుకునే హక్కు ఉందని స్పష్టం చేసింది.

ఎలక్టొరల్ బాండ్ల లావాదేవీల సమాచారాన్ని వెల్లడించవలసిన అవసరం లేదంటూ ఫైనాన్సు చట్టానికి సవరణలు చేసింది మోడీ ప్రభుత్వం. తమకు ఎలక్టొరల్ బాండ్ల ద్వారా అందిన విరాళాల వివరాలను రాజకీయ పార్టీలు బహిరంగ పరచనవసరం లేదంటూ ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేసింది. రాజకీయ పార్టీలు ఆ విరాళాల వివరాల రికార్డును నిర్వహించవలసిన అవసరం లేదంటూ మినహాయింపు కల్పించే విధంగా ఆదాయ పన్ను చట్టాన్ని సవరించింది. రాజకీయ పార్టీలకు ఎలక్టొరల్ బాండ్ల ద్వారా చెల్లించిన విరాళాల వివరాలను గాని, తాము ఏ రాజకీయ పార్టీకి లనుబంధంగా వ్యవహరిస్తున్నామన్న వివరాలను గాని కంపెనీలు వెల్లడి చేయనవసరం లేకుండా కంపెనీల చట్టాన్ని సవరించింది.

అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన ఈ తీర్పు చరిత్రాత్మకమైనది. భారతదేశంలో రాజకీయంగా పెద్ద స్థాయిలో అసమానతలు నెలకొన్నాయని ఆ తీర్పు గుర్తించింది. ఈ అసమానతలను పెంచి పోషించడంలో డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తున్నదని పేర్కొంది. దాని పర్యవసానంగా భారీగా విరాళాలు



ఇవ్వగలిగిన కొద్దిమంది వ్యక్తులు రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేయగలుగుతున్నారని భావించింది. "ఎప్పుడైతే ఆర్థిక అసమానతలు పెరుగుతాయో, డబ్బుకు, రాజకీయాలకు సంబంధం ఎప్పుడైతే బలపడుతుందో అప్పుడు వివిధ తరగతుల ప్రజలు రాజకీయల్లో పోషించే పాత్ర వేరువేరుగా ఉంటుందని" తీర్పు ప్రకటించింది. భారీగా విరాళాలవ్వగల కార్పొరేట్ దాతలకు రాజకీయాల్లో పెద్ద పీట వేసి ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే అవకాశం వారికి ఈ స్కీము కల్పిస్తుందని తీర్పులో న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈ కారణాల చేత, "విధానాల రూపకల్పనకు, ఆర్థిక విరాళాలకు మధ్య పరస్పర సంబంధం" ఉన్నదీ లేనిదీ అంచనాకు రావడానికి వీలుగా వోటరుకు పూర్తి సమాచారం ఉండాలని తెలిపారు. పూర్తి గోప్యత ఉండాల్సిందేనన్న వాదనను న్యామూర్తులు తిరస్కరించారు. ఎన్నికల బాండ్ల ద్వారా పొందిన విరాళాలలో అత్యధిక భాగం రూ. ఒక కోటి, అంతకు పైబడిన మొత్తాల రూపంలోనే ఉన్నాయని, విరాళాలు పొందిన రాజకీయ పార్టీలలో అత్యధిక భాగం కేంద్రం లోనో, రాష్ట్రాలలోనో అధికారంలో ఉన్న పార్టీలేనని జస్టిస్ ఖన్నా తన తీర్పులో వివరంగా తెలిపారు.

అవినీతి, మోసంతో నిండిన దుర్మార్గ చర్య

పెద్ద నోట్ల రద్దుతో దేశంలోని నల్లధనాన్ని బైటకు రప్పిస్తానని మోడీ చేసి ప్రకటన, ఆ నోట్ల రద్దు ఎంత మోస పూరితమో, ఎలక్టొరల్ బాండ్ల స్కీము విషయంలో ప్రభుత్వం చేసిన ప్రకటన, దాని వెనుక ఉద్దేశ్యాలు అంతే మోసపూరితమైవి. ఈ సంగతి ఇప్పుడు తేటతెల్లమైంది. నగదు ఉపయోగం మీద సాగించిన యుద్ధం చివరికి అంతులేని కార్పొరేట్ నల్ల ధనానికి చట్టబద్ధత కల్పించింది. అదే మాదిరిగా ఎలక్టొరల్ బాండ్ల స్కీము దొడ్డిదారిన అవధులు లేని కార్పొరేట్ విరాళాలకు చట్టబద్ధత కల్పించింది. ఎలక్టొరల్ బాండ్లను కొనుగోలు చేసే కార్పొరేట్లకు ఆ సొమ్ము ఏ విధంగా వచ్చినదీ వెల్లడి చేయాలన్న నిబంధన ఏదీ లేదు. అంటే "నల్ల ధనానికి దొడ్డితోవన చట్టబద్ధత కల్పించడానికి ఎలక్టొరల్ బాండ్ల స్కీము ఉపయోగపడుతుంది, పైగా అందుకు బ్యాంకింగ్ రంగం తోడ్పడుతుంది" అని తీర్పులో పేర్కొన్నారు.

ఎన్నికల బాండ్లను బ్యాంకులు విక్రయించే విధానం కూడా అర్థం లేనిది. ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు పొందే విరాళాలను ఆ పార్టీలు ఏ విధంగా ఖర్చు చేయాలో నియంత్రించే విధానం ఏదీ లేదు. అంటే, ఇది కేవలం ఎన్నికల ప్రక్రియలో భాగంగా మాత్రమే లేదు. దానిని దాటి ముందుకు పోయింది. ఆ సొమ్మును ఆ రాజకీయ పార్టీలు ఏ విధంగానైనా ఖర్చు చేయవచ్చు. ఎన్నికలలో మొత్తం పోటీ చేసిన అభ్యర్థులందరికీ కలిపి ఎంత ఎన్నికల ఖర్చు పరిమితిని ఎన్నికల కమిషన్ నిర్దేశించిందో, ఆ మొత్తాన్ని మించి అదనంగా ఎలక్టొరల్ బాండ్ల ద్వారా పార్టీలకు విరాళాలు ముట్టాయి. ఈ లెక్కలన్నింటినీ సుప్రీం కోర్టు పరిశీలించింది. ఎలక్టొరల్ బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టక మునుపు కార్పొరేట్లు ఇచ్చిన ఎన్నికల విరాళాలతో పోల్చితే ఈ స్కీమును తెచ్చాక వాళ్లు ఇచ్చిన విరాళాలు అమాంతం పెరిగిపోయాయి. దీనిని బట్టి ఈ స్కీము కార్పొరేట్లు, రాజకీయ పార్టీలు "ఇచ్చి పుచ్చుకునేందుకు" రూపొందిందని సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్య ఎంత సహేతుకమో తేలింది.

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పు కార్పొరేట్లకు, పాలకపార్టీలకు మధ్య ఒక అపవిత్ర కలయిక కొనసాగుతోందన్న సత్యాన్ని నిర్ధారించింది. ఈ స్కీము అందుకోసమే రూపొందిందని కోర్టు భావించింది. బీజేపీ ఇప్పుడు తన మోసాన్ని కప్పిపుచ్చుకోడానికి నానా పాట్లూ పడుతోంది. ఈ మోసపూరితమైన స్కీము వలన తామొక్కరే కాకుండా ప్రయోజనాలు పొందిన రాజకీయ పార్టీలు ఇంకా కూడా ఉన్నాయి. అయినప్పటికీ, దీనిని ముందుకు తెచ్చిన పార్టీగా బీజేపీదే ప్రధాన పాపమౌతుంది. ఈ స్కీమును ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్ని ఏ విధంగా కబ్జా చేసిందీ, ఎవరెవరికి ఆర్థిక లబ్ధి కలిగించడం కోసం ఆ విధంగా బీజేపీ వ్యవహరించిందీ ఈ దేశం విస్మరించడానికి వీలు లేదు. తన ప్రభావం ఒక్క రాష్ట్రానికే పరిమితం అయినప్పటికీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అందుకున్న విరాళాలలో 95 శాతం కేవలం ఎలక్టొరల్ బాండ్ల ద్వారా వచ్చినవేనన్న వాస్తవం చాలా ప్రశ్నలను రేపుతోంది.

"మన దేశ న్యాయ సూత్రాల అసలైన స్వభావం ప్రకారం" చూసినా ఈ ఎలొక్టరల్ బాండ్ల స్కీము ఆర్థిక విధానం కిందకు రాదని స్పష్టం చేసింది. రిజర్వు బ్యాంకు చట్టంలోని 31వ సెక్షన్ కు సవరణ చేయడం అనేది ఆర్థిక పరమైన అంశం కావొచ్చు కాని ఈ స్కీములో అది ప్రధానం కాదని, దాతల పేర్లను గోప్యంగా ఉంచడం, కార్పొరేట్ల విరాళాలపై పరిమితులు లేకపోవడం-ఈ రెండూ అసలు కీలకమైనవి అని, అవి ఎన్నికల ప్రక్రియకు సంబంధించినవి అని అభిప్రాయపడింది. ఆ కారణంగా ఈ కేసులో సర్వోన్నత న్యాయస్థానానికి జోక్యం చేసుకునే హక్కు ఉందని స్పష్టం చేసింది.

పోటీలో ఉండేవారికందరికీ ఒకేలా నిబంధనలు

ఎన్నికల బరిలో ఉండేవారందరికీ ఒకే విధమైన నియమాలు వర్తించేలా చేయడానికి, ఎన్నికల ప్రక్రియ కు ఎలక్టొరల్ బాండ్ల స్కీము ద్వారా కలిగిన విఘాతాన్ని నిలవరించి సరి చేయడానికి వీలుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు, ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు నిర్దిష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. ఐతే ఈ మార్గదర్శకాలు ఈ స్కీమును ప్రారంభించినప్పటినుంచీ వర్తించవు. ఎలక్టొరల్ బాండ్లు రాజ్యాంగవిరుద్ధం అని సుప్రీం కోర్టు ప్రకటించినప్పటికీ, ఈ తీర్పును వెలువరించడంలో జరిగిన విపరీతమైన జాప్యం ఫలితంగా వివిధ రాజకీయ పార్టీల మధ్య ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయి. అదే విధంగా రాజ్యాంగ విరుద్ధంగా స్వీకరించిన ఆ విరాళాలను రాజకీయ పార్టీలు తమవద్ద భద్రపరుచుకోవచ్చునా అన్న ప్రశ్న ఇంకా ఉంది.

సీపీఐ(ఎం) ఈతీర్పును స్వాగతించింది. ఈ ఎలక్టొరల్ బాండ్లను చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించాలంటూ మొదటి నుంచీ మా పార్టీ వివిధ చట్టాలకు పార్లమెంటులో సవరణలు ప్రతిపాదించిన దశ నుండీ పోరుతూనే వుంది. అన్ని వేదికల లోనూ పోరాడిన తర్వాత చివరికి సుప్రీంకోర్టు గుమ్మం తొక్కింది. మా పార్టీ తరఫున ఎన్నికల బాండ్లను పొందడం కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎటువంటి ఖాతాను తెరవకుండా, కార్పొరేట్ల విరాళాలను తిరస్కరించడం ద్వారాఈ విషయంలో మా నిబద్ధతను ముందు నుంచీ నిలబెట్టుకుంటూనే వున్నాం. ఈ కేసు విచారణ సందర్భంలో ప్రధాన న్యాయమూర్తి సైతం ఈ విషయాన్ని గుర్తించారు.

సమూలమైన ఎన్నికల సంస్కరణలకోసం పోరాడుతున్న మా పార్టీకి ఈ తీర్పు అదనపు శక్తినిచ్చిందని భావిస్తున్నాం. ఈ పోరాటంలో మాతో పాటు కృషి చేసే ఇతర రాజకీయ పార్టీలతో కలిసి ముందుకు సాగుతాం. ఎన్నికల నిధుల విషయంలో పూర్తి పారదర్శకత ఉండేలా చేయగలిగితే అది ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్య స్వభావాన్ని పరిరక్షించడంలో ప్రధానం ఔతుంది. కార్పొరేట్లకు, రాజకీయాలకు నడుమ నెలకొన్న అపవిత్ర కలయికను బద్దలు చేయడం ఇప్పుడు చాలా ముఖ్యమైన కర్తవ్యం.

(స్వేచ్ఛానుసరణ)

సీపీఐ(ఎం) ఈతీర్పును స్వాగతించింది. ఈ ఎలక్టొరల్ బాండ్లను చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించాలంటూ మొదటి నుంచీ మా పార్టీ వివిధ చట్టాలకు పార్లమెంటులో సవరణలు ప్రతిపాదించిన దశ నుండీ పోరుతూనే వుంది. అన్ని వేదికల లోనూ పోరాడిన తర్వాత చివరికి సుప్రీంకోర్టు గుమ్మం తొక్కింది. మా పార్టీ తరఫున ఎన్నికల బాండ్లను పొందడం కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎటువంటి ఖాతాను తెరవకుండా, కార్పొరేట్ల విరాళాలను తిరస్కరించడం ద్వారాఈ విషయంలో మా నిబద్ధతను ముందు నుంచీ నిలబెట్టుకుంటూనే వున్నాం. ఈ కేసు విచారణ సందర్భంలో ప్రధాన న్యాయమూర్తి సైతం ఈ విషయాన్ని గుర్తించారు.

ధిక్కారపు పతాకనైత



నడినెత్తికి ఎండొచ్చిన
కన్నీరును ఆవిరిచెయ్యలే
కారుచీకట్లను నమ్ముకొని
శూన్యంలో చిక్కుకుపోతి

దెప్పిపొడుపులు కూడబెట్టిన
ధైర్యాన్ని ముక్కలు చేస్తున్నె
అవమానాలు గొంతునున్న
అన్నం ముద్దను దిగనియట్లేవు

సూటిపోటి మాటలు గునపాలై
గుండె లోతుల్లో గాయం చేస్తుంటే
మానవత్వం అనే మలాము
ఎక్కడ బందీఅయిందో కనిపిస్తలేదు

స్వార్థాల ఊయలలో ఊగలేదు
వ్యసనాల మత్తులో తూగలేదు

సాయం అడిగినోల్లకి
అరచేతిని అందించిన
దు:ఖంలో ఉన్నోల్లతో
కన్నీళ్లను పంచుకున్న

చివరకి కష్టం నా తలుపు తట్టితే
తొంగి చూసేటోల్లు లేకపోతిరి
బాధల్లో కంట నీరు
తుడిచేటోల్లు కూడా కరువైతిరి

పర్వాలే మినుగురులా
చీకటిని కాల్చే నిప్పు రవ్వనైత
వీచే గాలికి
ఎదురు ఈది సవాలు చేసే
ధిక్కారపు పతాకానైత

- ఆకాష్ మునిగాల, 8106390647

దాడులు ఆపండి - సమస్య పరిష్కరించండి



ఎస్. వీరయ్య

ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం సుమారు మూడేండ్లుగా పోరాడుతున్న పేదలు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్ల ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర మాసాలు దాటింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహబూబాబాద్‌లో గుడిసెల కేంద్రం ధ్వంసం చేసారు. మరో వారం రోజుల్లోనే హన్మకొండలో ఒక కేంద్రం ధ్వంసం చేసి నాయకులను అరెస్టు చేసారు. ఇండ్ల పట్టాల కోసం ఎదురుచూస్తున్న గుడిసెవాసులకు ఈ ఘటనలు తీవ్ర ఆందోళన కలిగించాయి. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని వాగ్దానం చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో మోసపోయిన పేదలు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానాలతో ఇండ్ల స్థలాలకు పట్టాలు వస్తాయని, ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తారని ఎదురుచూస్తున్నారు. నిజానికి బీఆర్‌ఎస్ పాలనా కాలంలో ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న గుడిసెవాసులకు రాష్ట్రంలో అనేకచోట్ల కాంగ్రెస్ నాయకులు మద్దతునిచ్చారు. అదే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలోకి రావడంతో పేదల ఆశలు బలపడ్డాయి. రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్లస్థలాలు లేని పేదలు 30లక్షల మంది ఉన్నారని గత ప్రభుత్వం 'సమగ్ర కుటుంబ సర్వే' ద్వారా తేల్చింది. దీని తీవ్రతను గమనించిన కాంగ్రెస్, ఈ సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది.

మహబూబాబాద్, హన్మకొండ ఘటనల తర్వాత సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకత్వ బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని, గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి సమస్యను పరిష్కరించాలని కోరింది. అక్రమ కేసులన్నీ రద్దు చేయాలని, గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలివ్వాలని, ఇండ్లు కట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు సహాయం చేయాలని సీపీఐ(ఎం) కోరింది. కేసులు రద్దు చేస్తామని ముఖ్యమంత్రి స్వయంగా హామీ ఇచ్చారు. ఇండ్ల స్థలాలు కూడా తప్పకుండా ఇస్తామని చెప్పారు. మరోవైపు జగిత్యాలలోను, కోరుట్లలోను మరింత పకడ్బందీగా పోలీసులు దాడులు చేసారు. అర్ధరాత్రి నాయకులను, కార్యకర్తలను ఇండ్లలో నిద్రలేపి అరెస్టులు చేసారు. అదే సమయంలో గుడిసెల కేంద్రాలను జెసిబిలతో నేలమట్టం చేసారు. పేదల డబ్బులు, సామాన్లు ఏమైనాయో తెలియటంలేదు. అరెస్టు చేసిన నాయకుల మీద మాత్రం హత్యాయత్నం వంటి నేరాలను కూడా మోపారు. పలుకుబడి కలిగిన భూకబ్జాదారులు, రియలెస్టేట్ బ్రోకర్లతో కుమ్మక్కైన పోలీసులు, రెవిన్యూ అధికారులు ఈ దాడులకు పాల్పడ్డారు. అంతటితో ఆగలేదు. తరువాత పెద్దపల్లిలో కూడా నాలుగు గుడిసెల కేంద్రాలను ధ్వంసం చేసేందుకు పథక రచన చేసారు. జగిత్యాల, కోరుట్లలో 21మంది మీద హత్యాయత్నం నేరం మోపారు. ఆరుగురిని 22 రోజులపాటు, మరో ముగ్గురిని 38 రోజుల పాటు జైలుకు పంపారు. బెయిల్ మీద బయటికి రాకుండా కేసు తర్వాత కేసు మోపేందుకు ప్రయత్నించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ, మరో నలుగురు మహిళలతో పాటు 9మందిని జైలుపాలు చేసారు. పరిస్థితి తీవ్రతను పదేపదే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సీపీఐ(ఎం) తెచ్చింది. ముఖ్యమంత్రితో మూడుసార్లు, గృహనిర్మాణ శాఖ మంత్రితో రెండుసార్లు చర్చించింది. మూడేండ్ల పోరాటంలో బీఆర్‌ఎస్ నాయకత్వం పెట్టిన కేసులు ఎత్తివేయవలసిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ పాలనలో కూడా కేసులు పెట్టడం సరైంది కాదని చెప్పింది. ఈ అన్ని సందర్భాలల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. కానీ ఆచరణలో కేసులు ఇంకా రద్దు కాకపోగా కొత్తగా కేసులు పెట్టారు. భూ పోరాట సందర్భంగా ఈ మూడేండ్లలో మొత్తం 717మంది మీద 79 కేసులు బనాయించారు. పేదల ఇండ్ల కోసం పోరాడుతున్న నాయకుల మీద హత్యాయత్నం నేరం మోపటం అధికారుల దుర్బుద్ధిని సూచిస్తున్నది. ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వం ఈ కేసులను తక్షణం రద్దు చేయటం సమంజసం.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే బస్తీలు, గ్రామాలలో వారం రోజులపాటు అధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఒకే అప్లికేషన్‌లో అనేక సమస్యల ప్రస్తావనకు అవ కాశం ఇచ్చారు. కానీ ఇండ్ల స్థలాల సమస్య ఆ లిస్టులో లేదు. సహజంగానే గుడిసెవాసులకు ఆందోళన కలిగించే విష యం. అందుకే తహశీల్దార్ కార్యాలయంలో ఇండ్ల స్థలాల కోసం పేదలు పెట్టుకున్న దరఖాస్తులన్నీ పరిగణనలోకి తీసుకోవాలి.

మూడేండ్లుగా ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం సాగుతున్న పోరాటం అనేక నిర్బంధాలను చవిచూసింది. జక్కలొద్ది తదితర కేంద్రాలలో రౌడీమూకల దాడులను కూడా ఎదుర్కోవలసి వచ్చింది. ఒకవైపు ఎన్నికల క్యాంపెయిన్ జరుగుతుండగానే మహబూబాబాద్‌లో 18వ సారి గుడిసెల కేంద్రాన్ని ధ్వంసం చేసారు. 10మంది మహిళలను పోలీస్‌స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టి జైలుపాలు చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 19వసారి కూడా ధ్వంసం చేసారు. వరంగల్‌లోని జక్కలొద్ది (ప్రగతినగర్) కేంద్రం మీద కూడా ఎన్నికల క్యాంపెయిన్ సమయంలోనే బీఆర్‌ఎస్‌కు చెందిన శాసనసభ్యుడు రౌడీమూకలను ఎగదోసి దాడులు చేయించాడు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న కొండా సురేఖ పేదలకు మద్దతు ప్రకటించారు. ఇప్పుడు మంత్రి కూడా అయ్యారు. సహజంగానే పేదలకు న్యాయం జరుగుతుందని ఎదురుచూస్తున్నారు.

భూపోరాట కేంద్రాల గురించి అధికారులు, రియలెస్టేట్ బ్రోకర్లతో కుమ్మక్కై, అనేకచోట్ల దుష్ప్రచారం చేస్తున్నారు. ఇండ్ల స్థలాల పేరుతో కొందరు డబ్బు వసూళ్లు చేసుకుంటున్నారని, ప్లాట్లు అమ్ముకుంటున్నారని నిందలు మోపుతున్నారు. ఇండ్లు ఉన్న పేదలు కూడా మళ్లీ గుడిసెలు వేస్తున్నారనీ, అమ్ముకోవడం కోసమే ఈపని చేస్తున్నారనీ, ఇతర జిల్లాల నుంచి కూడా వచ్చి గుడిసెలు వేస్తున్నారనీ ఆరోపిస్తున్నారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే విచారణ జరిపించి వాస్తవాలు నిగ్గు తేల్చాలని సీపీఐ(ఎం) సవాల్ చేసింది. ఇల్లు లేని పేదలు ఇతర జిల్లాల నుంచి కూడా వచ్చి ఆశపడి గుడిసెలు వేసుకోవచ్చు. ఎవరి జిల్లాలో వారికి ఇండ్ల స్థలాలకు పట్టాలు లేదా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే ఈ సమస్య రాదు కదా! పైగా అర్హులకే ఇవ్వాలని సీపీఐ(ఎం) స్పష్టంగా కోరింది. ఇక అనర్హుల సమస్య ఎందుకొస్తుంది? కొన్నిచోట్ల అధికారులు మరికొన్ని వాదనలు చేస్తున్నారు. జిల్లాలో కూడా ఆ పట్టణం వారికే లేదా ఆ మండలం వారికే పట్టాలు ఇస్తామని అంటున్నారు. ఇది అర్థరహితం. వ్యవసాయేతర పనుల కోసం గ్రామీణ పేదలు పట్టణాలకు వలసలు పోతున్నారు. సహజంగానే అక్కడ స్థిరపడుతున్నారు. వారికి ఇండ్ల స్థలాలు కేటాయించడం ప్రభుత్వ బాధ్యత. చెట్లు, పొదలు, చెత్తాచెదారం తొలగించి ఊరవతల గుడిసెలు వేసుకున్న పేదలు పాములు, తేళ్ళతో సహజీవనం చేస్తున్నారు. మంచి నీరు, కరెంటు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు లేక సతమతమవుతున్నారు. పసిపిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందుల పాలవుతున్నారు. ఎన్నికల సమయంలో అనేకమంది నాయకులు ఈ గుడిసెవాసుల ఓట్ల కోసం వచ్చారు. ఈ పేదలను ఓటర్లుగా చూసిన నాయకులు వీరిని మనుషులుగా కూడా చూడాలి. వారికి మునిసిపల్, గ్రామపంచాయతీ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించాలి.

ఇప్పటికే ఓటమిని ఊహించని బీఆర్‌ఎస్ నాయకత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినరోజు నుంచే శాపనార్థాలు పెట్టడం మొదలుపెట్టింది. ఆరు గ్యారంటీల అమలు కోసం వంద రోజులు కూడా ఓపిక పట్టకుండా అసహనం ప్రదర్శించింది. ప్రజలు దీనిని అంగీకరించలేదు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా మాట నిలబెట్టుకోవాలి. గృహ నిర్మాణ శాఖమంత్రిని సీపీఐ(ఎం) నాయకత్వం కలిసినప్పుడు సంక్రాంతి దాటగానే ఇండ్లస్థలాలు కేటాయిస్తామని చెప్పారు. తక్షణం గుడిసెలు వేసుకున్న పేదలకు అక్కడే స్థలం కేటాయించి పట్టాలు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. పౌరులందరికీ ఇంటి వసతి జీవించే హక్కులో భాగమని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. జీవించే హక్కును భారత రాజ్యాంగం కల్పించింది. అందుకే ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా ఇండ్లు, ఇండ్లస్థలాల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి.



ఒకవైపు ఎన్నికల క్యాంపెయిన్ జరుగుతుండగానే మహబూబాబాద్‌లో 18వ సారి గుడిసెల కేంద్రాన్ని ధ్వంసం చేసారు. 10మంది మహిళలను పోలీస్‌స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టి జైలుపాలు చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 19వసారి కూడా ధ్వంసం చేసారు. వరంగల్‌లోని జక్కలొద్ది (ప్రగతినగర్) కేంద్రం మీద కూడా ఎన్నికల క్యాంపెయిన్ సమయంలోనే బీఆర్‌ఎస్‌కు చెందిన శాసనసభ్యుడు రౌడీమూకలను ఎగదోసి దాడులు చేయించాడు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న కొండా సురేఖ పేదలకు మద్దతు ప్రకటించారు. ఇప్పుడు మంత్రి కూడా అయ్యారు. సహజంగానే పేదలకు న్యాయం జరుగుతుందని ఎదురుచూస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
రాజన్న సిరిసిల్ల
గురువారం | ఫిబ్రవరి 29, 2024 | www.navatelangana.com

సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి భూమి పూజ


పనులకు భూమి పూజ చేస్తున్నా జడ్పీటీసీ, నాయకులు

నవతెలంగాణ - రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలోని 16వ వార్డులో రూ.7లక్షల 50వేల జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు జెడ్పీటీసీ గట్ల మీనయ్య బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ 16వ వార్డు ప్రజల ఇబ్బందులను గుర్తించి రోడ్డు, డ్రెయినేజీ కోసం నిధులు మంజూరు చేసినందుకు జెడ్పీ చైర్‌పర్సన్ అరుణకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిసి రోడ్లు, డ్రెయినేజీలు, బోర్ మోటార్లు వేశామన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ప్యాక్స్ డైరెక్టర్ కేసిరెడ్డి నర్సారెడ్డి, గ్రామఅధ్యక్షుడు దయ్యాల కమలాకర్ పాల్గొన్నారు

రైతుల సంఘీభావ ర్యాలీలో ఎల్లారెడ్డిపేట నాయకులు



ప్లకార్డులతో ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : డిల్లీలో జరుగుతున్న రైతులకు సంఘీభావంగా రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి పిలుపుమేరకు బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రైతుల సంఘీభావ ర్యాలీలో ఎల్లారెడ్డిపేట కిసాన్ కాంగ్రెస్ నాయకులు నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ కార్యదర్శి వంగ మల్లారెడ్డి, ఎల్లారెడ్డిపేట కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండేటి రాంరెడ్డి, ముస్తాబాద్ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాంరెడ్డి, మండల కిసాన్ కాంగ్రెస్ నాయకులు మానుక సతీష్, వట్టెల శేఖర్‌లు పాల్గొన్నట్లు కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

నాగరికతను నేర్పిన నేతన్న ప్రాణాలు కాపాడాలి

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను సంక్షోభం నుంచి రక్షించాలి
- కార్మికులకు, ఆసాములకు ఉపాధి కల్పించాలి
- ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు వెంటనే ఇవ్వాలి
- సిరిసిల్లలో నేతన్నల ర్యాలీ, మహాధర్నా



సిరిసిల్లలో మహా ధర్నాకు ర్యాలీగా వెళ్తున్న నేతన్నలు, నాయకులు




మహాధర్నాలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ సభ్యులు చెరుపల్లి సీతారాములు | సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్ బాబు | పవర్లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్


సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న నేతన్నలు

నవతెలంగాణ సిరిసిల్ల :

నాగరికతను నేర్పి ప్రజల మానం కాపాడిన నేతన్నల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని శాసనమండలి మాజీ సభ్యులు చెరిపెల్లి సీతారాములు అన్నారు. సిరిసిల్లలోని బుధవారం తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్, ఆసాముల సమన్వయ కమిటీ సీఐటీయూ ఆధ్వర్యంలో సిరిసిల్లలో నేతన్నల మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల మైదానంలో నుంచి ఆసాములు కార్మికులు ర్యాలీగా నేతన్న విగ్రహం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వచ్చి అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో మహాధర్నా చేపట్టారు. సుమారు 1300మంది కార్మికులు ధర్నాలో పాల్గొన్న ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు, పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో సిరిసిల్లలో నేడు నేత కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ప్రస్తుతం నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసాములు కార్మికులే కాకుండా యజమానులు కూడా పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రజలకు, కార్మికులకు ద్రోహం చేసిందన్నారు. కేటీఆర్‌కు ఓట్లు వేసి గెలిపించింది ఈ కార్మికులు కాదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ సమావేశాల్లో నేతన్నలకు ఉపాధి చూపిస్తామని హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేయించింది కానీ వాటికి సంబంధించిన బకాయిలను, కార్మికుల యారన్ సబ్సిడీ బకాయిలను చెల్లించలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా టెస్కోకి చెల్లించాల్సిన రూ.482కోట్లను చెల్లించకపోవడం, దీనికితోడు జనవరిలో ఇవ్వవలసిన బతుకమ్మ చీరల ప్రభుత్వ రంగ సంస్థలకు కావలసిన వస్త్రాల ఉత్పత్తికి ఆర్డర్స్ ఇవ్వకపోవడం వలన వస్త్ర పరిశ్రమ యాజమాన్యం పవర్ లూమ్స్‌ను మూసివేయడంతో ఉపాధి లేక కార్మికులు దిక్కుతోచని స్థితిలోకి నెట్టబడ్డారని, ప్రభుత్వాలు తమ బాధ్యతను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 365రోజుల క్యాలెండర్ కార్మికుల సంక్షేమం కోసం తయారు చేసినప్పటికీ మూడు మాసాలు మాత్రమే కార్మికులకు పని కల్పించిందని ప్రస్తుత ప్రభుత్వం 365రోజులు సిరిసిల్ల నేతన్నలకు పని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూశం రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు ఉన్న హక్కులను చట్టాలను కాలరాస్తున్నదని, జాతీయ టెక్స్టైల్ బోర్డును రద్దు చేయడం మహాత్మా గాంధీ బునకర్ బీమా యోజన ఐసిఐసిఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం హౌస్ కం వర్క్ షెడ్ వంటి తదితర పథకాలను రద్దుచేసి కార్మికుల బతుకులపై ఉక్కు పాదాన్ని మోపిందన్నారు. ఇంత జరుగుతున్నా బీజేపీ ఎంపీ బండి సంజయ్ తన నియోజకవర్గం పరిధిలో ఉన్న కార్మికుల సమస్యలపై టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధి కోసం పార్లమెంటులో ఒక్కసారైనా నోరు మెదపలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల సంక్షోభ నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రభుత్వ రంగ సంస్థలకు ఆశ, అంగన్వాడీ, వర్కర్స్‌కు చీరలు ప్రభుత్వ ఆసుపత్రులు, ఆర్టీసీ, మున్సిపల్, గ్రామపంచాయతీ, సింగరేణి, పోలీస్, ప్రభుత్వ కార్యాలయాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలకు ప్రభుత్వ హాస్టల్స్ తదితర సంస్థలకు కావలసిన వస్త్రాలను రాష్ట్రంలోని కార్మికుల ద్వారా ఉత్పత్తి చేయించి 365 రోజుల పాటు నిరంతరాయంగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆసాముల సంఘం అధ్యక్షులు సిరిసిల్ల రవి, కార్యదర్శి చేరాల అశోక్, సహాయ కార్యదర్శి మండల రాజు, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు జవ్వాజి విమల, సూరం పద్మ సీఐటీయూ జిల్లా నాయకులు మోర అజయ్, అన్నల్‌దాస్ గణేష్, వార్పిన్ యూనియన్ అధ్యక్షులు సిరిమల్ల సత్యం, గౌరవ అధ్యక్షులు ఉడుత రవి, వైపని యూనియన్ అధ్యక్షులు కుమ్మరి కుంట కిషన్, ఆడెపు సంపత్, ఒగ్గు గణేష్, సీఐటీయూ జిల్లా నాయకులు నక్క దేవదాస్, గుండు రమేష్, గోవిందు లక్ష్మణ్, బెజిగం సురేష్, కంది మల్లేశం, గడ్డం రాజశేఖర్, గోనె పరశురాములు, కనకయ్య, పోచమల్లు, సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'విజ్ఞాన్' స్కూల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


విద్యార్థులు చేసిన సెన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సేవం పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరిలు పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను జడ్పిటిసి చీటి లక్ష్మన్‌రావు, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, వరుస కృష్ణహరిలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యండి లతీఫ్, ప్రిన్సిపాల్ శరత్ కుమార్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు బదిలీ

నవతెలంగాణ - సిరిసిల్ల : సిరిసిల్ల ఆర్డీఓ ఎస్.ఆనంద్ కుమార్‌ను కోరుట్ల ఆర్డీఓగా, వేములవాడ ఆర్డీఓ మధుసూదన్‌ను జగిత్యాల ఆర్డీఓగా బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హన్మకొండ ఆర్డీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఎల్.రమేష్‌ను సిరిసిల్ల ఆర్డీఓగా, కోరుట్ల ఆర్డీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రాజేశ్వర్‌ను వేములవాడ ఆర్డీఓగా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో కొనసాగుతున్న చేరికలు..

మంత్రి పొన్నం సమక్షంలో కౌన్సిలర్ దంపతులు చేరిక


పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలుకుతున్న మంత్రి ప్రభుత్వ విప్..

నవతెలంగాణ - వేములవాడ రూరల్

వేములవాడ పట్టణానికి చెందిన 24వ వార్డు కౌన్సిలర్ అన్నారం ఉమా రాణి-శ్రీనివాస్ సుమారు 50 మందితో బుధవారం బీసీ సంక్షేమ, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరినట్టు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ ఇప్పపుల అజయ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ - సిరిసిల్ల

ముస్తాబాద్ మండలం సేవలలతండా గ్రామానికి చెందిన లకావత్ శ్రీరామ్‌పై అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను వేధించాడని ఫోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో రాజీ కుదుర్చుతానని లకావత్ మున్నా అనే వ్యకి రూ.1.80లక్షలు తీసుకుని మోసం చేయగా లకావత్ శ్రీరామ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు లకావత్ మున్నాపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ భీమ్ శర్మ తెలిపారు.

భూకబ్జాలకు పాల్పడిన మాజీ ఉపసర్పంచ్‌కు రిమాండ్

నవతెలంగాణ - సిరిసిల్ల

భూ కబ్జాలకు పాల్పడిన మాజీ ఉపసర్పంచ్ పెద్దూరు తిరుపతిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం రాత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తంగళ్లపల్లి మండలానికి చెందిన గజభీమ్కార్ రాధాబాయీ 1996సంవత్సరంలో భూమి కొని రిజిస్ట్రేషన్ చేసుకోగా, ఇటీవల తంగళ్లపల్లికి చెందిన పెద్దూరు తిరుపతి అనే వ్యక్తి రాధాబాయికి చెందిన 20గుంటల భూమిని బెదిరించి ఆక్రమించుకున్నాడు. రాధాభాయి ఇచ్చిన ఫిర్యాదుతో పెద్దూరు తిరుపతి మీద తంగళ్ళపల్లి పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్ట ఎస్పీ తెలిపారు.

హోంగార్డుకు ఆత్మీయ వీడ్కోలు



నవతెలంగాణ - సిరిసిల్ల

జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా 33సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న రవీందర్‌ను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పూలమాల వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. హోంగార్డు రవీందర్ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందారని శుభాకాంక్షలు తెలియజేస్తు వెల్ఫేర్ ఫండ్ నుండి ఆర్థిక సహాయంగా రూ.10వేల చెక్ అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్మడ్ డిఎస్పీ గంగాధర్,ఆర్.ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ పాల్గొన్నారు.

గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ నాయకుల సంబరాలు



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రెండు గ్యారెంటీలను అమలుచేస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ప్రజలకు స్వీట్లను పంపిణి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగం గౌడ్ పాల్గొన్నారు.

మంత్రి పొన్నంపై బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు


మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పై ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సరి కాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు చేర్ల పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిరిసిల్ల పట్టణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బండి సంజయ్ కేవలం రాముడి పేరు చెప్పుకుంటూ, పాదయాత్రలు చేస్తూ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వ్యక్తిగత దూషణలు సరికాదని, వెంటనే వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలన్నారు. లేనిపక్షంలో మహిళలందరం ఏకమై రాష్ట్రంలో ఎక్కడ తిరగకుండా బండిని అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన గ్యారెంటీలలో మహాలక్ష్మి, గృహలక్ష్మి పథకాలు ప్రారంభించడం పట్ల గాంధీ చౌక్ లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెలిముల స్వరూప, మాజీ కౌన్సిలర్ చంద్రకళ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సానియా, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు.

నవతెలంగాణ - ముస్తాబాద్ : ఇచ్చిన హామీలను అమలుకోసం కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, సోనియాగాంధీ చిత్రపటాలకు బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు, ఎంపీటీసీ గుండెలి శ్రీనివాస్ ,జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రాజగోపాల్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : నవ సమాజం వైపు ముందుకు సాగాలంటే విద్యార్థి దశనుంచే శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భాగ్యనగర్ రాజగోపాల్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలోని మూఢ విశ్వాసాలను నమ్మకుండా శాస్త్రీయంగా ఆలోచించాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. దేశాభివృద్ధి నేటి తరం విద్యార్థులపై ఉందన్నారు. శాస్త్రీయ పరిజ్ఞానంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ మోతిలాల్, మల్లారపు పురుషోత్తం, సైన్స్ ఉపాధ్యాయులు పాకాల శంకర్ గౌడ్, సరిత, శ్రీహరి, రజిత, అజయ్ నారాయణ, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం 5కె రన్

నవతెలంగాణ - రుద్రంగి : మాదకద్రవ్యాల నిర్మూలనపై జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రుద్రంగి ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు యువతకు మార్చి 3 వ తేదీన జిల్లా కేంద్రంలో 5కె రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 5కె రన్‌లో గెలుపొందిన మొదటి 13 మందికి సైకిల్స్ అందిస్తున్నామన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణంలోని బర్డ్స్ అండ్ ఫ్లవర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం జాతీయ సైన్సు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామయ్య శర్మ, కరస్పాండెంట్ కళ్యాణిశర్మ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మహా శివరాత్రి జాతర నిర్వహించాలి

- ప్రత్యేక పాసుల విధానం రద్దు.. ప్రత్యేక దర్శనానికి రూ.300టికెట్
- శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలి
- దాతల సహాయంతో 500అతిథి గృహాలు నిర్మించేలా కార్యాచరణ
- బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం


జిల్లా అధికారులతో కలిసి జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి, ప్రభుత్వ విప్..

నవతెలంగాణ - వేములవాడ :

మహాశివరాత్రి జాతర అగరంగ వైభవంగా నిర్వహించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయం ఓపెన్ స్లాబ్ లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లాస్థాయి అధికారులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. మార్చి 7 నుంచి మార్చి 9 వరకు మూడు రోజుల పాటు మహా శివరాత్రి జాతర వేడుకలను వేములవాడలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను మంత్రి శాఖల వారీగా రివ్యూ నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి పూర్తయ్యే విధంగా చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతర సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని, ఆలయ పరిసరాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, భక్తులకు రవాణా, తాగునీరు వంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మూడు షిఫ్ట్‌ల్లో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. మెడికల్ క్యాంపుల ద్వారా వైద్య సహాయం అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. మహాశివరాత్రి జాగారం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలన్నారు. జాతరను పర్యవేక్షించేందుకు అన్ని శాఖల అధికారుల, నోడల్ ఆఫీసర్ల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, భక్తుల కోసం ఎక్కడికక్కడ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా గతంలో అందించే ప్రత్యేక పాసులను పూర్తిస్థాయిలో రద్దు చేస్తున్నామని, వాటి స్థానంలో ప్రత్యేక దర్శనానికి రూ.300 టికెట్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. వేములవాడను శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నదని వెల్లడించారు. దాతల సహాయంతో అందుబాటులో ఉన్న స్థలంలో భక్తుల కోసం 500గదులతో అతిథి గృహాలను నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించాలని, దాతలకు కల్పించే సదుపాయాల అంశంలో వేములవాడ ఆలయ కమిటీ శ్రీశైలం, తిరుపతిలో అవలంభించే విధానాలను ఇక్కడ అవలంబించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వేములవాడలో ఉన్న అన్నదాన సత్రం, అక్కడ ఉన్న సిబ్బంది తదితర వివరాలతో నివేదిక తయారు చేయాలని, భవిష్యత్తులో భక్తుల సహాయంతో వేములవాడలో సైతం నిత్య అన్నదాన సత్రం ఏర్పాటు చేసి వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శించుకునే భక్తులకు ప్రతిరోజు అన్నదానం చేసే విధంగా కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు.

అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరను కట్టుదిట్టంగా పని చేసే విజయవంతంగా నిర్వహించాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే విధంగా వేములవాడ పట్టణాన్ని సన్నద్ధం చేయాలన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని, ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత దుర్వాసన ఉండకుండా చర్యలు తీసుకోవాలని, జాతర సమయంలో కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ మంత్రి, ప్రభుత్వ విప్ అందించిన సూచనలు పాటిస్తూ అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న చిన్నచిన్న సమన్వయ లోపాలను పరిష్కరించుకొని పకడ్బందీగా జాతర నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. వేములవాడ ఆలయం ప్రధాన అర్చకులు అప్పల భీమ శంకరశర్మ మాట్లాడుతూ.. మహాశివరాత్రి జాతర సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అఖీల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఎస్పీ నాగేంద్రచారి, ఈఓ కృష్ణ ప్రసాద్, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, స్థానికులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం..

- నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ

నవతెలంగాణ - వేములవాడ : కొనరావుపేట మండలం, కొండాపూర్ గ్రామానికి చెందిన మల్యాల దుగయ్యను ఉపాధి కోసం ఉక్రెయిన్ దేశానికి పంపిస్తా అని మోసం చేసిన నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బోయిన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన పెగ్గెర్ల చంద్రశేఖర్ ఎటువంటి అనుమతి లేకుండా వేములవాడ పరిధిలోని కొనాయిపల్లి గ్రామంలో ఆఫీస్ పెట్టుకొని ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం గల్ఫ్ దేశాలకు పంపుతానాని అమాయక ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని వారిని గల్ఫ్ దేశాలకు పంపకుండా మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ మేరకు కొనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మల్యాల దుగయ్య కూడా చంద్రశేఖర్ ఉచ్చులో పడ్డాడు. ఉపాధి కోసం ఉక్రెయిన్ దేశానికి పంపిస్తానని, నెలకు రూ.లక్ష జీతం వస్తుందని నమ్మించి దుగ్గయ్య దగ్గర చంద్రశేఖర్ రూ.2లక్షల75వేలు తీసుకుని రెండేండ్లు అవుతోంది. బాధితుడు దుగ్గయ్య అడిగిన ప్రతిసారీ దాటవేస్తూ వస్తున్నాడు. దీంతో బాధితుడు దుగ్గయ్య పోలీసులను ఆశ్రయించాడు. చేపట్టిన వేములవాడ టౌన్ పోలీస్‌లు చీటింగ్, ఇమ్మిగ్రేషన్ యాక్ట్‌లో కేసు నమోదు చేసి నమ్మదగని సమాచారం మేరకు చంద్రశేఖర్‌ను జగిత్యాల బస్టాప్ వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికేందుకే సైన్స్ ఫెయిర్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్


విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

నవతెలంగాణ - గంభీరావుపేట :

విద్యార్థి దశలోనే ఆలోచనలకు పదును పెట్టి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. బుధవారం గంభీరావుపేట మండల పరిధిలోని జగదాంబ తండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ పెయిర్‌లో భాగంగా సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుందన్నారు. మనిషి జీవితంలో ప్రతి మెట్టులోనూ సైన్సు ఎంతో ఉపయోగకరంగా మారిందని, సైన్స్ లేనిదే జీవితం లేదన్నారు. పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన పలు ఎగ్జిబిట్లను పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల బారాస పార్టీ అధ్యక్షుడు పాపగారి వెంకట స్వామి గౌడ్, సెస్ డైరెక్టర్ గౌరీనేనీ నారాయణరావు, పలు గ్రామాల మాజీ సర్పెంచ్లు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ జీరో బిల్లు

నవతెలంగాణ-జగిత్యాల:నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని 18 జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు తెల్ల రేషన్ కార్డు ఉండి, అర్హులైన వారికి మార్చి ఒకటి నుంచి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు జీరో బిల్ అందిస్తామని సూపెరింటెండింగ్ ఇంజనీర్ సత్యనారాయణ తెలిపారు. ఎవరైతే గృహ జ్యోతి పథకం పొందడానికి అర్హులై ఉన్నవారు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోకుండా ఉంటే లేదా ప్రజాపాలన దరఖాస్తులో ఏవైనా వివరాలు సరైనవి లేక లబ్ధి పొందకపోయిన తమ పరిధిలోని ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్ నెంబర్, తెల్ల రేషన్ కార్డుతో అనుసంధానమైన ఆధార్ కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. గృహజ్యోతి పథకం అర్హత కలిగిన విద్యుత్ వినియోగదారులందరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మీరు సమర్పించిన దరఖాస్తు ధ్రువీకరించిన తర్వాత నమోదు కోసం పంపిస్తారన్నారు. అర్హత కలిగిన వారికి సవరించి జీరో బిల్ అందచేయడం జరుగుతుందని తెలిపారు. ఒక వేళ మీ దరఖాస్తు పెండింగులో ఉంటే దరఖాస్తు పరిశీలన అయ్యేంత వరకు విద్యుత్ సిబ్బంది బిల్ వసులు పై ఎం చర్యలు తీసుకోరు అని అన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం


పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడా శ్రీకాంత్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు కృష్ణారావుల చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. రూ.500 గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్, ఎంపీటీసీలు అక్కెనపల్లి జలష్ ,తిమ్మని రాములు, బీసీ సెల్ అధ్యక్షుడు బూస రాజేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దూదిగాం గంగాధర్, మహిళా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు లక్కిడి నర్సక్క ,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోరిగం రాజు, ఎల్లాల వెంకటరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పుడు కనిపించలేదా ప్రోటోకాల్

తండ్రి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏ పదవి లేకుండా చెక్కులు మీరు పంపిణీ చేసినప్పుడు కనిపించలేదా ప్రోటోకాల్ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. జగిత్యాల జిల్లాలో సర్వసభ్య సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ ప్రోటోకాల్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మీ తండ్రి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏ పదవిలేని మీరు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేయలేదా అప్పుడు ప్రోటోకాల్ కనిపించలేదా అని ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన పదవి ఎమ్మెల్యేగా ఉండి ఇట్లా మాట్లాడడం సరైనది కాదని అన్నారు. ప్రోటోకాల్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదని విమర్శించారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దూదిగం గంగాధర్, బీసీ సెల్ అధ్యక్షులు బూస రాజేష్, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు లక్కిడి నర్సక్క, బోరిగం రాజు, ఎంపీటీసీలు తిమ్మని రాములు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడిగా చెట్టె భార్గవ్

నవతెలంగాణ-జగిత్యాల

కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎన్ఎస్‌యూఐ బలోపేతంలో భాగంగా జగిత్యాల పట్టణ అధ్యక్షుడిగా చెట్టే భార్గవ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ప్రకటన జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి భార్గవ్‌ను అభినందించారు.

పూర్తి స్థాయి టీపిఓను కేటాయించాలి

నవతెలంగాణ-రాయికల్

పట్టణ మున్సిపల్ పరిధిలో గతంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన ఆర్.రమ్య మెటర్నరీ సెలవులపై వెళ్లడంతో డిప్యూటేషన్‌పై వచ్చిన జగిత్యాల టిపిఓ కే. శ్రీనివాస్ గత ఎనిమిది నెలలుగా రాయికల్‌లో విధులకు హాజరు కాకపోవడంతో నూతన భవన నిర్మాణాల అక్రమ కట్టడాల పర్యవేక్షణ లోపం ఏర్పడుతుందని, పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌ను కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు లేఖ ద్వారా కోరారు.

ఎమ్మెల్యేను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు


సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ -మెట్‌పల్లి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మెట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. వ్యక్తిగత పనిపై మెట్‌పల్లి పట్టణానికి వచ్చిన ఎమ్మెల్యే సత్యంను జువ్వాడి భవన్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అల్లూరి మహేందర్‌రెడ్డి, మండల ప్రెసిడెంట్ అంజిరెడ్డి, కౌన్సిలర్ మరి సహదేవ్, చర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్ మార్గం గంగాధర్, పిప్పెర రాజేష్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జెట్టి లక్ష్మణ్, కొమ్ముల సంతోష్‌రెడ్డి, పొట్ట ప్రేమ్, ఆడెపు రమణ, బొడ్ల ఆనంద్, షకీల్ ,జాజాల రాజగోపాల్, ప్రదీప్ పాల్గొన్నారు.

సంఘం బహిష్కరణ

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలో గల మోచి సంఘం రెండు వర్గాలుగా విడిపోయి ఒక వర్గానికి చెందిన మోచి సంఘ కుల పెద్దమనుషులు మరో వర్గానికి చెందిన కుల సభ్యులు సాముహిక సంఘ బహిష్కరణ చేశారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఉమ్మడిగా ఉన్న ఆస్తులను కులానికి చెందిన కొందరు ఆస్తులన్నీ తమవే అని ప్రచారం చేస్తూ మరో వర్గాన్ని సంఘం నుంచి బహిష్కరిచినట్టు ప్రచారం చేస్తూ సంఘం ఆస్తుల్లో భాగస్వామ్యం లేదంటున్నారని సంఘానికి చెందిన కావల్ల పెంటయ్య తండ్రి, లింగయ్య ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజివి తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన టాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల టాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగిత్యాల పట్టణానికి చెందిన మోయిజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరి వెంట కౌన్సిలర్ ఆవారి శివకేసరి బాబు, కోరే గంగమల్లు, బొడ్ల జగదీష్, పార్టీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు గట్టు సతీష్, వోల్లెం మల్లేశం నాయకులు పోతున్క మహేష్ పాల్గొన్నారు.

మహిళ మృతి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



మంచంపైన వేయడంతో మహిళ మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి గ్రామమైన మూడు బొమ్మల మేడిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి గ్రామానికి చెందిన కుంట బూదమ్మ ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇటీవల హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి ఆమె మంచానికి పరిమితం అయింది. తన బాగోగులు అన్ని తన భర్త అయినా కుంట శ్రీనివాస్ చూసుకు ంటున్నాడు. బుధవారం రాత్రి భార్యాభర్తల మధ్య చిన్న గొడవ జరగడంతో భర్త శ్రీనివాస్ ఆమె పడుకున్న మంచాన్ని పైకి ఎత్తుకొని గట్టిగా ఎత్తేయడంతో ఆ మంచం హెడ్ బోర్డు తలకు తగిలి తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఆమె వదినే అయినా కుంట రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అనిల్ తెలిపారు. కాగా ఈ సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు,మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర క్ష్మీనారాయణ పరిశీలించారు

జిల్లా కలెక్టర్‌ను కలిసిన నూతన మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-జగిత్యాల:జగిత్యాల పట్టణ మున్సిపల్ నూతన చైర్ పర్సన్‌గా నియమితులైన అడ్వలా జ్యోతి లక్ష్మణ్ ఎన్నికైన సందర్భంగా జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం చైర్ పర్సన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ బల్దియా అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని కౌన్సిలర్ల అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల తనిఖీ


పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా


హాజరవుతున్న విద్యార్థులు


సందర్శిస్తున్న పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల జిల్లాలో ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలలో మొదటి సంవత్సరం పరీక్షకు 95.5 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7270 మందికి గాను 6945 మంది పరీక్షలు హాజరయ్యారని, 325 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న కాలేజీలలో కొత్త బస్టాండ్ వద్ద గల అల్ఫోర్స్, పాత బస్టాండ్ వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ అధికారి నారాయణ, తహశీల్దార్ రామ్ మోహన్‌లు ఉన్నారు.

మల్లాపూర్:మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 201 విద్యార్థులకు 195 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆరుగురు విద్యార్థులు అనివార్య కారణాలవల్ల హాజరు కాలేరని సిఎస్ ఎంఏ ఖలీక్ తెలిపారు. అనంతరం ప్రత్యేక అధికారి తాసిల్దార్ వీర్ సింగ్, ఎస్సై కిరణ్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ సిబ్బంది జగిత్యాల సిట్టింగ్ ఫ్లైయింగ్ స్క్వాడ్ కే. తిరుపతి ఉన్నారు.

గోదావరిఖని క్రైం:గోదావరిఖనిలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో ఉన్న పరీక్ష కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ సందర్శించారు. పోలీస్ బందోబస్త్, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్ష నిర్వహణకు అధికారులు తీసుకొంటున్న చర్యలను పర్యవేక్షణ చేసి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మెట్‌పల్లి :ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ పరీక్షల అధికారి నారాయణ తెలిపారు. మెట్‌పల్లి పట్టణంలో ఇంటర్ విద్యార్థుల పరీక్షల కోసం నాలుగు సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకొన్నామని తెలిపారు. మొత్తం నాలుగు పరీక్షకేంద్రాల్లో ఇంటర్ 646 మంది విద్యార్థులలో 18 మంది విద్యార్థులు గైరాజర్ కాగా ఓకేషనల్‌లో 141 మంది విద్యార్థులకు 42 మంది విద్యార్థులు గైరాజర్ అయినట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా నేషనల్ సైన్స్ డే వేడుకలు


పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని సరస్వతి విద్యాలయంలో బుధవారం నేషనల్ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ పరికరాలను జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ. దయాకర్ మాట్లాడుతూ.. సర్ సివి రామన్‌కు 1930 సంవత్సరంలో ఫిజిక్స్‌లో నోబెల్ బహుమతి వచ్చిందని తెలిపారు. 1987 సంవత్సరం నుంచి ఫిబ్రవరి 28న ప్రతి సంవత్సరం నేషనల్ సైన్స్ డే వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏదులాపురం పద్మశ్రీ, ఉపాధ్యాయులు మంద సునీత, తోపారపు సోనీ, కుంట రమ్య, మేడిపల్లి దివ్య, వడ్లగట్ల సుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

ఓదెల: ఓదెల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వి.పద్మ ప్రధానో పాధ్యాయులు అధ్యక్షతన జాతీయ వైజ్ఞానిక దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడి పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సైన్స్ ఫెయిర్‌లో సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అందజేస్తున్న అరుదైన ఇన్సైర్ అవార్డ్స్ - ఏఎఎన్ఏ కే అవార్డు సుల్తానాబాద్ సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అందజేశారు. ఈ అవార్డు7వ తరగతికి చెందిన గౌరవ్ మాలిక్ ,10వ తరగతికి చెందిన కనుకుల తేజస్వినిలకు అందజేశారు. వారికి సర్టిఫికెట్ తోపాటు 10వేల రూపాయల నగదు బహుమతి అందజేసి సత్కరించారు.

మంథని:మంథని పట్టణంలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఎడ్యుఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన నమూనాలను తయారు చేసి వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లి దండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్ :స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం పురస్కరించుకుని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఇన్‌చార్జి పిన్సిపల్ ఎమ్.ఏ రహీం మాట్లాడుతూ.. శాస్త్రవేత్తల సునిషిత పరిశీలన, పరిశోధన ద్వారా దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జగిత్యాల జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ పడాల తిరుపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ వేముల జమున, డాక్టర్ జి చంద్రయ్య, డాక్టర్ అంబాల శంకరయ్య, టాప్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం సత్య ప్రకాష్ పాల్గొన్నారు.

పెద్దపల్లి: పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. పెద్దపల్లి జిల్లా విద్యాధికారి మాధవి హాజరై విద్యార్థులు రూపొందించిన పలు ప్రయోగ నమూనాలను ఆసక్తిగా గమనించి, వాటిని రూపొందించిన విధానాన్ని, వాటి పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, నాసియా, రేష్మా, సదయ్య, స్రవంతి, నవీన్ పాల్గొన్నారు.


అవార్డు అందుకున్న విద్యార్థిని

గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో

గాయత్రి డిగ్రీ, పిజి కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల అధినేత అల్లెంకి శ్రీనివాస్ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి రామన్ రామన్ ఎఫెక్ట్ ను కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకొని అందరికీ జాతీయ విజ్ఞాన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ట్రినిటీ హై స్కూల్ కాసులపల్లి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని సైన్స్ ఎక్స్పోబి 2024 కార్యక్రమం నిర్వహించారు.సైన్స్ ఎక్స్పోను ప్రిన్సిపల్ అడప బాపురెడ్డి ప్రారంభించారు.

ముత్తారం: విద్యార్థులు కష్టపడి చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ముత్తారం మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్ రెడ్డి సూచించారు. సైన్స్ డేను పురస్కరించుకొని ముత్తారం మండలంలోని ప్రభుత్వ పాఠశాల వేడుకలను నిర్వహించారు. ఎంపిడిఓ లలిత, ఎంపిఓ వేణుమాధవ్ తదితరులున్నారు.

సివి రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణ సందర్భంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యా వైజ్ఞానిక మేళాను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాభిలాషులు సిహెచ్.సాగర్, పూర్వ ఎస్ఎంసి చైర్మన్ పి.చక్రపాణి, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు పి.సదానందం, రాజయ్య, మహిపాల్ రెడ్డి, నర్సింహ రెడ్డి, శ్రీనివాస్, రాంరెడ్డి తదితరులున్నారు.


వివరిస్తున్న విద్యార్థినులు

గోదావరిఖని: ఎన్టీపీసీ టౌన్ షిప్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో, ఫ్యామిలీ ఫెస్ట్ కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్టీపీసీ ఎస్ఐ టి.ఉదయ్ కిరణ్ హాజరై విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు.

డాక్టర్ సివి.రామన్ ఎఫెక్స్‌ను పురస్కరించుకొని గోదావరిఖనిలోని కృష్ణవేని విద్యా సంస్థల్లో బుధవారం సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి హాజరై డాక్టర్ సివి.రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పారిశ్రామిక ప్రాంతంలోని కళ్యాణ్ నగర్ ఆపిల్ కిడ్స్ పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం పురస్కరించుకొని బుధవారం సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ గాలి సునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం మున్సిపల్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, విశిష్ట అతిథులుగా మండల విద్యాధికారి పి సంపత్ కుమార్, వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రమోదరావు, కార్పొరేటర్ బాల్ రాజ్ కుమార్, నాయకులు పెద్దల్లి ప్రకాష్ హాజరయ్యారు.

అడ్డగుంటపల్లిలోని అల్ ఇల్మ్ పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ మౌలానా అబ్దుల్ రెహమాన్ షాకీర్ అధ్యక్షతన సైన్స్ డే వేడుకలను బుధవారం నిర్వహించారు.

రాయికల్:మండలంలోని తాట్లవాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన సైన్స్ పరికరాలతో ఎగ్జిబిషన్ నిర్వహించారు...ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బోగ రమేష్ మాట్లాడుతూ ప్రజలు అనుభవిస్తున్న అన్ని రకాల సౌలభ్యాలు, సౌకర్యాలు సైన్స్ వల్లనేనని,అందుకు కృషి చేసిన శాస్త్రవేత్తలకు ప్రతి ఒక్కరు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏనుగు శ్రీనివాసరెడ్డి, పొత్తూరి రవీందర్, ఏలేటి లావణ్య,చంద సాగరిక, ఎనగండ్ల శ్రీధర్,పులిపాటి శ్రీదేవి,దువ్వ చంద్రకళ,చీర్నేని రవికుమార్,బింగి పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెగా సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూం, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు హాజరై సైన్స్ ఫేర్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు.విద్యార్థులు రూపొందించిన వర్కింగ్ మోడల్స్ ను వీక్షించి, చిన్నారులను అభినందించారు.

కష్ణవేణి టాలెంట్ స్కూల్ లో...

పట్టణంలోని కష్ణవేణి టాలెంట్ స్కూల్ లో సైన్స్ డే ఘనంగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జె. వేణుగోపాల్ రావు,డైరెక్టర్ జె.తిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన

ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో....

ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో సర్ సి.వి రామన్ నేషనల్ సైన్స్ డే ను పురస్కరించుకొని విద్యార్థులు వివిధ రకాల సైన్స్ పటాలను రంగురంగుల కలర్స్‌తో నేలపై గీసి ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీధర్, ఉపాధ్యాయులు సలావుద్దీన్, ప్రవీణ్ కుమార్,రజిత, ఉషారాణి, ప్రదీప,జ్యోతి, రవళి, అఖిల పాల్గొన్నారు.

భూపతిపూర్ ప్రభుత్వ పాఠశాలలో..

కష్టపడి చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని మండల పరిషత్ ఉపాధ్యక్షులు మహేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని భూపతిపూర్‌లో సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన 45 రకాల ప్రయోగాలను బుధవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు చిన్నయ్య, శంకరయ్య కార్తీక్, విద్యార్థులను అభినందించారు.

వివేకవర్ధిని పాఠశాలలో...

పట్టణంలోని వివేకవర్ధిని పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రయోగాల ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్న వయస్సులో మంచి ఆలోచనతో ప్రయోగాలను తయారు చేసిన చిన్నారులను, ఉపాధ్యాయులను తల్లిదండ్రులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి :జాతీయ సైన్స్ డే సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన సైన్స్ ఫెర్ పలువురిని ఆకట్టుకొన్నాయి. చిన్నారులు తయారు చేసిన సైన్స్ పరికరాల ఉపయోగాలు వివరిస్తూ, ప్రయోగ విధానంను చక్కగా వివరించారు. సైన్స్ పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకొని నూతన ఆవిష్కరణలు చేయాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.

ఇబ్రహీంపట్నం:ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నేషనల్ సైన్స్ డేతో పాటు ప్రపంచ టైలరింగ్ డేను విద్యార్థులు ఘనంగా జరుపు కున్నారు. సైన్స్ డేలో విద్యార్థులు చేసిన పరిక రాలను ప్రదర్శించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి నవీన్ పాల్గొన్నారు.

అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదు

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాల

అధికారం ఇప్పటికీ శాశ్వతం కాదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌లు 29 మందికి పార్టీ విప్ జారీ చేయటం జరిగిందన్నారు. అందులో 9 మంది కౌన్సిలర్‌లు పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. విప్ దిక్కరిస్తే కౌన్సిలర్ పదవి పోతుందనీ గుర్తు చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధికారాన్ని ఉపయోగించి అధికారులపై వొత్తిడి తెచ్చి విప్ నుంచి కాపాడే ప్రయత్నం చేయొద్దని కోరారు. 2009 నుంచి జీవన్‌రెడ్డి అరాచక కుటుంబ పాలనను జగిత్యాల పట్టణ ప్రజలు తిరస్కరించారని, ఎన్టీఆర్ ఆశీస్సులతో మంత్రి అయిన జీవన్, ఎన్టీఆర్‌నే గద్దెదించిన చరిత్ర జీవన్‌రెడ్డికి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పక్ష ఎమ్మెల్యేలకు నిధుల విషయంలో కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన చైర్‌పర్సన్ కాంగ్రెస్‌కు ఎలా మద్దతు ఇచ్చారని ప్రశ్నించారు. కాపుగా చెప్పుకునే జీవన్‌రెడ్డి కాపులకు కేటాయించిన చైర్మన్‌కు ధిక్కరించారని, కాపులకు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్‌లకు విప్ జారీ చేయకపోవడం జీవన్‌రెడ్డిది ఉద్దేశకపూర్వం మే అన్నారు. వైస్ చైర్మన్‌లుగా ఉన్న ఓసీలు ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్‌గా, ఎంపీపీగా ఉంటే బీసీలకు అన్యాయం జరిగింది అని గొంతు చించుకున్న జీవన్‌రెడ్డి జగిత్యాల, రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీలకు బీసీలకు కాకుండా ఒసిలకు రిజర్వ్ చేయడం ద్వారా బిసిలకు అన్యాయం జరిగిం దన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గట్టు సతీష్, ఉపాధ్యక్షుడు ఓల్లెం మల్లేశం, మాజీ ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్,మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, సమిండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్‌లు ఆవారి శివ కేసరి బాబు, కుసరి అనిల్, కూతురు రాజేష్, కోరే గంగమల్లు, బొడ్లా జగదీష్, ఎంపీటీసీ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

దేవుడి పేరు చెప్పి ఓట్లడిగే నీచ సంస్కృతి బీజేపీది...

టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు బండ శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

దేవుడి పేరు చెప్పి ఓట్లు అడిగే నీచ సంస్కృతి బీజేపీదని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు బండ శంకర్ ఆరోపించారు. బుధవారం జగిత్యాల ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి బండ శంకర్ విలేకరులతో మాట్లాడారు. రామ మందిరం నిర్మిస్తే రామరాజ్యం వచ్చినట్టేనా, రామరాజ్యం దేశంలో ఉందా అని ప్రశ్నించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఆర్ఎస్ఎస్ పాత్ర గొప్పదని చెప్పుకుంటున్న బీజేపీ నాయకులు అసలు చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని మాజీ మున్సిపల్ చైర్పర్సన్, బీజేపీ నాయకురాలు భోగ శ్రావణికి బండ శంకర్ హితవు పలికారు. జీవన్‌రెడ్డి జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ మహిళలు ఉరుకోరని అనిత హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయ కులు గుంటి జగదీశ్వర్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, నేహల్, మున్నా, చిట్ల లత పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా జుల లక్ష్మి రాజమల్లు

నవతెలంగాణ-సుల్తానాబాద్


చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్లు

సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఏర్పాటు చేసిన అవిశ్వాసంలో 2వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి గాజుల లక్ష్మి రాజమల్లు అవిశ్వాసం నెగ్గి చైర్ పర్సన్ పదవిని కైవసం చేసుకున్నారు. సుల్తానాబాద్ మున్సిపల్‌లో 15 మంది కౌన్సిలర్లకు గాను ఒకరు సిద్ధ కనకయ్య మరణించగా 14 మంది కౌన్సిలర్లు ఉండడంతో నాలుగు సంవత్సరాల కాలం అనంతరం కౌన్సిలర్లు బిఆర్ఎస్ చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కలెక్టర్‌కు అందించారు. గతంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డిఓ అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేయడంతో 05 వార్డు కౌన్సిలర్ పారుపల్లి జ్ఞానేశ్వరి గుణపతి అందు బాటులో లేకపోగా12 మంది చైర్ పర్సన్ ముత్యం సునీతకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించడంతో ఫిబ్రవరి 28న ఎన్నికకు సమయం కేటాయించడంతో కౌన్సిలర్లు కూకట్ల గోపి గుర్రాల శ్రీనివాస్‌లు గాజుల లక్ష్మి పేరును ప్రస్తావించగా 10 మంది కౌన్సిలర్లు గాజుల లక్ష్మి రాజమల్లుకు అనుకూలంగా ఓటు వేయడంతో చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్ పర్సన్‌గా బిరుదు సమత కృష్ణ యథావిథిగా కొనసాగుతారని పెద్దపల్లి ఆర్డీవో మదు మోహన్ తెలిపారు. గాజుల లక్ష్మి రాజమల్లు ఎన్నిక కావడంతో కౌన్సిలర్లతో పాటు పుర ప్రముఖులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పలువురు నూతనంగా ఎన్నికైన గాజుల లక్ష్మి రాజమల్లును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, కమిషనర్ కట్ల వేణుమాధవ్ మున్సిపల్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ షాక్...

సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన గాజుల లక్ష్మీ రాజమల్లులను బుధవారం పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికైన గాజుల లక్ష్మి రాజమల్లుకుశుభాకాంక్షలు తెలిపారు.

తండ్రిపై కత్తితో దాడి చేసిన కొడుకు

నవతెలంగాణ -మెట్‌పల్లి

తాగుడుకు బానిసై భార్య కాపురానికి తీసుకురావడం లేదని కోపంతో తండ్రిని కొడుకు కత్తితో పొడిచిన సంఘటన మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని అరపేటలో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అరపేటకు చెందిన రిజ్వాన్‌ఖాన్‌కి ఇద్దరు కుమారులు, ఏడుగురు కుమార్తెలు, రెండో కుమారుడైన అక్బర్ ఖాన్ తాగుడుకు బానిసై నిత్యం భార్యతో గొడవ పడుతుండటంతో విసుగు చెందిన ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది. దింతో అక్బర్ ఖాన్ తల్లితండ్రుల వద్ద ఉంటూ నిత్యం తాగివచ్చి తన భార్యను కాపురానికి తీసుకురావాలని గొడవపడేవాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం తాగి వచ్చి తల్లి తండ్రులతో గొడవ పడ్డాడు. చంపేస్తానంటూ గ్యాస్ సిలిండర్ పైప్ తీసేయడంతో బయపడి పక్క ఇంట్లోకి పారిపోయారు. ఈ విషయం తెలిసిన కూతురు తమ్ముడిని ఆపేప్రయత్నం చేయగా తన వెంటతెచ్చుకొన్న కత్తితో తల్లి తండ్రిపై దాడి చేసి తండ్రి ఛాతి కిందిభాగంలో పొడవడంతో కింద పడిపోయాడు దింతో అక్బర్‌ఖాన్ అక్కడి నుంచి పారిపోయాడని తెలిపారు. గాయపడిన రిజ్వాన్ ఖాన్‌ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ వివరాలు చెకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు

మున్సిపల్ చైర్మన్ ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-జగిత్యాల

మున్సిపల్ చైర్మన్ ఎన్నికను రద్దు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక కోసం జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు 29 మందికి పార్టీ ఆదేశం ప్రకారంగా బిఆర్ఎస్ పార్టీ సూచించిన అభ్యర్థికి ఓటు వేయాలని తెలుపుతూ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లకు పార్టీ విప్ జారీ చేయడం జరిగిందన్నారు. ఎన్నిక సందర్భంగా రిటర్నింగ్ అధికారి కౌన్సిలర్ అందరికీ విప్ విషయాన్ని తెలియజేస్తూ,విప్ దిక్కరిస్తే కౌన్సిలర్ పదవి కోల్పోతారని తెలిపారు. విప్ ధిక్కరించిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అందరినీ తొలగిస్తూ అనర్హత కలిగిన కౌన్సిలర్‌ల ద్వారా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ ఎన్నికను రద్దు చేయాలన్నారు.

7
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
గురువారం | ఫిబ్రవరి 29, 2024 | www.navatelangana.com

శాయంపేట పాఠశాల ఉపాధ్యాయురాలికి కబీర్ కోహినూర్ సమ్మాన్ అవార్డు

నవతెలంగాణ - జమ్మికుంట


అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు

జమ్మికుంట మండలం శాయంపేట పాఠశాల ఉపాధ్యాయురాలు సునీత ప్రయాకరరావ్ కబీర్ కోహినూర్ సమ్మాన్ అవార్డు అందుకున్నారు. మంగళవారం భారతదేశ రాజధాని ఢిల్లీలోని అంబేద్కర్ సెంట్రల్ హాల్లో ప్రముఖ హిందీ ప్రాచీన కవి కబీర్ 506వ జయంతి సందర్భంగా కబీర్ కోహినూర్ సమ్మాన్ -2024 కార్యక్రమం ఏర్పాటు చేశారు. హిందీ సాహితీరంగంలో పలు రచనలు చేసిన ఐదుగురు కవులకు కవయిత్రి సాహితీ వేత్తలకు ఈ అవార్డు అందించారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాల నుండి దాదాపు 2000కిపైగా సాహితీకారులు పోటీపడ్డారు. ఈ అవార్డును అందుకున్న వారిలో తెలంగాణ రాష్ట్రం నుండి ఏకైక వ్యక్తి సునీత ప్రయాకరరావ్ కావడం గమనార్హం. ఆమె జమ్మికుంట మండలం శాయంపేట పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. పురస్కారానికి ఎంపిక కావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, సాహిత్య అభిమానులు హర్షం వ్యక్తంచేశారు.

శ్రీ చైతన్యలో 'రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ కన్వెన్షన్'



మాట్లాడుతున్న డైరెక్టర్ నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో కరీంనగర్ డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ బోర్డు, శ్రీ చైతన్య జాతీయ సేవా పథకం సంయుక్తంగా 'రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ కన్వెన్షన్'పై (ఎయిడ్స్) అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ బోర్డు ప్రోగ్రాం మేనేజర్ సురేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ మధ్య వ్యత్యాసాన్ని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ నరసింహారావు, కాకతీయ యూనివర్సిటీ హెచ్ఓడి ప్రొఫెసర్ సురేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, పాలనాధికారి రామారావు, చీఫ్ లైబ్రేరియన్ గొంటి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మధు, డాక్టర్ సతీష్ కుమార్, విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి

నవతెలంగాణ - హుజురాబాద్



ప్రజల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం పార్టీ జోన్ కమిటీ సమావేశం గుండేటి వాసుదేవ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా లేదని, నిరుత్సాహపరిచే విధంగా ఉందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలకు సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. ఎన్నికలకు ముందు వివిధ రకాల డిక్లరేషన్లు ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించలేదని విమర్శించారు. 2లక్షల రూపాయల రైతు రుణమాఫీకి నిధులు కేటాయింపులు లేవని, ఎప్పుడు మాఫీ చేస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పర్మినెంట్ ఊసే లేదని వాపోయారు. అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, కూలీలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసి కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందని అన్నారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయకుండా, పంటలకు మద్దతు ధరలు చట్టం చేయకుండా రైతు ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఢిల్లీ నడిబొడ్డున రైతులు సాగించిన పోరాటంతో డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. మళ్లీ రైతులు పోరుబాట పడితే పోలీస్ పారా మిలటరీలతో విచక్షణారహితంగా భాష్పవాయు గోళాలు, లాటిచార్జ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ఉద్యమాలకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో పార్టీ జోన్ కార్యదర్శి వేల్మారెడ్డి రాజిరెడ్డి, కందిరీ రమేష్, చక్రపాణి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్‌కి రిటైర్‌మెంట్ గిఫ్ట్ ఇవ్వనున్న ప్రజలు

- పార్టీ నాకు అవకాశమిస్తే కరీంనగర్‌ను కోహినూర్ వజ్రంలా తీర్చిదిద్దుతా
- కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు

నవతెలంగాణ - కరీంనగర్


మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు ప్రజలు రిటైర్ గిఫ్ట్ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. బుధవారం నగరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంపీ దిగజారుడికి నిదర్శనం అని విమర్శించారు. అయోధ్యలో ఉన్న రాముడే దేవుడా కొండగట్టు, వేములవాడలో ఉన్న రాజన్న ఆలయంలో ఉన్నది దేవుళ్లు కాదా అని ప్రశ్నించారు. ఎంపీగా దేశంలో పార్లమెంట్‌లో తక్కువ ప్రశ్నలు వేసిన ఎంపీగా పేరుగాంచారని ఎద్దేవా చేశారు. ఎంపీ లాడ్స్ నిదులు కూడా ఖర్చు చేయలేదన్నారు. ఐదేండ్లలో 25కోట్లు ఖర్చు పెట్టే అవకాశం ఉన్నా కేవలం 5కోట్లతో సరిపెట్టారని, అభివృద్ధి పట్ల ఆయన చిత్త శుద్ధి తేటతెల్లమైందన్నారు. మతం పేర రాజకీయాలు మానుకోవాలన్నారు. తనకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తే, బండి సంజయ్‌ని మట్టి కరిపిస్తామన్నారు. కరీంనగర్‌ను కోహినూర్ వజ్రంలా చేయకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మడుపు మోహన్, నాయకులు అబ్దుల్ రెహమాన్, ముద్దం తిరుపతిగౌడ్, రామిడి రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, మహమ్మద్ అమెర్, జీడి రమేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు రామడుగు క్రీడాకారుడు ఎంపిక

నవతెలంగాణ - రామడుగు


అనుపురం సాయికృష్ణ

ఈ నెల 26 నుండి 26 వరకు నాగపూర్‌లో జరిగే 72వ వాలీబాల్, హ్యాండ్ బాల్ క్లస్టర్ ఆలిండియా పోలీస్ గేమ్స్‌కు రామడుగు మండల కేంద్రానికి చెందిన సీనియర్ హ్యాండ్ బాల్ ప్లేయర్ అనుపురం సాయికృష్ణ ఎంపికైనట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వరరావు, బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు డివైఎస్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జనార్దన్, ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కాసర్ల ఆనంద్ కుమార్, రమణరావు, ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్, ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ సంఘ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ - చొప్పదండి

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను అమలు చేసిన నేపథ్యంలో మండల కేంద్రంలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఎంపీటీసీ కట్టెకోల తారాలక్ష్మణ్, కొత్తూరి మహేష్, జక్కుల అనిల్ కుమార్, దూస అనసూయకైలాసపతి, కనుమల్ల రాజశేఖర్, విద్యాసాగర్, సత్తు శ్రీనివాస్, రాజన్నల తిరుపతి, నూనె శేఖర్, శ్రీనివాస్, మేడిశం భయ్యా పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

కరీంనగర్ డీఈఓ సిహెచ్‌విఎస్.జనార్ధన్‌రావు

నవతెలంగాణ - జమ్మికుంట



విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని కరీంనగర్ జిల్లా విద్యాధికారి సిహెచ్‌వి ఎస్.జనార్ధన్‌రావు అన్నారు. బుధవా రం జమ్మికుంట పట్టణంలోని జడ్పీహెచ్ బాలుర పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు గతంలో ఎన్నో ప్రభుత్వ పాఠశాలలో గమనించినప్పటికీ ఈ పాఠశాలలో సుమారు 100కు పైగా ఎగ్జిబిట్స్ ప్రదర్శించడం అభినందనీయమని తెలిపారు. ఎంఈఓ విడపు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ఆకుల సదానందం, జంపాల పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంహెచ్‌డీ సంస్థ ఆవిర్భావ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట గాంధీ చౌరస్తాలో బుధవారం మాదిగ హక్కుల దండోరా సంస్థ ఆవిర్భవించి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంహెచ్‌డీ నియోజకవర్గం ఇన్‌చార్జి దొడ్డే రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలేశ్వరం సాల్మాన్ జెండా ఆవిష్కరణ చేశారు. పెద్దపల్లి ఎంపీ సీటు ఈసారి మాదిగలకే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డే దిలీప్, దొడ్డే రాజు, దొడ్డే శ్రీకాంత్ పాల్గొన్నారు.

నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు



నవతెలంగాణ - హుజురాబాద్ రూరల్ : నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో యువశక్తి యూత్ అసోసియేషన్ రాజపల్లి వారు హుజురాబాద్ పట్టణంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఓటర్ అవేర్నెస్ డ్రైవ్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎస్.సమ్మయ్య, డీవైఓ వెంకట రాంబాబు, మాతృశ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఏఓ నర్సింహారెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ యువత బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. సరైన నాయకున్ని ఎన్నుకోవడం మన చేతుల్లో ఉన్న ఓటు హక్కు ద్వారా సాధ్యమని అన్నారు. యువశక్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగాల అశోక్ మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యానికి, అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆటో బతుకులు' మొదటి ఎపిసోడ్ విడుదల



నవతెలంగాణ - భగత్‌నగర్ : 'ఆటో బతుకులు' మొదటి ఎపిసోడ్ సీరియల్ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో బుధవారం టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ (ప్రభు) విడుదల చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండి హుస్సేన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిత్ర హీరో ఆటో రవికుమార్ హాజరయ్యారు. ఆటో కార్మికుల జీవితాలను అద్దంలో చూపెట్టే సీరియల్ 100 ఎపిసోడ్లు ఉంటుందని, ప్రతి శనివారం మూడు సంవత్సరాలు సీరియల్ సైరన్ యూట్యూబ్‌లో కొనసాగుతుందని ఆటో కార్మికులు అందరూ కూడ ఆదరించాలని అంబాల ప్రభాకర్ కోరారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల జీవన విధానంపై తీసిన సీరియల్ అద్భుతంగా ఉందని ఈ సీరియల్ నటించిన హీరో రవికుమార్, స్క్రీన్ ప్లే, దర్శకుడు నగునూరు విజయ్ కుమార్‌ను అభినందించారు. ఆటో డ్రైవర్లు ప్రతిరోజు నీతి నిజాయితీతో ప్రజలకు అందుబాటులో ఉంటూ రాత్రనక పగలనక ఆటోలను నడిపితే దినసరి కూలి కూడా గిట్టుబాటు కావడంలేదని అన్నారు. ఆటోలపై తీసుకున్న నెలసరి ఫైనాన్స్‌లు, రోజు వారి చిట్టీలు గాని కట్టలేని పరిస్థితిలో దయనీయంగా ఉంటూ ఎందరో ఆటో డ్రైవర్‌లు ఆత్మహత్య చేసుకున్న విషయం మన అందరికి తెలుసన్నారు. నూతనంగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కానీ ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవరక్షు ప్రత్యామ్నాయ మార్గంలో ఆర్థిక సహాయం చేసి ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ టౌన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు రాజేందర్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర డైరెక్టర్ నగునూరి విజయకుమార్, టిజిపిఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటీ కన్వీనర్, చిత్ర నటీనటులు దార మధు, కాంపల్లి శ్రీనివాస్, మాతంగి శివకుమార్, అనుముల కళావతి, మాతంగి లక్ష్మణ్, కాశిపేట రాజయ్య, కన్నం లక్ష్మణ్, టిజిపిఏ రాష్ట్ర సెక్యూర్టి ఫోర్స్ కన్వీనర్ డిఎస్ నందం, సెక్యూర్టి ఫోర్స్ సభ్యుడు అనిల్ పాల్గొన్నారు.

కొత్తపల్లి వైస్ ఎంపీపీగా తిరుపతి నాయక్

నవతెలంగాణ - కొత్తపల్లి



కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో కొత్తపల్లి మండల వైస్ ఎంపీపీగా చింతకుంట ఎంపీటీసీ తిరుపతి నాయక్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి డీఆర్డీఓ శ్రీధర్ ముందు ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్, ఎంపీడీఓ ప్రభు, ఎంపీటీసీ లు దావా కమల మనోహర్, పండుగ గంగవ్వ నర్సయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభినందనలు

కొత్తపల్లి మండల పరిషత్ వైస్ ఎంపీపీగా నియమితులైన చింతకుంట ఎంపీటీసీ సభ్యుడు తిరుపతి నాయక్‌ను కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్,మా జీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రెడ్డవెని మధు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - కొత్తపల్లి



కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ జన్మదిన వేడుకలు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎంపీడీవో ప్రభు, ఎంపీ ఓ శ్రీనివాస్, జెడ్పీ కో ఆప్షన్ సాబీర్, వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, ఎంపీటీసీలు దావకముల మనోహర్, పండుగ గంగవ్వ నరసయ్య, మండల్ కోఆప్షన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షులు కాసారం శ్రీనివాస్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మెన్ రెడ్డవేని మధు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

'దళిత నాయకులంతా ఏకం కావాలి'

నవతెలంగాణ - జమ్మికుంట


మాట్లాడుతున్న దళిత బంధు సాధన కమిటీ నాయకులు

వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న దళిత నాయకులంతా దళిత బంధు రెండో విడత విషయంలో ఏకం కావాలని సాధన కమిటీ నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. లబ్ధిదారులైన తాము రెండో విడత దళిత బంధు సాధనకు ప్రజావాణిలో కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లగా, అక్కడికి నాయకులు తప్పుడు సమాచారం ఇచ్చి తమను అక్రమంగా అరెస్టు చేసి కనీసం మహిళను, వృద్ధులని చూడకుండా సీటీఎస్‌కు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని కానీ స్థానిక ఎమ్మెల్యే మద్దతు ఉందని దుష్ప్రచారం చేస్తున్నారని ఇది సరి కాదన్నారు. దళిత బందు రెండవ విడత మంజూరు చేయకుంటే వచ్చే లోకసభ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే ఏ నాయకుడిని పొలిమేర దాటి తమ గ్రామాల్లోకి తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో దళితబందు సాధన సమితి సభ్యులు కోలుగూరి సురేష్, మంద రాజేష్, కోలుగూరి నరేష్, రామంచ రాకేష్, అకినపల్లి ఆకాష్, దసరాపు నాగరాజు, కొర్రి సతీష్, రక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

ఒక యజ్ఞంలా ప్లాస్టిక్ ను నిర్మూలించాలి : కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ-కరీంనగర్



ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను ఒక యజ్ఞంలా భావించి ప్రజలు పూర్తిగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్‌లోని ఫిలిం భవన్ లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాస్థాయి నాటక ప్రదర్శన పోటీలను నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లాలోని 30 పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు నాటక ప్రదర్శన పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, హరిత దళం ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.విద్యాసాగర్, న్యాయ నిర్ణేతలు గాజుల రవీందర్, రాదండి సదయ్య, స్వదేష్ కుమార్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నరేంద్ర విద్యాలయంలో వీడ్కోలు హంగామా



నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి నరేంద్ర విద్యాలయంలో టెన్త్ విద్యార్థులు వీడ్కోలు హంగామా చేశారు. వీడ్కోలు సందర్భంగా విద్యార్థులు సిని, జానపద పాటలపై నృత్యాలు చేయగా, ఆట, పాటలతో అలరించారు. ఈ సందర్భంగా జరిగిన వీడ్కోలు సమావేశంలో పాఠశాల కరెస్పాండంట్ గంగాధర రాజేశం మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో టెన్త్ పరీక్షలు రాస్తే విద్యలో రాణిస్తూ మంచి విజయాలు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

సెయింట్ పాల్స్ హైస్కూల్లో



నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ వావిలాలపల్లిలోని సెయింట్ పాల్స్ హైస్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హైడ్రాలిక్ క్రేన్ పనితీరును, పర్యావరణ రక్షణ, వృథా వస్తువులతో కూలర్ తయారీ, చర్మంలోని పొరల గురించి మోడల్స్, ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సైన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని అభినందించారు.

వసంత్ వ్యాలీ పాఠశాలలో



కరీంనగర్ హనుమాన్ నగర్‌లోని వసంత్ వ్యాలీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాఘవేంద్ర హాస్పిటల్ సీఈవో డాక్టర్ శరత్ కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి మూడు విషయాలు ముఖ్యమైనవని అవి పెంచిన తల్లిదండ్రులు, విద్య బోధించిన ఉపాధ్యాయులు, విద్యార్థి తన నైపుణ్యంపై గుర్తింపు అని ప్రతి విద్యార్థి వారిని ఎప్పటికీ మరువకుండా సేవ చేయడమే గొప్ప విషయము అన్నారు. కరస్పాండెంట్ స్వరూపబుచ్చిరెడ్డి మాట్లాడుతూ సైన్స్‌పై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని.. జీవితంలో అనేది ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన వివిధ సైన్స్ ఎగ్జిబిట్స్ ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ కాచర్ల ఆనంద్, రాఘవేంద్ర హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, వసంత్ వ్యాలీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్లూబెల్స్ పాఠశాలలో



కరీంనగర్ హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ జంగ సునీతమనోహర్‌రెడ్డి సీవీ.రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులందరు దాదాపు 100 నమునాలు తయారు చేసి అవి ఏవిధంగా పని చేస్తాయో అందరికి వివరించారు.

అల్ఫోర్స్ పాఠశాలల్లో



వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్నెక్ట్లో వేడుకగా జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని అల్ఫోర్స్ సైన్స్ కార్నివల్ కార్యక్రమం ఏర్పాటుచేశారు. సీవీ రామన్ చిత్రపటానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి పుష్పాంజలి ఘటించి ప్రారంభించారు.


అచీవర్స్ పాఠశాలలో..

అచీవర్స్ పాఠశాలలో..

అచీవర్స్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించి వివరించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి మాట్లాడారు.

వీణాధరిలో



నవతెలంగాణ - చొప్పదండి

మండల కేంద్రంలోని వీణాధరి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీవీ.రామన్ చిత్రపటానికి కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ పూలమాలలు వేసి, సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించి ప్రతిభను వెలికి తీసేందుకు కృషిచేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.

జెడ్పీహెచ్ఎస్‌లో

చొప్పదండి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన, క్విజ్ పోటీలను నిర్వహించారు. టైలరింగ్ డే సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ ప్రదర్శన చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి బహుమతులను అందజేశారు.ప్రధానోపాధ్యాయుడు వి.రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగిత్యాల పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అడువాల జ్యోతి



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవినీ ఒక్క ఓటు మెజారిటీతో అడువాల జ్యోతి కైవసం చేసుకున్నారు. విప్ జారీ చేసిన బీఆర్ఎస్ పార్టీ చైర్ పర్సన్ అభ్యర్థి సమిండ్ల వాణికు 23 ఓట్లు రాగా మరో బీఆర్ఎస్ అభ్యర్థి అడువాల జ్యోతికి 7 గురు కాంగ్రెస్, ఇద్దరు బీజేపీ పార్టీ, ముగ్గురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు, 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఓటు వేయగా ఒక్క ఓటు ఆధిక్యంతో జ్యోతి గెలుపొందారు. విప్ జారీ చేసిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు అడువాల జ్యోతికి మద్దతు తెలపడం, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు కూడా అడువాల జ్యోతికి మద్దతు తెలపడం గమనార్హం. విప్‌కు వ్యతిరేకంగా ఓటేసిన బీఆర్ఎస్ కౌన్సిలర్ల పై చర్యలు తీసుకునేలా ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఇతర కౌన్సిలర్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం.

నిశ్చితార్థపు వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ నరేష్‌రెడ్డి

నవతెలంగాణ-మేడిపల్లి : భీమారం మండల కేంద్రానికి చెందిన ఉత్కం మహేష్‌గౌడ్ నిశ్చితార్థం వేడుకల్లో టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్, కాంగ్రెస్ పార్టీ భీమరం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మేన ప్రశాంత్, చెక్కపల్లి సంజీవ్, హరీష్, స్వామిగౌడ్, వెంకటేష్‌గౌడ్ హాజరయ్యారు.

వెంకట్రావుపేటలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-మేడిపల్లి : పద్మపాణి సొసైటీ ఆధ్వర్యంలో భీమారం మండలం లోని వెంకట్రావుపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసినట్టు పద్మపాణి సూపర్‌వైజర్ నక్క సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని 50 మంది ప్రజలకు రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ చంద్ర, సూపర్‌వైజార్ పద్మాలత, సీహెచ్‌వో దేవన్న, ఏఎన్ఎంలు సబిత, సరస్వతి, ఆశావర్కర్స్ - గీత రాణి, రాధ, లింక్ వర్కర్స్- స్రవంతి, పద్మ సుజాత పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం



పరిశీలిస్తున్న తహసిల్దార్

నవతెలంగాణ-జూలపల్లి : జూలపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ బసిరుద్దీన్ మధ్యాహ్న భోజనానిన పరిశీలించారు. వారానికి మూడు కోడిగుడ్లు విద్యార్థులకు వడ్డించాలని అన్నారు. అనంతరం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినం దించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లా డుతూ.. పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏదు మాంసం అమ్ముచున్న వ్యక్తి రిమాండ్

నవతెలంగాణ-మేడిపల్లి : జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల అటవీశాఖ రేంజ్ కార్యాలయ పరిధి ఆనుకొని ఉన్న గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన వేముల లక్ష్మీరాజంను ఈత వనంలో ఏదు మాంసం అమ్ముతుండగా జిల్లా అటవీ క్షేత్ర అధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ రేంజర్ ముషీరుద్దీన్ సిద్ధిక్ బృందంతో చాకచక్యంగా పట్టుకున్నారు. ఇటీవల నవతెలంగాణలో వేటగాళ్ల ఉచ్చులో వన్యప్రాణులు బలి? అనే కథనానికి స్పందించిన అటవీశాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వన్యప్రాణులను, మూగజీవాలను హింసించడం, విద్యుత్ తీగలు అమర్చడం లాంటి అసాంఘిక కార్య కలాపాలు పాల్పడితే ఆటవిక చట్ట ప్రకారం నేరమని చట్టపరమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. వీరి వెంట ఫారెస్ట్ బీట్ అధికారులు మధుసూదన్, ప్రదీప్ ఉన్నారు.

సీఎం, పెద్దపల్లి ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-ఓదెల : ఓదెల మండలంలోని ఇందుర్తి గ్రామంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావుల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు రెండు హామీలను నెరవేర్చిందన్నారు. ఫిబ్రవరి 27 తేదీన ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మరొక రెండు హామీలైన గృహజ్యోతి పథకంతో పాటు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ హామీలను ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి శ్రీనివాస్,తుమ్మ సదానందం, గోపగాని గణేష్ ,కంకణాల సాయి రెడ్డి,అంబాల రాజు, పరుపాటి శివాజీ రెడ్డి,బండారి వర్షిత్,వినయ్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-మంథని : కాంగ్రెస్ ప్రభుత్వం రెండు గ్యారంటీలను అమలు చేసినందుకు బుధవారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంథని మండల,టౌన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రదాత సోనియా గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకురాలు కలిసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మంథని మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు,అన్ని విభాగాలకు సంబంధించిన నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు



నవతెలంగాణ-మేడిపల్లి: ప్రజా నాయకుడు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గెలిచిన రెండు నెలల్లోనే రూ. 4కోట్ల 88లక్షల 70వేలు మంజూరు చేయించారని ఉమ్మడి మేడిపల్లి మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, రమేష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనా ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారంటీ హామీలను ఏర్పడిన 48 గంటలలోనే రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయణం, రెండు హామీలను సోమవారం గృహజ్యోతి, 200యూనిట్స్ ఉచిత విద్యుత్ , గ్యాస్ 500 రూపాయలకు అమలు చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జలంధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీపతి దామోదర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి మల్లేశం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని గంగారెడ్డి, అధికార ప్రతినిధి చేపూరి నాగరాజు, బిసి సెల్ అధ్యక్షుడు మాదం వినోద్, బీసీ సేల్ ప్రధాన కార్యదర్శి మర్రిపెల్లి స్వామి గౌడ్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పద్మపాని సొసైటీ ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది

నవతెలంగాణ-ఓదెల: ఓదెల మండలంలోని గుంపుల గ్రామంలో మాజీ సర్పంచ్ తిప్పారపు చిరంజీవి, గ్రామపంచాయతీ కార్యదర్శి నవ్య ఆధ్వర్యంలో పద్మపాని సొసైటీ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోగులకు వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ రవీంద్ర కుమార్, ఎమ్ఎల్ హెచ్‌పీ సజన,ఎస్ ఎమ్ మాధవి,ఆశావర్కర్స్ పద్మ, పద్మపాని, లింక్ వర్కర్స్ దివ్య,వాసవి, శ్రీలత గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

జీపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-పెద్దపల్లి : గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని జీపీ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. జిల్లాలో వివిధ గ్రామాల్లో పని చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని బుధ వారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు రెండు నెలల నుంచి 11 నెల వరకు వివిధ మండలాల్లో వేతనాలు బకాయి ఉన్నాయన్నారు. ఈ సమస్యపై మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులకు విన్నవించినా ఫలితం లేదని అన్నారు. నెలకు రూ.9500 అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న అట్టడుగు వర్గాల పేద కార్మికుల వేతనాలు చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక సమస్యలతో బాధ పడుతున్నాయన్నారు. అందుకే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగిందని, కలెక్టర్ సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి వేతనాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి. ఖాజా, వివిధ మండలాల నాయకులు అంబాల లక్ష్మణ్, పైడిపల్లి నాగయ్య, బి. అశోక్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓదెల మండల వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం



ఓదెల వైస్ ఎంపీపీ గా ఏకగ్రీవంగా ఎన్నికైన జిల తిరుపతి

నవతెలంగాణ-ఓదెల : ఓదెల మండల వైస్ ఎంపీపీగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన శానగోండ ఎంపీటీసీ జీల తిరుపతిని ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2019 సంవత్సరం జూన్ నెలలో బీఆర్ఎస్ పార్టీ తరపున ఎంపీటీసీ ఎన్నికల్లో ఓదెల గ్రామం రెండో ఎంపీటీసీగా ఎన్నికైన పల్లె కుమార్‌గౌడ్ వైస్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. అనారోగ్య కారణాల వల్ల 2021 నవంబర్ నెలలో పల్లె కుమార్‌గౌడ్ మృతి చెందాడు. అప్పటి నుంచి వైస్ ఎంపీపీ పదవి భర్తీ చేయలేక ఖాళీగా ఉంది. వైస్ ఎంపీపీ స్థానాన్ని భర్తీ చేయాలని అధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ ఆఫీసర్ వై తిరుపతిరావు ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ పదవికి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నిక నిర్వహించగా ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఉన్న ఎంపీటీసీల తో పాటు బిజెపి పార్టీ ఎంపీటీసీ పాల్గొన్నారు.ఈ ఎన్నికలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీల నుండి జీల తిరుపతి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఎంపీటీసీలు జీల తిరుపతికి మద్దతు పలకడంతో వైస్ ఎంపీపీ పదవి ఏకగ్రీవం అవడంతో జీల తిరుపతిని వైస్ ఎంపీపీగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన వైస్ ఎంపీపీ జీల తిరుపతి మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో నన్ను వైస్ ఎంపీపీగా ఏకగ్రీవ సహకరించిన ఎంపీటీసీ సభ్యులకు, నాపై నమ్మకం ఉంచిన మాజీ శాసనసభ్యులు దాసరి మనహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. అనంతరం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీడీవో,ఎంపీ ఓ కార్యాలయ సిబ్బంది వైస్ ఎంపీపీ జీల తిరుపతిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేణుకాదేవి, జడ్పీటీసీ గంట రాములు, ఎంపీడీవో తిరుపతి, ఎంపీఓ వాజీద్, ఎంపీటీసీలు నోముల ఇంద్రారెడ్డి, ఐరెడ్డి సరోజన కిషన్‌రెడ్డి, రెడ్డి స్వరూప శ్రీనివాస్‌గౌడ్, అరెల్లి సరోజన మొండయ్య తదితరులు ఉన్నారు.

మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ దళిత మహిళకు దక్కేనా.?

నవతెలంగాణ-మంథని : అనేక రాజకీయ మలుపులు తిరిగిన మంథని చైర్‌పర్సన్ అవిశ్వాసం తీర్మానం నెగ్గిన నేపథ్యంలో మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ తొలిసారిగా దళిత మహిళకు దక్కేనా అనే చర్చ దళిత సామాజిక వర్గంలో జరుగుతోంది. ఫిబ్రవరి 16న మంథని మున్సిపాలిటీలో చైర్ పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో కొత్త చైర్ పర్సన్‌ను మంథని మున్సిపాలిటీకి ఎన్నుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ నుండి హస్తం గూటికి చేరిన దళిత కౌన్సిలర్ నక్క నాగేంద్ర పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. దీనికి కారణం పుట్ట మధు ఎత్తుకున్న బహుజన వాదాన్ని సమర్ధ వంతంగా ఎదుర్కోవాలంటే తప్పకుండా చైర్ పర్సన్ పదవి దళిత మహిళకు కేటాయించాలని అధిష్టానం యోచిస్తున్నట్టు తెలుస్తుంది ఇంతకు ముందు వార్డు మెంబర్, ప్రస్తుతం కౌన్సిలర్‌గా ఉండి ప్రతి ఎలక్షన్స్ లో పుట్టమధుకు మంథని మునిసి పాలిటీలో అత్య ధిక మెజారిటీ రావడంలో కీలకపాత్ర పోషించిన నాగేంద్ర శంకర్‌ను చైర్ పర్సన్ చేయడం ద్వారా దళిత సామాజిక వర్గానికి దగ్గరగా అయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు చర్చించు కుంటు న్నారు. కాగా సీనియర్ రాజకీయ నాయ కుడిగా శ్రీధర్‌బాబుకు సన్నిహితంగా ఉన్న పెంద్రు సురేష్‌రెడ్డి-రమాదేవి, బీసీ సామాజిక వర్గానికి చెందిన కొట్టే పద్మ -రమేష్, గౌడ సామాజిక వర్గంలో ఉన్నటువంటి వేముల లక్ష్మి-సమ్మయ్యలు కూడా చైర్ పర్సన్ బరిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏదీ ఏమైనా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చిన తర్వాత శ్రీధర్‌బాబు ఆశీస్సులు ఎవరికి అందుతాయో వేచి చూడాల్సిందే...

మంథని న్యాయస్థానంలో డిశ్చార్జ్ పిటిషన్ కొట్టివేత

నవతెలంగాణ-మంథని : మంథని మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టి పదవీ నుంచి దించివేసి, సొంత పార్టీ కౌన్సిలర్లు ఇచ్చిన భారీ షాక్ నుంచి తేరుకోక ముందే.. పుట్ట శైలజతో పాటు మరో 15 మంది నిందితులుగా ఉండి, మంథని న్యాయ స్థానంలో ఉన్న ఓ ప్రయివేటు కేసులో మరోసారి షాక్ తగిలింది. గత మార్చి20,2015న అప్పటి మంథని ఉప సర్పంచి ఇనుముల సతీష్ ఇంటిపై దాడి, హత్యాయత్నం కేసులో మంథని సర్పంచి పుట్ట శైలజ, అప్పటి మంథని పంచాయతీ కార్యదర్శి మేకల కిషోర్ బాబు, మంథని ఎస్సై షేక్ మస్తాన్, సర్పంచ్ పీఏ అల్లం రామస్వామి, మరో ఇద్దరు రత్నం, మల్లేశం అనే హెడ్ కానిస్టేబుల్ సహా ఇంకా 10మందిపై మంథని కోర్టులో ఇనుముల సతీష్ పిటిషన్ దాఖలు చేశారు. వివిధ కేసుల కింద ద్వారా 10మంది సాక్షులను విచారించిన కోర్టు, అప్పటి మంథని సర్పంచి పుట్ట శైలజ, మేకల కిషోర్ బాబు, అప్పటి మంథని ఎస్సై షేక్ మస్తాన్‌తో సహా 12 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నిందితులకు మంథని కోర్టుకు హాజరు కావాలని ఆదేశిస్తూ 74/2019 కింద సమన్లు జారీ చేసి కేసును కొనసాగిస్తున్నారు. 8 ఏండ్లుగా కేసు వాయిదాలకు తిరుగుతున్న సదరు నిందితులు ఈ కేసు తమపై కొట్టివేయవలసిందిగా కోరుతూ మంథని న్యాయస్థానంలో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేయగా విచారించిన గౌరవ కోర్టు నోటీసులు జారీ చేయగా, ఇనుముల సతీష్ తరపున ప్రముఖ క్రిమినల్ న్యాయవాది ఆర్ల నాగరాజు కౌంటర్ దాఖలు చేస్తూ, తనదైన రీతిలో వాదనలు వినిపించగా. డిఫెన్స్ తరపున మంథని సీనియర్ న్యాయవాది రమేష్ బాబు వాదనలు వినిపించారు. కేసులో వాదనలు విన్న కోర్టు పుట్ట శైలజ వేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ, కేసును మార్చి12 నుండి చార్జెస్ (ట్రయల్ షెడ్యూల్స్) మొద లు పెట్టి నిర్వ హించవలసిందిగా న్యాయ మూర్తి ఆదేశాలు జారీ చేసినట్టు మంథని న్యాయవాది ఆర్ల

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



మంథని : పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు.



సుల్తానాబాద్ : పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-మంథని : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రథమ భాష పరీక్షలైన తెలుగు,హిందీ ఉర్దూ,సంసతంలకు హాజరయ్యారు. మంథనిలోని బాలికల జూనియర్ కళాశాలలో 201మందికి గాను19 మంది,బాలుర కళాశాలలో 176మందికి గాను 36 మంది గైర్హాజరయ్యారు. ఒక్క నిమిషం నిబంధన అమలులో ఉండటంతోచాలా మంది విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని అధికారులు పరీక్షకు అనుమతించలేదు.పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కేంద్రాలను పోలీస్ సిఐ,ఎస్ఐలు సందర్శించారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

సుల్తానాబాద్ : ఇంటర్ పరీక్షల మొదటి రోజు పెద్దపెల్లి జిల్లాలో 94.44 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, ఉర్దూ, అరబిక్ , హిందీ, సంస్కృతం మొదలగు పరీక్షలు జరిగాయని, జనరల్, వొకేషనల్ కలిపి 5636 మంది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాయాల్సి ఉండగా, 5323 మంది హాజరయ్యారని, జనరల్ అభ్యర్థులు 4464 మందికి గాను 4253 మంది హాజరు కాగా, 211 మంది గైర్హాజరు అయ్యారని, అలాగే వొకేషనల్ 1172 మందికి గాను 1070 మంది హాజరు కాగా 102 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని తెలిపారు. మొత్తంగా జిల్లాలో ఈ రోజు 94.44 శాతం హాజరయ్యారని, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని , ప్రశాంతంగా పరీక్ష జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

జూలపల్లి : జూలపల్లి మండలంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురులో ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులు పరీక్షకు 264 మొత్తం విద్యార్థుల సంఖ్య ఉండగా, 252 మంది పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపల్ సుధాకర్ తెలిపారు. అలాగే ఫ్లైయింగ్ స్క్వాడ్ సిహెచ్ మదర్ తనిఖీ చేశారని ప్రిన్సిపల్ సుధాకర్ తెలిపారు. పరీక్ష ప్రాంతానికి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు.



జూలపల్లి : పరీక్ష ప్రాంతంలో విద్యార్థులను పరిశీలిస్తున్న పోలీస్ వారు

గిట్టుబాటు ధర కల్పించే విధంగా చట్టాలు తీసుకురావాలి

కాంగ్రెస్ నాయకులు గుండేటి ఐలయ్య యాదవ్



తహసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన రైతులు

నవతెలంగాణ-ఓదెల : ఓదెల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం పెద్దపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చట్టం తీసు కురావాలని తహసీల్దార్ యాకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ.. రైతు ఆరు కాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించక పోవడంతో రైతులు అప్పులబాలై ఆత్మహత్యలు చేసుకుంటారన్నారు. పది రోజుల నుంచి స్వామినాథన్ కమిషన్ ప్రకారం రైతులు వాడే రసాయనిక ఎరువుల ధరలు భారీగా పెరగడం వలన రైతులకు అదనపు భారం పడుతుందని రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతు సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గోవిందుల ఎల్లస్వామి, కొప్పుల సత్యం, గట్టయ్య, గొల్లపల్లి రామ్‌రెడ్డి, మద్దెల నాగులు,కొప్పుల రాజయ్య, మాధవరెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి స్టీల్ ప్లేట్స్ పంపిణీ



నవతెలంగాణ-సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు కీ.శే: ముత్యం రమేష్‌గౌడ్ జ్ఞాపకార్థంగా వారి సోదరుడు ముత్యం వినోద్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి స్టీల్ ప్లేట్స్ పంపిణీ చేశారు.

మంథని సిడిపిఓ ఐసిడిఎస్ శాఖ డైరెక్టర్‌కు సరెండర్



సిడిపిఓ పద్మశ్రీ ఫైల్ ఫోటో

నవతెలంగాణ-మంథని : ఎట్టకేలకు ఎనిమిది ఏండ్లకు కదిలిన మంథని అంగన్‌వాడీ సిడిపిఓ పద్మ శ్రీ రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ అదేశాలు జారీ చేశారు. ఎనిమిది సంవత్సరాలుగా మంథని ప్రాంత రాజకీయాల ను ఆసరాగా చేసుకొని ప్రాజెక్టు పరిధిలో పలు అవినీతి, అక్రమాలకు తెర లేపి, కింది స్థాయి ఉద్యోగులను, అంగనివాడీ సూపర్ వైజర్లను, టీచర్లను,అయాలను పలు ఇబ్బందులకు గురి చేసినట్టు పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు.

బోయిన్‌పేట్ నాగులమ్మ గుడికి రూ.20వేల విరాళం



విరాళం అందజేస్తున్న సీతారాం రెడ్డి మనుమడు కరిష్మా అమిత్

నవతెలంగాణ-మంథని : స్వర్గీయ చంద్రుపట్ల సీతా రాంరెడ్డి పేరు మీద వారి మనుమడు కరిష్మా అమిత్‌లు బుధవారం మంథని బోయిన్ పేట్ నాగులమ్మ గుడికి వారి కుటుంబ సభ్యులతో వచ్చి దర్శించుకొని రూ. 20,000 విరాళం అందజేశారు.

మార్చి 9న లోక్ అదాలత్



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు.

నవతెలంగాణ-మంథని : మార్చి 9న జరిగే లోక్ అదాలత్‌పై మంథని కోర్టు కార్యాలయ ఆవరణలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సబ్ జడ్జి భారతి, జూనియర్ సివిల్ జడ్జి గణేష్ పాల్గొని మార్చి 9న జరిగే లోక్ అదాలత్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్సీని కలిసిన కొత్త చైర్‌పర్సన్



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : నాటకీయ పరిణామాల నేపథ్యంలో మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన అడువాల జ్యోతి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తాటిపర్తి రాంచంద్రరెడ్డిలను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి -లక్ష్మణ్ మాట్లాడుతూ..పెద్దలు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన ఎంపీపీ



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : జగిత్యాలరూరల్ మండల ఎంపీపీగా మంగళారపు మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మంగళారపు మహేష్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలువగా ఎంపీపీని ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్ సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

రేషను డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్



నవతెలంగాణ-పెద్దపల్లి : రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బండారి వెంకటేష్ నాల్గవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా మద్దెల నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ రేషను డీలర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం నుంచి లభించాల్సిన డిమాండ్ల సాధనకు ముం దుండి పోరాటం చేస్తామని అన్నారు. తన నియామకానికి సహకరించిన మండల అధ్యక్ష, కార్యదర్శులకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని కల్వల క్యాంప్‌లోని అలువేలు మంగ పద్మావతి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆధ్యాయనోత్సవ బ్రహ్మోత్సవ కార్యక్రమాల లో భాగంగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావుకి ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి స్వామీ వారి ప్రతిమను బహూకరించారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి భక్తులు, పెద్దపల్లి పట్టణ కౌన్సిలర్స్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మహ్మద్ మేరాజ్ మహ్మద్



నవతెలంగాణ-గోదావరిఖని : పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, ప్రత్యేక అధికారి మహ్మద్ మేరాజ్ మహ్మద్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మహ్మద్ మేరాజ్ మహ్మద్ రామగుండంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, మైనారిటీ గురుకుల స్కూళ్లను పర్యటించి పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సన్నద్ధతను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులకు, వార్డెన్ లకు సూచించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించి అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులు, వార్డెన్లు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది, ఉర్దూ గ్రేడ్ టు ఆఫీసర్, సూపరింటెండెంట్ ఫర్హానాజ్, సయ్యద్ అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి
కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



నవతెలంగాణ - కరీంనగర్

జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రధాన పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 56 పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 17వేలా 564మంది విద్యార్థులకు 16వేలా 996 మంది పరీక్షలు రాసినట్లు తెలిపారు. జనరల్ విద్యార్థులు 15వేలా 852మందికి 15వేలా 463మంది హాజరయ్యారు. 389మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1712 మందికి 1533మంది విద్యార్థులు హాజరుకాగా 179 మంది గైర్హాజరయ్యారు. హుజురాబాద్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థి మాల్ ప్రాక్టీస్ చేస్తుండగా గమనించిన అధికారులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : కలెక్టర్ పమేలా సత్పతి

ఇంటర్ విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. మౌలిక వసతులు సక్రమంగా కల్పించారా.. అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులతోనూ కలెక్టర్ మాట్లాడారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ప్రతిభ చాటాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు వివరించారు. ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ ఫౌజియా, ఆఫీసర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - జమ్మికుంట

ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. జమ్మికుంట మండలంలో మొత్తం మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 729 మంది విద్యార్థులకు 648 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. మూడు సెంటర్లలో ఎక్కడ ఎలాంటి ఘటనలు నమోదు కాలేదని, ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్



తిమ్మాపూర్ : పరీక్ష హాల్లోకి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్ మండలం వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల,మోడల్ స్కూల్, మైనార్టీ గురుకుల పాఠశాల, అలుగునూర్‌లోని ఎస్సార్ కళాశాలలో సెంటర్లు నిర్వహించారు. ఆయా సెంటర్లలో మొత్తం 1417 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1393 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎల్ఎండి ఎస్ఐ చేరాలు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచన చేయాలి

సెయింట్ జోసెఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ సునీల్ కుమార్

నవతెలంగాణ - జమ్మికుంట



ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న కరస్పాండెంట్ సునీల్ కుమార్

విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచన చేసి కొత్త విషయాలను కనుగొనడానికి ప్రయత్నం చేయాలని సెయింట్ జోసెఫ్ పాఠశాల కరస్పాండెంట్ వై.సునీల్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్) నిర్వహించారు. విద్యార్థులు చేసిన ఎగ్జిబిట్స్‌ను పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు తిలకించారు. సుమారు 80కిపైగా సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం కూడా మా పాఠశాలలో సైన్స్ అంశంపైన విద్యార్థులకు క్విజ్ పోటీల తోపాటు సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విజ్ఞాన ప్రదర్శన

నవతెలంగాణ - రామడుగు



నరేందర్‌రెడ్డికి నమూనాల గురించి వివరిస్తున్న విద్యార్థులు

జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని వెదిర గ్రామంలోని అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన నమూనాలను వాటి పని విధానాన్ని అద్భుతంగా వివరించారు. ఈ నమూనాలలో ఆంటీస్లీపింగ్, అలారం, వైల్ డ్రైవింగ్, సౌరశక్తియే స్థిరమైనా శక్తిని తెలిపే నమూనా, న్యూటన్ మూడవ గమన నియమ సూత్ర నమూనా, పలు జీవశాస్త్ర నమూనాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా కొందరు విద్యార్థులు నేషనల్ సైన్సు డే ప్రత్యేకను, సీవీ రామన్ వైజ్ఞానిక ఆవిష్కరణల గురించి ఉపన్యసించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్



జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండలంలోని చామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ.రామన్ జీవిత విశేషాలు పట్ల అవగాహన కలిగించారు. సుమారు 75 ప్రయోగాలు ప్రదర్శించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ బహుమతి ప్రదానం చేచేశారు.

గీత విద్యాలయంలో సైన్స్ ఫెయిర్

నవతెలంగాణ - చొప్పదండి



అచొప్పదండి మండల కేంద్రంలోని గీత విద్యాలయం ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల ప్రాజెక్టులను ప్రధానోపాధ్యాయుడు గుర్రం ఆనందరెడ్డి పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివేకానంద లిటిల్ జీనియస్‌లో..

నవతెలంగాణ - గంగాధర



ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంఈవో వేణుకుమార్

గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని వివేకానంద లిటిల్ జీనియస్ పాఠశాలలో బుధవారం సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులైన చంద్రయాన్- 3, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, గ్లోబల్ వార్మింగ్, హ్యూమన్ డైజెస్టివ్ సిస్టమ్, వాటర్ సైకిల్, డ్రిప్ ఇరిగేషన్, రెయిన్ డిటెక్టర్, సీడ్ జర్మినేషన్ డెస్టినేషన్, ఫిల్టరేషన్, పొల్యూషన్ సోలార్, లూనార్ ఎక్లిప్స్ వంటి పలు సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. సృజనాత్మకతమైన సైన్స్ ప్రదర్శనలను మండల విద్యాధికారి అంబటి వేణు కుమార్, పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించి అభినందించారు.

నవతెలంగాణ - హుజూరాబాద్



స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, న్యూ కాకతీయ మోడల్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సైన్స్ ప్రదర్శనలు ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని మేరి శోభారాణి, అధ్యక్షతన ఎంఈఓ నరసింహారెడ్డి, విశిష్ట అతిథిగా రిటైర్డ్ ఎంఈఓ ఇలాసాగరం వీరస్వామి హాజరయ్యారు. విద్యార్థులకు ఇలాసాగరం వీరస్వామి రూ.1000 సొంతడబ్బుతో బహుమతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దుల రాజ్‌కుమార్ యాదవ్, దేవరం మేరీశాభారాణి, కేతిరి వెంకట నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్



జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందుర్తిలో విద్యార్థులచే గత నాలుగు రోజుల నుండి తక్కువ ఖర్చుతో సైన్సు ఉపాధ్యాయులు తిరుపతి, ఓదెలు కుమార్, మాధవి సహకారంతో ప్రయోగాలు తయారు చేసి విద్యార్థులు ప్రదర్శించారు. విద్యా కమిటీ చైర్మన్ ఆఫ్రిన్, బ్యాంక్ అధికారులు సందర్శించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు సైన్స్ క్విజ్ నిర్వహించారు.

వోవెల్స్ పాఠశాలలో

నవతెలంగాణ - కరీంనగర్ :



కరీంనగర్ విద్యానగర్‌లోని వోవెల్స్ పాఠశాలలో విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తాము రూపొందించిన వర్కింగ్ మోడల్స్‌ని ప్రదర్శించడంతో పాటు ఉపన్యాసాలు, డాన్సలతో అలరించారు. కరెస్పాండంట్ జె. తిరుపతిరెడ్డి మాట్లాడుతు.. విద్యార్థులు జీవితంలో శాస్త్రీయ దక్పథాన్ని అలవరచు కోవాలని, నూతన ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయాలనీ సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సినిమా ప్రదర్శన

నవతెలంగాణ - ఇల్లందకుంట



ఇల్లందకుంట కేజీబీవీలో 'నిల్ బట్టే సనాట' అనే సందేశాత్మక సినిమాని తెలుగులో ప్రదర్శించారు. ఎంఈఓ విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి సూచనల మేరకు నేడు కేజీబీవీలో ఈ సినిమాను ప్రదర్శించామని తెలిపారు. పనిమనిషి పిల్లలు పనిమనుషులుగా కాకుండా కలెక్టర్ కావచ్చు అనే ఇతివృత్తంతో గొప్ప సందేశంతో కూడిఉన్నదని తెలిపారు. దీనిని పీపుల్ ఫర్ ఇండియా నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ నుండి జి.అరవింద్ ఏర్పాటు ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రమాదేవి పాల్గొన్నారు.

నవతెలంగాణ - జమ్మికుంట

జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జమ్మికుంట పట్టణంలోని కేజీబీవీలో 'నిల్ బట్టే సనాట' అనే సందేశాత్మక సినిమాని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విడపు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సుప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్

ఎమ్మెల్యే గంగుల కమలాకర్



నవతెలంగాణ - కరీంనగర్ : త్యాగాలకు మారుపేరు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక సప్తగిరి కాలనీలోని సంత్ శ్రీ సేవాలాల్ మందిర స్థలంలో నిర్వహించిన ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, చింతకుంట ఎంపీటీసీ తిరుపతి నాయక్, ఉత్సవ కమిటీ నాయకులు లక్‌పతి నాయక్, భాస్కర్ నాయక్, డిటీ నాయక్, బీమాసాహెబ్, తిరుపతి, రాజు నాయక్, రవి నాయక్, సంతోష్ నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చక్కెర కర్మాగారాలను పున: ప్రారంభిస్తుందని విశ్వాసం ఉంది

చెరుకు రైతు సంఘం ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న రైతులు

నవతెలంగాణ-మల్లాపూర్ : మూసి వేసిన చక్కెర కర్మాగారాలను కాంగ్రెస్ ప్రభుత్వం పున ప్రారంభం చేస్తుందనే నమ్మకం ఉందని చెరుకు రైతు సంఘం నాయకులు బుధవారం అన్నారు. మండలంలోని ముత్యంపేట చక్కెర కర్మాగారం మొదట సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు..చెరుకు రైతులు మూతబడ్డ ముత్యంపెట్ షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరించడానికి కమిటీ అధ్యక్షుడిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సభ్యులుగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి పాటు పది మందిని కమిటీ వేసి వారు మార్చి 5 వ తేదీన ముత్యంపెట్ షుగర్ ఫ్యాక్టరీని సందర్శించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మెన్ కంది బుచ్చిరెడ్డి,లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు బద్దం శ్రీనివాస్ రెడ్డి,డైరెక్టర్లు న్యావనంది లింబారెడ్డి,దొడ బాపురెడ్డి,కొత్తపెళ్లి రాజారెడ్డి,కార్మిక నాయకులు గోరుమంతుల ప్రవీణ్ కుమార్,దామ రాజేష్,సోమిడి మహేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్


నవతెలంగాణ-గోదావరిఖని : రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆగ్రోస్ వాహనాలు నడపడానికి డ్రైవర్లు, ఇతర ఉద్యోగాలకు సంబంధించి ఉద్యోగాలు పెట్టిస్తామని డబ్బులు వసూలు చేసిన అధికారులపై అలాగే ఈ ఉద్యోగాల కుంభకోణంలో ఉన్న ప్రతి ఒక్కరిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. రామగుండం నగరపాలక సంస్థ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, సీసీ కెమెరాలు మొదలు అగ్రోస్ వాహనాల దాకా నగరపాలక సంస్థ చేపట్టే ప్రతి పని అవినీతితోనే జరుగుతోందని ఆరోపించారు. ఏండ్ల తరబడి మున్సిపల్ కార్యాలయంలోనే పాతుకుపోయిన అనేకమంది అధికారులను ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్స్ చేస్తేనే నగరపాలక సంస్థ పట్టిన అవినీతి మరక పోతుందని అన్నారు. ఆర్ఎఫ్‌సిఎల్ ఉద్యోగుల దందా మరువకముందే మున్సిపల్ కార్యాలయంలో దళారులు మరోసారి తమ బుద్ధిని బయటపెట్టారని, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు అంటేనే దళారులకు అక్షయపాత్రగా మారుతున్నాయని అన్నారు. ఈ కుంభకోణంలో ఎవరైనా కార్పొరేటర్లు ఉన్నట్లయితే నూతన మున్సిపల్ చట్టం ప్రకారం వారిపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు.

సింగరేణి స్కూల్ వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-గోదావరిఖని : ఆధ్వర్యంలో కంపెనీ స్థాయి సింగరేణి స్కూల్ వార్షిక క్రీడా పోటీలను 2023-24 జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం బుధవారం ప్రారంభం అయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జీ-1 ఎస్ ఓటు జియం ఎం.రామ్ మోహన్ హాజరై పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ సింగరేణి స్థాయి వార్షిక క్రీడా పోటిల్లో 7 తరగతి నుండి 10 వ తరగతి 14 సంవత్సరాలలోపు బాల బాలికల 10 వ తరగతి చదివే బాలబాలికలకు 1500 మీటర్ల పరుగు పందెం, 800, 400, 200, 100 పరుగు పందెం, షాట్ పుట్ , లాంగ్ జంప్, జవాలిన్ త్రో, డిస్కో, ఆర్చరి, త్రోబాల్, హైజంప్, లాంగ్ జంప్ తదితర ఆటల పోటీలను లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్జీ- 1 ఎఐటియుసి బ్రాంచి సెక్రటరీ ఆరెల్లి పోశం, సియంఒఏఐ సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షులు మల్లేష్, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి బంగారు సారంగపాణి, అధికారులు అభిలాష్, రాజాం, స్పోర్ట్స్ సూపర్ వైజర్స్ రమేష్, జాన్ వేస్లీ, నరేందర్ రెడ్డి, రాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

నిరుపేద విద్యార్థులకు పాకెట్ మనీ

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:



గోదావరిఖనికి చెందిన కార్మిక సంఘ నేత బొల్లెన రాజయ్య ఈ నెల 17న అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ద్వాదశ కర్మ సందర్భంగా రాజయ్య కుమారుడు, యువ నాయకుడు బొల్లెన శ్రీధర్ స్థానిక గాంధీనగర్‌లోని గాంధీ పార్కు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు పాకెట్ మనీ అందజేశారు. ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి సంపత్ రావు హాజరై చిన్నారులకు పాకెట్ మనీ అందజేశారు. జ్యోతి గాంధీ ఫౌండేషన్ కార్యనిర్వాహకులు దయానంద్ గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యనిర్వాహక బాధ్యులు మధు, చందు తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ జడ్పీటిసి పరామర్శ

నవతెలంగాణ-ముత్తారం : ముత్తారం మండలం పారుపల్లి గ్రామానికి చెందిన బోడ రాజయ్య ఇటీవల మృతి చెందాడు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులను మాజీ జడ్పీటిసి నాగినేని జగన్మోహన్ రావు పరామర్శించారు. ముందుగా మృతుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆ నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

మార్చి 1న సింగరేణి ఆర్జీ 1 జిఎం కార్యాలయం ఎదుట ధర్నా

- పోస్టర్ ఆవిష్కరించిన ఎస్‌సిఇయు ఆర్జీ 1 కార్యదర్శి మెండే శ్రీనివాస్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని : జీడీకే 2వ ఇంక్లయిన్, ఏరియా వర్క్ షాపులో, కార్మికులు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 1న ఆర్జీ 1 జిఎం కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరుగుతుందని యూనియన్ ఆర్జీ 1 కార్యదర్శి మెండే శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ధర్నా పోస్టర్‌ను యూనియన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రామగుండం రీజియన్‌లోని మూడు బ్రాంచీల కార్మిక కుటుంబాలు గత రెండు సంవత్సరాల నుంచి తాగునీరు అందక అనేక అవస్థలు పడుతూ అనారోగ్యాల పాలవుతున్నారని యాజమాన్యాన్ని ప్రశ్నిస్తూ అనేక సందర్భాలలో వినతిపత్రాలు ఇచ్చి పోరాటాలు నిర్వహించినప్పటికీ ఫలితంగా యాజమాన్యం పది ఆరో ప్లాంట్లు గోదావరిఖనిలో పెట్టాలని నిర్ణయించిందని తెలిపారు. అందులో ఐదు మాత్రమే కార్మికులకు అందుబాటులో రావడం జరిగిందని, మిగిలినవి వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అధిక సంఖ్యలో కార్మికులు హాజరుకావాలని కోరారు. ధర్నా గోడ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరావు, వంగల రాములు, శంకర్, సమ్మయ్య, బీమా నాయక్, కుమార్, సంపత్, జనార్ధన్, బొంకూరు సురేష్, బట్టు చంద్రయ్య, ఎడబ్ల్యూఎస్‌లో నంది నారాయణ, బత్తుల ఓదెలు, సంతోష్, బాదె రవి, బండారి సత్తి, సంద్ర రాజమౌళి పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

500కే గ్యాస్, ఉచిత విద్యుత్‌పై మహిళల సంబరాలు



నవతెలంగాణ - గంగాధర

రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాల అమలు పట్ల మహిళా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో మహిళలు సంబరాలు జరుపుకున్నారు. సోనియా గాంధీ చిత్రపటానికి తొలుత పాలాభిషేకం చేసిన మహిళలు అనంతరం గ్యాస్ స్టవ్‌పై టీ తయారు చేసి చాయి తాగారు. మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు మంత్రి లత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, తోట సంధ్య, రామిడి రాజిరెడ్డి, రోమాల రమేష్, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్, రాచమల్ల భాస్కర్, గంగాధర సుదర్శన్, బూరుగు గంగన్న, బట్టు లక్ష్మీనారాయణ, కొలెపాక స్వామి, కరుణాకర్, అశోక్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-కరీంనగర్

కాంగ్రెస్ హయాంలోనే మహిళలకు పెద్దపీట వేసి, ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలలో మరో రెండు గ్యారెంటీలైన మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల అమలుకు శ్రీకారం చుట్టడం సంతోషించదగిన విషయమని అన్నారు. అనంతరం మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భారతమ్మ, సుశీల, పుష్పలత, కవ పద్మ, దేవేంద్ర, పద్మ, కవిత, జ్యోతి, రజిత, సునీత, లక్ష్మి, లావణ్య, కరీమా, రమాదేవి, సత్య, సుజాత, చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ ఆధ్వర్యంలో పుస్తె మెట్టెలు పంపిణీ

నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన ఇట్టవేని రామయ్య- సమ్మక కుమార్తె లావణ్య వివాహం బుధవారం జరిగింది. కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో కళ్యాణలక్ష్మి పథకం కింద పుస్తె మెట్టెలు సూపర్వైజర్ రెడ్డవేన వెంకటేష్ అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కనుకంటి తిరుపతిరెడ్డి, కార్యదర్శి శ్రవణ్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెలు వితరణ

నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన ఇద్దరు పేదింటి ఆడబిడ్డల పెండ్లిలకు పుస్తె, మెట్టెలు అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన పూదరి లావణ్య-కీ.శే ఎల్లయ్య దంపతుల కుమార్తె సాత్విక వివాహం బుధవారం జరిగింది. అవసరమైన పుస్తె, మెట్టెలను మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్ రెడ్డి అందించారు. అదేవిధంగా జాతరగొండ తార- కీ.శే రాజయ్య దంపతుల కుమార్తె రమ్య వివాహం కూడా బుధవారమే జరిగింది. వధువు రమ్యకు కూడా పుస్తె, మెట్టెలు అందించి ఆశీర్వదించారు.

ఎల్‌ఓసీ అందజేత

నవతెలంగాణ - రామడుగు : మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన గొల్లపల్లి అంజని కుమార్ గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుచున్నాడు. ఈ మేరకు ఆపరేషన్ చికిత్స నిమిత్తం 1,50,000 రూపాయల ఎల్‌ఓసీ చెక్కును చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. వన్నారం ఎంపీటీసీ జవ్వాజి హరీష్ తదితరులున్నారు.

రాచపల్లిలో యువకుడి అదృశ్యం



నవతెలంగాణ - ఇల్లందకుంట : ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన ఆరేల్లి కుమారస్వామి (24) మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. ఈ నెల 25న ఇంట్లో నుండి వెళ్లిపోయి ఇప్పటి వరకు తిరిగి రాలేదని యువకుడి తండ్రి మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. యువకుడి ఆచూకీ తెలిసినవారు ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 872570778కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మల్లాపూర్ : మండలంలోని రత్నాపూర్ గ్రామంలో బావిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పేడికం వెంకటేష్ (38) తొమ్మిది సంవత్సరాల క్రితం కుటుంబ సభ్యులతో రత్నపూర్ గ్రామానికి వచ్చి కూలీపని చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి భార్య గంగమణి గొడవ జరగగా, ఇకనుంచి మద్యం సేవించనని భార్యతో తెలిపాడు. రాత్రి సమయంలో అతిగా మద్యం సేవించి తీవ్ర మనస్తాపం చెంది ఇంటి వద్ద ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.

రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం..

నవతెలంగాణ-మల్లాపూర్ : దేశ రాజధానిలో రైతులు చేపట్టిన దీక్షకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని కిసాన్ కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యనారాయణ రెడ్డి బుధవారం అన్నారు. ఈ సందర్భంగా దేశ రాజధానిలు రైతులు చేపట్టిన దీక్షకు మద్దతుగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన ర్యాలీకి మద్దతుగా కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు బుధవారం తరలి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యం రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జి రమేష్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి హనుమాన్లు. తదితర నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సింగల్ విండో చైర్మన్, వైస్ చైర్మన్

నవతెలంగాణ-ముత్తారం : ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సింగల్ విండో చైర్మన్‌గా అల్లాడి యాదగిరిరావు, వైస్ చైర్మన్‌గా ఏలువాక కొంరయ్యలు రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాఖ సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగల్ విండో అభివృద్ధికి, రైతుల సమస్యల పరిష్కారానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచనల మేరకు తమ సాయశక్తుల కృషి చేస్తామన్నారు.

రూ.2.50లక్షల ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-ముత్తారం : ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన పొలవేని సతీష్ మల్టిపుల్ మైలోమాకు సంబంధించి నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులకు సహాయం కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు తెలుపగా, సిఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2.50లక్షల ఎల్‌వోసీని మంత్రి మంజూరు చేయించారు. మంత్రి సహాయకులు వారికి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎల్‌ఓసిని అందజేశారు.

నిరుపేద యువతి వివాహానికి అండగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్

నవతెలంగాణ-మల్లాపూర్ : మండలంలోని వాల్గొండ గ్రామానికి చెందిన లావణ్య అనే యువతీ వివాహానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబం అని తెలిసి పెళ్లికి కావాల్సిన పుస్తెలు, పట్టుచీర, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్, పిప్పెర నరేష్ , బారిశెట్టి రాంప్రసాద్, పాదం భూమేష్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 1న చలో మేడిగడ్డ

నవతెలంగాణ-ముత్తారం : 40 లక్షల ఎకరాలకు సాగు నీరందించే కామధేనువు కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ కుట్రలను ఎండగట్టడానికి, వాస్తవాలు ప్రజలకు తెలియజేయడానికి 150 మంది పార్టీ నేతలతో కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వస్తున్నారని బిఆర్ఎస్ మంథని నియోజకవర్గ యూత్ నాయకులు దుబాసి లెనిన్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా దశల వారిగా ప్రాజెక్టులో ఉన్న ప్రతీ రిజర్వాయర్‌ను సందర్శించి దాని నుండి అందుతున్న ఫలితాలను ప్రజలకు పూర్తి అవహాగాహన వచ్చేలా వివరిస్తారన్నారు.

బిజినెస్

ఏడాదిలో 6 శాతం పెరిగిన సంపన్నులు

- వచ్చే ఐదేండ్లలో 50 శాతం పైకి..
- నైట్‌ఫ్రాంక్ ఇండియా వెల్త్ రిపోర్ట్



ముంబయి: భారత్‌లో పేదలు, మధ్య తరగతి వర్గాలు అధిక ధరలతో ఉన్న ఆదాయాలు కోల్పోతుంటే.. మరోవైపు ధనవం తులు మాత్రం మరింత సంపదను పోగేసుకుంటూ పెరిగిపోతున్నారు. ఇందుకు నైట్ ఫ్రాంక్ ఇండియా సంపద 2024 రిపోర్ట్ నిదర్శనం. దీని ప్రకారం.. గడిచిన 2023 లో దేశంలో అత్యధిక ఆదాయం కలిగిన సంపన్నులు (యూహెచ్ఎన్‌డబ్ల్యూ ఐ) 6.1 శాతం పెరిగి 13,262 మందికి చేరారు. వచ్చే ఐదేండ్లలో 2028 నాటికి ఈ సంఖ్య 50.1 శాతం ఎగిసి 19,908కి చేరనుందని అంచనా. కాగా.. ఇదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా సంపన్నుల శాఖ 28.1 శాతం పెరిగి 8,02,891కి చేరొచ్చు. 2023లో 4.2 శాతం పెరిగి 6,01,300 నుంచి 6,26,619కు చేరింది. ప్రపంచ సగటుతో పోల్చితే భారత్‌లో అత్యధిక సంపన్నుల పెరుగుదల శాతం చాలా ఎక్కువగా నమోదవుతోంది.

నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్ ప్రకారం.. ప్రస్తుత ఏడాది 2024లో 90 శాతం మంది భారత సంపన్నులు వారి ఆదాయాల్లో పెరుగుదలను ఆశిస్తున్నారు. వీరిలో 63 శాతం మంది వారి సంపదలో 10 శాతం కంటే ఎక్కువ పెరుగుదలను కోరుకుంటున్నారు. "ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో పోల్చితే భారత్‌లో సంపన్నుల పెరుగుదలకు ఎక్కువ అవకాశాలున్నాయి. దేశంలో రానున్న ఐదేండ్లలో సంపన్నుల సంఖ్యలో 50.1 శాతం పెరుగుదల ఉండొచ్చు. ప్రస్తుత ఏడాదిలో 90 శాతం భారత సంపన్నులు తమ సంపదలో పెరుగుదలను ఊహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి ఉన్నప్పటికీ భారత్‌లో ద్రవ్యోల్బణ ప్రమాదాన్ని తగ్గించడం, వడ్డీ రేట్లలో తగ్గింపులు వృద్ధికి దోహదం చేయవచ్చు." అని నైట్ ఫ్రాంక్ ఇండియా సిఎండి శిశిర్ బైజల్ పేర్కొన్నారు.

గడియారాలపైనే మోజు..

భారత సంపన్నుల్లో 12 శాతం మంది ఈ ఏడాది కొత్త నివాసాన్ని కొనుగోలు చేయాలనే ప్రణాళికలో ఉన్నారు. 2023లోనూ అంతే శాతం మంది కొత్త ఇళ్లను కొనుగోలు చేశారు. దేశంలో 13వేల పైగా ఉన్న అత్యంత సంపన్నులు 2.57 గృహాలను కలిగి ఉన్నారని నైట్ ఫ్రాంక్ సర్వేలో తేలింది. లగ్జరీ ఉత్పత్తుల కొనుగోళ్లలో గడియారాలకు ఎక్కువ మంది ప్రాధాన్యత ఇచ్చారు. ఆ తర్వాత కళారూపాలు, అభరణాలు, క్లాసిక్ కార్ల కొనుగోలుకు ఎక్కువ ఆసక్తి చూపారు.

రూ.6 లక్షల కోట్ల సంపద ఆవిరి

- రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్ల డీలా
- సెన్సెక్స్ 790 పాయింట్ల పతనం



ముంబయి : దిగ్గజ కార్పొరేట్ కంపెనీలు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ సూచీల్లో అమ్మకాల ఒత్తిడి స్టాక్ మార్కెట్లను పడేశాయి. మరోవైపు అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు మరింత ఒత్తిడి ని పెంచాయి. ఈ పరిణామాలతో బుధవారం తుదకు బీఎస్ఈ సెన్సెక్స్ 790 పాయింట్లు లేదా 1.08 శాతం పతనమై 72,304కు పడిపోయింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ నిఫ్టీ 247 పాయింట్లు కోల్పోయి.. 21,951 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఏకంగా 72,222, నిఫ్టీ 21,916 కనిష్టాలను చవి చూశాయి. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ.6 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది. దీంతో ఆ మొత్తం ఇన్వెస్టర్ల సంపద ఆవిరయినట్లయ్యింది. బీఎస్ఈ మార్కెట్ విలువ రూ.386 లక్షల కోట్లకు తగ్గింది.

బీఎస్ఈలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 1.8 శాతం, 1.9 శాతం చొప్పున ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. నిఫ్టీలో మీడియా, రియాల్టీ, లోహ, పీఎస్‌యూ బ్యాంకింగ్ స్టాక్స్ 2 శాతం నుంచి 3.5 శాతం మేర క్షీణించాయి. ఇతర రంగాల సూచీలన్నీ 1.5 శాతం మేర పతనమయ్యాయి. సెన్సెక్స్‌లో హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని షేర్లూ క్షీణతను చవి చూశాయి. ఆసియా, పసిఫిక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. విదేశీ సంస్థాగత మదుపరులు అమ్మకాలకు మొగ్గు చూపారు.

జాగల్‌తో ఈజీమైట్రిప్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ : ఫిన్‌టెక్ సేవల సంస్థ జాగల్ ప్రీపెయిడ్ ఓసియన్ సర్వీసెస్‌తో ఈజీమైట్రిప్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. దీంతో తమ సంస్థకు ట్రావెల్, వ్యయాల నిర్వహణ పరిష్కారాలను జాగల్ అందించనుందని పేర్కొంది. ప్రయాణ సమయంలో వాస్తవ ఖర్చులను అంచనా వేయడానికి వీలుంటుందని పేర్కొంది. వ్యయాల పొదుపు, ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి దోహదం చేయనుందని ఈజీమైట్రిప్ పేర్కొంది.

శ్రీలంక శీతల పానియాల కంపెనీతో రిలయన్స్ జట్టు



న్యూఢిల్లీ : శ్రీలంకకు చెందిన ఎలిఫ్యాంట్ హౌస్ శీతలపానయాల కంపెనీతో రిలయన్స్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు ప్రకటిం చింది. దీంతో మరిన్ని కూల్ డ్రింక్స్‌ను తీసుకురావాలని నిర్దేశించుకున్నట్లు తెలిపింది. ఇప్పటికే కాంపా కోలా, సోస్యో తదితర బ్రాండ్లతో రిలయన్స్ శీతల పానియాలను విక్రయిస్తోంది. ఎలిఫ్యాంట్‌తో జట్టు కట్టడం ద్వారా రిలయన్స్ బేవరేజ్ ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియోను విస్తరించడమే కాకుండా.. కొత్త ఉత్పత్తులను భారతీయ వినియోగదారులకు అందించాలని నిర్దేశించుకున్నట్లు తెలిపింది. ఎలిఫ్యాంట్ హౌస్ తన పోర్టుపోలియోలో నెక్టో, క్రీమ్ సోడా, ఇజిబి, ఆరెంజ్ బార్లీ, లెమనేడ్ తదితర శీతల పానియాలను కలిగి ఉంది.

సునీల్ మిట్టల్‌కు బ్రిటన్ నైట్‌హుడ్ అవార్డ్



న్యూఢిల్లీ: భారతీ ఎంటర్ ప్రైజెస్ అధినేత సునీల్ భారతీ మిట్టల్‌కు బ్రిటన్ ప్రభుత్వం అత్యున్నత పురస్కారం ప్రకటించింది. ఆ దేశ ప్రతిష్టాత్మక పురస్కారమైన నైట్‌హుడ్ తో సత్కరిం చింది. కింగ్ ఛార్లెస్ 3 చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్న తొలి భారతీయుడుగా సునీల్ మిట్టల్ నిలిచారు. తనకు ఈ అవార్డు దక్కడం గౌరవంగా భావిస్తున్నానని మిట్టల్ పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నానని తెలిపారు.


కొత్త ఆవిష్కరణల వైపు విద్యార్థులు అడుగులేయాలి

- దక్షిణ మధ్య రైల్వే సీఈ ప్రదీప్ గుప్త

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే కొత్త ఆవిష్కరణల వైపు అడుగులేయాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ బ్రిడ్జ్ ఇంజినీర్ ప్రదీప్ గుప్త అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని సర్వే ఆఫ్ ఇండియాలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గుప్త మాట్లాడుతూ అభివద్ధి చెందిన దేశాలపై ఆధారపడకుండా స్వదేశీ సాంకేతికతను మరింత వేగంగా అందిపుచ్చుకోవడానికి విద్యార్థులు తమదైన పాత్ర కృషి చేయాలని సూచించారు. సైన్స్ ఎన్నో సవాళ్లతో కూడుకున్నదైనప్పటికి నిబద్ధతతో అధ్యయనం చేసి తమ లక్ష్యాలను అందుకోవాలని కోరారు. సాంకేతిక కార్యకలాపాలు, జియో-స్పేషియల్ పరిశ్రమల్లో అభివద్ధి పరికరాలు, తాజా సర్వేయింగ్ మ్యాపింగ్ సాధనాలను ఎగ్జిబిషన్లో ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్వేఆఫ్ ఇండియా అధికారులు డాక్టర్ ఎంకె. స్టాలిన్, ఎస్‌వి.సింగ్, జి.వరుణ్‌కుమార్, పంకజ్ మిశ్రా, టిపి. మాలిక్, నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.33 వేలా 660 కోట్లు
కేంద్రం ముద్రించిన ఎన్నికల బాండ్లు..
ఆరేండ్లలో బీజేపీకి అందిన విరాళం రూ.6,565 కోట్లు



కాంగ్రెస్‌కు వచ్చింది రూ.1,123 కోట్లే

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల (ఈబీ) పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి...అంటే 2018 నుండి కేంద్ర ప్రభుత్వం రూ.33,660 కోట్ల విలువైన బాండ్లను ముద్రించింది. వీటిలో ఒక్కోటి కోటి రూపాయల విలువ కలిగిన 33 వేల బాండ్లు, ఒక్కోటి పది లక్షల రూపాయల విలువ కలిగిన 26,600 బాండ్లు ఉన్నాయి. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని ఈ నెల 15న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. గత సంవత్సరం డిసెంబర్ 29వ తేదీ నుంచి సుప్రీంకోర్టు తీర్పు వెలువడే వరకూ ప్రభుత్వం ఒక్కోటి కోటి రూపాయల విలువైన 6,350 బాండ్లను ముద్రించింది. సమాచార హక్కు చట్టం కింద రిటైర్డ్ సైనికోద్యోగి లోకేష్ కే బత్రా అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం ఈ మేరకు సమాధానం ఇచ్చింది.

ఎన్నికల బాండ్ల ముద్రణ, కమిషన్ నిమిత్తం ప్రభుత్వానికి రూ.13.94 కోట్లు ఖర్చయ్యాయి. ఎన్నికల బాండ్లను విక్రయించినందుకు కమిషన్ రూపంలో ఎస్‌బీఐకి జీఎస్టీ సహా రూ.12.04 కోట్లు చెల్లించారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి 30 విడతలుగా ఈ బాండ్లను ఎస్‌బీఐ విక్రయించింది. దాతలు లేదా రాజకీయ పార్టీల నుండి ఎలాంటి కమిషన్ తీసుకోలేదు.

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాజకీయ పార్టీల వార్షిక నివేదికలను ఎన్నికల కమిషన్ ఇంకా ప్రచురించనప్పటికీ 2018 మార్చి, ఈ సంవత్సరం జనవరి మధ్య కాలంలో ఈబీల విక్రయం ద్వారా రాజకీయ పార్టీలకు రూ.16,518 కోట్ల నిధులు సమకూరాయి. వీటిలో సగానికి పైగా నిధులు అధికార బీజేపీ ఖాతాకే చేరాయి. 2017-2023 మధ్య కాలంలో బాండ్ల ద్వారా విరాళాల రూపంలో రూ.6,565 కోట్లు అందాయని ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన డిక్లరేషన్‌లో బీజేపీ తెలిపింది. అదే కాలంలో రూ.1,123 కోట్ల విరాళాలతో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది.

2019 ఏప్రిల్ 12 నుండి వ్యక్తులు, సంస్థలు కొనుగోలు చేసిన బాండ్ల వివరాలను మార్చి 6వ తేదీ లోగా ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని ఎస్‌బీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. అదేవిధంగా ఎన్నికల కమిషన్ ఆ వివరాలను మార్చి 13 లోగా తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రదర్శించాల్సి ఉంటుంది. అయితే ఎస్‌బీఐ తన వద్ద ఉన్న సమాచారాన్ని నిర్దిష్ట నమూనాలో అందజేస్తుందా లేదా అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఫార్మెట్ రూపంలో వివరాలు ఉంటే బాండ్లను కొనుగోలు చేసిన వ్యక్తులు లేదా కంపెనీలు వాటినే రాజకీయ పార్టీలకు అందజేసిందీ లేనిదీ తెలిసిపోతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం కార్పొరేట్ సంస్థలు, సంపన్న వర్గాల వారు మాత్రమే రాజకీయ పార్టీలకు బాండ్ల రూపంలో విరాళాలు అందజేశారు. ఎన్నికల సంఘం రికార్డులు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఎందుకంటే దాతలు కొనుగోలు చేసిన బాండ్లలో 94 శాతం వరకూ కోటి రూపాయల విలువ కలిగినవే. అంత పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత కార్పొరేట్ సంస్థలు, సంపన్నులకు కాకుండా ఎవరికి ఉంటుంది?

సాంకేతిక దృష్టితో విద్యా విధానం మారాలి

తెలుగు అత్యంత లలితమైన భాష

- రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్
- ఘనంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం



నవతెలంగాణ-కల్చరల్

మారుతున్న కాలానికి అనుగుణంగా తరగతి గది నుంచి సాంకేతిక ప్రపంచ దృష్టితో విద్యా విధానం మారాలని రాష్ట్ర గవర్నర్ డా.తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ఇందుకు అనుగుణంగానే నూతన విద్యావిధానం -2020ను కేంద్రం ప్రభుత్వం తెచ్చిందన్నారు. విద్యావంతులు కావటానికి సులువు దారులు ఉండవని లక్ష్య శుద్ధిగా కృషి చేయటమే ఏకైక మార్గం అని చెప్పారు. హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రధాన వేదికపై బుధవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రనాట్య గురువు కళా కృష్ణకు గౌరవ డాక్టరేట్, విశ్వవిద్యాలయం పట్టభద్రులకు ఎంఫిల్, పీహెచ్‌డీలు, స్వర్ణ పతకాలను బహూకరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. మాతృ భాష ఆత్మగౌరవం పెంచుతుందని చెప్పారు. దేశ భాషల్లో తెలుగు అత్యంత లలితమైన భాష అని, మాట్లాడటం, వినడంలో ఆసక్తి కలిగిస్తుందని అన్నారు. ఇతర భాషల వారికి తెలుగు భాషా పరిమళం చేరాలన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా చిన్న చిన్న పుస్తకాలు విశ్వవిద్యాలయం ద్వారా ముద్రిస్తామని గవర్నర్ తెలిపారు. విశ్వ విద్యాలయం నుంచి పట్టా పొందిన వారు వారి రంగాల్లో అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.

విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ.. బోధన, పరిశోధన, ప్రచురణ, విస్తరణ.. సేవ ద్వారా తెలుగు భాష సంస్కృతి, సాహిత్యం, చరిత్రల పరిరక్షణ, అభివృద్ధికి విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని చెప్పారు. విశ్వవిద్యాలయంలో 30 బోధన అంశాలు, 52 సర్టిఫికేట్ డిప్లొమా, గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పరిశోధన విభాగాలు రెగ్యులర్‌గానే కాక కొన్ని సాయంకాలపు కోర్సుల బోధన జరుగుతుందని తెలిపారు. గ్రంథ ప్రచురణ చేయడంలో అంబేద్కర్ ప్రసంగాలు, రచనలు కూడా ఉన్నా యని వివరించారు. విశ్వవిద్యాలయం ప్రధాన బ్రాంచ్‌ని బాచుపల్లికి తరలించినా నాంపల్లి ప్రాంగణంలో డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులు ఉప కేంద్రంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గౌరవ డాక్టరేట్ అందుకున్న కళా కృష్ణ స్నాతకోపన్యాసం చేస్తూ.. గురు ముఖంగా గురుకులాలలో నేర్చుకునే లలితకళలు ఆశ్రమాలు దాటి విద్యాలయాలు, విశ్వవిద్యాలయ లకు చేరటం గొప్ప మార్పు అన్నారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరి జ్ఞానంతో నృత్య కళా రంగాలలో అధ్యయనం సులువు అవుతుందన్నారు. సంప్రదాయ కళలను డిజిటల్ రూపంలో సంరక్షించి భావితరాలకు అందజేయాలని కోరారు.

1189 మందికి డిగ్రీలు, 78 మందికి ఎంఫిల్, పీహెచ్‌డీలు, 30 మందికి ఎంఫిల్ పీహెచ్‌డీలకు స్వర్ణ పతకాలను, వివిధ విభాగాలలో మరో 31 మందికి కూడా స్వర్ణ పతకాలు బహుకరించారు. రిజిస్టర్ ఆచార్య భట్టు రమేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయంలో విఖ్యాత గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పేరిట వంశీ ఆర్ట్స్ అధినేత రామరాజు ఏర్పాటు చేసిన తొలి స్వర్ణ పతకం ఎంఏ సంగీతంలో అత్యధిక మార్కులు పొందిన మొహమ్మద్ లాయక్ అహ్మద్ అందుకున్నారు.

గవర్నర్‌కు అయోధ్య స్టాంపులు అందజేత



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అయోధ్య రామజన్మభూమి ఆలయంపై తపాలాశాఖ ముద్రించిన ప్రత్యేక స్టాంపుల్ని గవర్నర్ తమిళి సై సౌందరరాజన్‌కు తెలంగాణ శాఖ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి అందచేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరపున బుధవారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన గవర్నర్‌కు వీటిని అందచేశారు. గతనెల 18వ తేదీ ప్రధానమంత్రి మోడీ అయోధ్యలో విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా దీనిపై తపాలాశాఖ ప్రత్యేకంగా ఆరు స్టాంపుల్ని ముద్రించిన విషయం తెలిసిందే. వీటిని ఆరోజు ప్రధాని ఆవిష్కరించారు. సరయూనది నుంచి తీసిన నీరు, ఆయోధ్య మట్టితో పాటు బంగారు రేకు, గంధపు చెక్క సువాసన వంటి ప్రత్యేక లక్షణాలతో ఆరు స్టాంపుల మినియేచర్ షీట్‌ను పోస్టల్ శాఖ ముద్రించిన విషయం తెలిసిందే. ఈ షీట్‌తో పాటు రామాయణంపై విడుదల చేసిన ఫిలాటెలిక్ మెటీరియల్ "రామాయణ సాగా ఆఫ్ శ్రీరామ్, ఎ జర్నీ త్రూ స్టాంప్స్" పుస్తకాన్ని కూడా ఆయన గవర్నర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ తపాలాశాఖ సేవల్ని కొనియాడారు.

సోలార్‌పై పోస్టల్‌శాఖ సర్వే

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'ప్రధాన మంత్రి సూర్య ఘర్- ముఫ్త్ బిజిలీ యోజన పథకం' అమలు కోసం పోస్టల్‌శాఖ సర్వే నిర్వహిస్తున్నదని తపాలాశాఖ సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈ స్కీం ద్వారా ఇండ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకునే అర్హులైన కోటి మంది లబ్దిదారులకు 300 యూనిట్ల వరకు ప్రతి నెల ఉచిత విద్యుత్ అందిస్తారని తెలిపారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ఖర్చులో దాదాపు 40 శాతం వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తుందని వివరించారు. ఈ పథకం ద్వారా లబ్ది పొందాలనేకునే వారి వివరాలను సేకరించేందుకు పోస్టల్ శాఖ చేస్తున్న సర్వేలో ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. సమీపంలోని పోస్ట్ ఆఫీస్ లేదా పోస్ట్ మ్యాన్‌ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మార్చి 19న డాక్ అదాలత్

- వినియోగదారుల సేవలు మాత్రమే...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తపాలాశాఖకు సంబంధించి వినియోగదారుల సమస్యల్ని పరిష్కరించేందుకు మార్చి 19వ తేదీ డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ తెలంగాణ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ రంగారావు తెలిపారు. ఈ అదాలత్‌లో కేవలం వినియోగదారుల సమస్యల్ని మాత్రమే స్వీకరిస్తారనీ, పోస్టల్ ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్ మేటర్స్, పెండింగ్ సమస్యలు, కోర్టుల్లో ఉన్న కేసులను స్వీకరించబోరని స్పష్టం చేశారు. వినియోగదారులు తమ సమస్యల్ని మార్చి 8వ తేదీ లోపు హైదరాబాద్‌లోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్‌కు రాతపూర్వకంగా అందచేయాలని కోరారు. తమ ఫిర్యాదుల్లో తప్పనిసరిగా చిరునామా, ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్‌ను రాయాలనీ, ఆన్‌లైన్‌లో జరిగే సమావేశానికి సంబంధించిన లింక్‌ను దానికి పంపుతామని వివరించారు.

బీఆర్ఎస్‌కు ఒక్కసీటూ రాదు

- పోటీచేసేందుకే ఎవ్వరూ ముందుకు రావట్లేదు
- కాంగ్రెస్ అధిష్టానానికి ఏటీఎంలా తెలంగాణ :

ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదనీ, ఆ పార్టీ నుంచి పోటీచేసేందుకు కూడా అభ్యర్థులు ముందుకు రావడం లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు. కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి ఆర్థిక వనరులు అందించేందుకు తెలంగాణ ఒక ఏటీఎంలాగా మారిందని ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో, పాతబస్తీలో జరిగిన విజయ సంకల్ప యాత్రలో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందే రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య మార్పులు రాబోతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల గారడీతో గెలిచిందనీ, ఇప్పుడు పథకాల అమలుకు షరతులు పెట్టి కొందరికే ఇచ్చే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. అప్పుల ఊబిలో ఉన్న తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ గ్యారంటీలపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేస్తుందని ఎద్దేవా చేశారు. రెండు నెలలైనా రుణమాఫీ గురించి ఎందుకు మాట్లాడటం లేదని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికార ప్రతినిధికే భంగపాటు ఎదురైందనీ, తెలంగాణలోనూ తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం ఉందని చెప్పారు. రాష్ట్రంలో సీఎం, మంత్రులు నోటికొచ్చినట్టు మాట్లాడటం తగదని హితవు పలికారు. ఎంపీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలనే బరిలోకి దింపుతామన్నారు. వ్యాపారులకు, బడాబాబులకు కొమ్ముకాచే ఎంఐఎం పార్టీకి తగిన బుద్ధి చెబుతామనీ, ఎంఐఎం కంచుకోట అయిన హైదరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముస్లింలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగితే తమకు నష్టమనే ఉద్దేశంతోనే పాతబస్తీకి మెట్రో రాకుండా ఎంఐఎం అడ్డుకుంటున్నదని విమర్శించారు.

శాస్త్ర ప్రగతే.. దేశ ప్రగతి

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డా. కోయ వెంకటేశ్వరరావు
- విజ్ఞాన జ్యోతి పబ్లిక్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు





నవతెలంగాణ- జూబ్లీహిల్స్/సిటీబ్యూరో

శాస్త్రం ప్రగతే దేశ ప్రగతి అని, దేశంలో శాస్త్రరంగాలు అభివృద్ధి చెందాలంటే ముందుగా విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ దిశగా జేవీవీ కృషి చేస్తోందని చెప్పారు. బుధవారం జన విజ్ఞాన వేదిక జూబ్లీహిల్స్ కమిటీ ఆధ్వర్యంలో విజ్ఞాన జ్యోతి పబ్లిక్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. జూబ్లీహిల్స్ కమిటీ అధ్యక్షులు ఎస్.రవి అధ్యక్షత వహించారు. అలాగే, జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర కమిటీ, రాజాబహదూర్ వెంకట్రామ్‌రెడ్డి ఫార్మసీ మహిళా కళాశాల సంయుక్తంగా కళాశాలలో సైన్స్ సంబురాలు నిర్వహించాయి.

విజ్ఞాన జ్యోతి పబ్లిక్ స్కూల్‌లో ముఖ్య ఉపన్యాసకులుగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సైన్స్ మన జీవన గమనానికి, గమ్యానికి దోహద పడుతుందన్నారు. ప్రకృతి, సమాజాన్ని గురించిన నియమాలను అవగాహన చేసుకోవాలన్నారు. సైన్స్‌కు సంబంధించిన వాస్తవాలను అనుభవాల ద్వారా సృజాత్మకతను పెంపొందించే విధంగా, ప్రయోగాల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. నేడు కొంత మంది స్వార్థ రాజకీయ నాయకులు మిడి మిడి జ్ఞానంతో అశాస్త్రీయ ప్రచారాలు చేస్తూ సైన్స్‌ను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి భావవాద అశాస్త్రీయమైన ప్రచారాలు, మూఢ నమ్మకాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు కొన్ని గట్టి చట్టాలు అమలు చేయాలని.. అందులో ప్రజలను, విద్యార్థులను భాగస్వాములుగా చేయాలని కోరారు. సీనియర్ నాయకులు మోహన్ మాట్లాడుతూ.. సృష్టి క్రమాన్ని, జీవ పరిణామాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చదివి.. పిల్లలకు వివరిస్తూ సైన్స్‌ను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రశ్నించే స్వభావం ఏర్పర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు ఎస్.జితిన్ ప్రసాద్, విజ్ఞాన్ జ్యోతి పబ్లిక్ స్కూల్ సీనియర్ ప్రిన్సిపాల్ జె.అరుణ కుమారి పాల్గొన్నారు.

ఫార్మసీ మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య మాట్లాడారు. సూడో సైన్స్ ప్రజలను అంధకారంలోకి నెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచే ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని సూచించారు. విద్యార్థులు ఎప్పుడూ వినూత్నంగా ఆలోచించాలన్నారు. శాస్త్రీయ ఆలోచనలు సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాయని చెప్పారు. నేటి పాలకులు సైన్స్ ప్రయోగాలను ప్రోత్సహిస్తేనే సైన్స్ రంగంలో సరికొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయన్నారు. కేంద్ర బడ్జెట్‌లో సైన్స్ రంగానికి కేటాయింపులు మరింత పెంచాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సుమకాంత్ మాట్లాడుతూ.. సమాజంలో మూఢనమ్మకాలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విద్యార్థులంతా శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర నాయకులు ఎస్పీ లింగస్వామి, వెంకట్, ఆర్‌బీవీఆర్ ఫార్మసీ మహిళా కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ ఎం.విజయ భార్గవి, అధ్యాపకులు అనుశ్రీ, అపర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల చూపు ఓటీటీ వైపు

వీటి సేవలను పొందుతున్న వారి సంఖ్య అధికం

- ఇంటర్నెట్ వినియోగంలో గ్రామీణం టాప్
- ఈ సంఖ్య 53 శాతం మందికి పైగానే :తాజా నివేదిక



న్యూఢిల్లీ : కరోనా తర్వాత భారత్‌లో ఓటీటీ(ఓవర్ ది టాప్) ప్రభావం పెరిగిపోయింది. ఓటీటీకి అలవాటైన దేశంలోని ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య అధికంగానే ఉన్నది. భారత్‌లో 86 శాతం మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఓటీటీ ఆడియో, వీడియో సేవలను ఆస్వాదిస్తున్నారు. ఇది దేశంలో ఇంటర్నెట్‌కు అత్యధిక వినియోగ వేదికగా మారిందని ఇంటర్నెట్, మొబైల్ అసోసియేషన్, మార్కెటింగ్ డేటా అండ్ అనలిటిక్స్ కంపెనీ కాంటార్ నివేదిక స్పష్టం చేసింది. లక్షద్వీప్ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 90,000 కుటుంబాల నుంచి వచ్చిన ఇన్‌పుట్‌ల ఆధారంగా తయారైన నివేదికను ప్రస్తుతం కొనసాగుతున్న ఇండియా డిజిటల్ సమ్మిట్ 2024లో విడుదల చేశారు.

నివేదిక సమాచారం ప్రకారం.. స్మార్ట్ టీవీ, స్మార్ట్ స్పీకర్లు, ఫైర్‌స్టిక్‌లు, క్రోమ్‌కాస్ట్‌లు పెరగటం ద్వారా డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ సేవల పెరుగుదలకు బలం చేకూరింది. 2021 నుంచి 2023 వరకు 58 శాతం వృద్ధి చెందింది. ఎందుకంటే ఎక్కువ మంది ఇంటర్నెట్-ఓన్లీ పరికరాల ద్వారా (20.8 కోట్లు) వీడియో కంటెంట్‌ను పొందుతున్నారు. గ్రామీణ వినియోగదారులు 50 శాతం మందికి పైగా ఓటీటీ సర్వీసులను వాడుకుంటున్నారు.

ఓటీటీ తర్వాత ఇంటర్నెట్ రెండో, మూడో అత్యంత ప్రజాదరణ పొందిన వినియోగ-కేసులు కమ్యూనికేషన్లు, సోషల్ మీడియాలు ఉన్నాయి. 2023 నాటికి దేశంలో 82.3 కోట్ల మందికి పైగా క్రియాశీల ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారు. 44.2 కోట్ల మందితో గ్రామీణ వినియోగదారులు మెజారిటీగా ఉన్నారు. మొత్తం యూజర్ బేస్‌లో 53 శాతానికి పైగా ఉన్నారు.

లింగం ఆధారంగా చూస్తే.. ఇంటర్నెట్ వినియోగదారుల యొక్క స్త్రీ-పురుష నిష్పత్తి 2015లో 71:29 నుంచి 2023లో 54:46కి పెరిగింది. 57 శాతం మంది వినియోగదారులు తమ స్థానిక భాషల్లో కంటెంట్‌ను యాక్సెస్ చేయడానికి ఇష్టపడుతున్నారు. తమిళం, తెలుగు, మలయాళం కంటెంట్‌లకుబలమైన భాషా ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. అత్యల్ప ఇంటర్నెట్ యూజర్ బేస్ ఉన్న రాష్ట్రాలు ఇప్పుడు వేగవంతమైన వృద్ధి రేటును కలిగి ఉన్నాయి.

ఎన్డీయే కూటమి బలహీనపడుతోంది

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్డీయే కూటమి బలహీనపడుతోందని, మరోపక్క ఇండియా కూటమి బలపడుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. బుధవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. బీహార్‌లో నితీష్ కుమార్ పోయినా కూటమి బలోపేతం అవుతోందని, బీజేపీకి వ్యతిరేకంగా తమ పోరాటం ఉంటుందని తెలిపారు. కేరళలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలే పోటీ చేస్తాయని, అక్కడ ఎవరు గెలిచినా కేంద్రంలో బీజేపీ రాకూడదనే తమ వైఖరి అని అన్నారు. ప్రజా సమస్యలను వదిలేసి ప్రధాని రాజకీయాలు మాట్లాడుతున్నారని, రైతులు ఆందోళనలో ఉంటే జంతువులను వేటాడినట్లు వేటాడుతున్నారని విమర్శించారు. అన్నదాతలపై యుద్ధం సరికాదని హితవు పలికారు. రాముడిని, కృష్ణుడిని అడ్డంపెట్టుకుని ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దేవుళ్లను కలిసే మోడీ సమస్యల్లో ఉన్న ప్రజలను ఎందుకు కలవరు అని ప్రశ్నించారు. విగ్రహాలు తెచ్చానని గొప్పలు చెప్పుకునే మోడీ, లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వాళ్లను ఎందుకు వెనక్కి తీసుకురాలేకపోతున్నాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రజలకు మేలు చేసి ఉంటే ఇన్ని జిమ్మిక్కులు చేయాల్సిన అవసరం వచ్చేదికాదని అన్నారు. అడ్మినిస్ట్రేషన్‌ను ఉపయోగించుకొని ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు.

ఫిదా ఫలూదా...

ఈ సారి ఫిబ్రవరి లోనే వేసవి వచ్చేసింది. పగటి పూట వేడి గాలులు మెల్లమెల్లగా పెరుగుతున్నాయి. ఇంకొద్ది రోజులయితే భానుడు తన ప్రతాపాన్ని ఇంక చూపించక మానడు... పగలంతా సూర్యుడి భగభగలకు బలికాక తప్పదు.. మరి ఈ వేడి నుంచి ఉపశమనం పొందాలంటే అందరూ చల్లని చల్లని పానీయాలను ప్రిఫర్ చేస్తారు. కడుపులో చల్లగా అంటే... ఏది పడితే అది తాగితే అనారోగ్యాల పాలు కాక తప్పదు. దీనితో పాటు ఇంట్లో రెగ్యులర్‌గా చేసుకునే నిమ్మకాయ, మజ్జిగలతో ఫ్రూట్ జ్యూస్‌ల లాంటివి కాకుండా కొంచెం వెరైటీగా టేస్ట్ చేద్దాం అనుకుంటే ఫలూదా ప్రయత్నించాల్సిందే. పిల్లలు, పెద్దలు కూడా తాగేందుకు బాగా ఆసక్తి చూపుతారు. అంతే కాదు, బయటి ఆహారంపై భద్రత ఉండదు కూడానూ. మరి ఇంట్లోనే ఫ్రూట్ ఫలూదా ఎలా తయారు చేసుకో వచ్చో ఓ సారి చూసేద్దామా..



ఫ్రూట్‌తో...

కావాల్సిన పదార్థాలు: ఫలూదా (సబ్జా గింజలు) - రెండు చెంచాలు, సేమ్యా - అర కప్పు, పాలు - ఒకకప్పు, యాపిల్, అరటి - సగం ముక్క, పైనాపిల్ - పావు ముక్క, దానిమ్మ గింజలు - పావు కప్పు, రోజ్ సిరప్ - ఒక చెంచా, కండెన్స్‌డ్ మిల్క్ - పావు కప్పు

తయారు చేసే విధానం: ముందుగా స్టవ్ ఆన్ చేసి సేమ్యాను సగం ఉడికేలా చేసుకుని సిద్ధంగా పెట్టుకోవాలి. ఒక పొడవాటి గాజు గ్లాసును తీసుకుని, రెడీ చేసి పెట్టుకున్న సేమ్యాను అందులో వేసుకోవాలి. మరిగించి చల్లార్చి పెట్టుకున్న పాలను ఇందులో పోయాలి. నానబెట్టి పెట్టుకున్న సబ్జా గింజలను వేసుకోవాలి. ఇప్పుడు చెంచాడు రోజ్ సిరప్ వేసుకోవాలి. తర్వాత యాపిల్, అరటి, పైనాపిల్ ముక్కలను చిన్నగా కట్ చేసి వేసుకోవాలి. ఇందులోనే కండెన్స్‌డ్ మిల్క్ వేసుకోవాలి. ఇప్పుడు ఈ గ్లాస్‌ను రెండు గంటల పాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. తర్వాత బయటకు తీసి దానిమ్మ గింజలతో అలంకరించాలి. అంతే కూల్ కూల్ ఫలూదా రెడీ.

రాయల్ ...

కావాల్సిన పదార్థాలు: నీళ్లు - రెండు కప్పులు, వెర్మిసెల్లి - అర కప్పు, సబ్జా - మూడు చెంచాలు, పాలు - ఒక గ్లాసు, చెక్కెర - ఒక చెంచా, రోజ్ సిరప్ - రెండు చెంచాలు, కాజు, బాదం, పిస్తా - అర కప్పు (చాప్ చేసుకుని పెట్టుకోవాలి), ఐస్ - ఒక చిన్న క్యూబ్, టూటీ ఫ్రూటీ - మూడు చెంచాలు, వెనీలా ఐస్ క్రీమ్ - అర కప్పు



తయారు చేసే విధానం: స్టవ్ ఆన్ చేసి కడాయి పెట్టి అందులో రెండు కప్పుల నీళ్లు పోసి బాగా కాగాక వెర్మిసెల్లి వేసి సన్న మంట మీద ఉడికించాలి. ఈ వెర్మిసెల్లి ఉడికిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి బాగా చల్లారనివ్వాలి. సబ్జా నాలుగు గంటల ముందే నానబెట్టి పెట్టుకోవాలి. ఒక గ్లాసు కాగబెట్టిన పాలు తీసుకుని అందులో చెక్కెర, ఒక చెంచా రోజ్‌సిరప్ వేసి బాగా కలపాలి. ఐస్ క్యూబ్‌ను క్రష్ చేసి పక్కన పెట్టుకోవాలి. ఒక గ్లాస్ తీసుకుని అందులో రెండు చెంచాల సబ్జా, ఐస్, రెండు చెంచాల వెర్మిసెల్లి, టూటీ ఫ్రూటీ రెండు చెంచాలు, ఒక చెంచా రోజ్ సిరప్ తర్వాత మిగిలిన సబ్జా, వెర్మిసెల్లి, టూటీఫ్రూటీ, వెనీలా ఐస్ క్రీమ్ అర కప్పు, కలిపి పెట్టుకున్న పాలు అన్ని వేసుకుని పైన డ్రైఫ్రూట్స్‌తో గార్నిష్ చేసుకుంటే సరి.

ఈ విషయాలు తెలుసా..?



మారుతున్న కాలంతో పాటు పని వేళల్లో మార్పులొచ్చాయి. వాటికి తగినట్టుగానే నిద్ర విషయంలోనూ ఆ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఏ సమయంలో ఏం చేయాలో అది చేయకపోతే సమస్యలను కొని తెచ్చుకున్నట్టే అనేది నిద్ర విషయంలో బాగా సరిపోతుంది. నిద్ర తగ్గడానికి కారణాలు ఒకటి, రెండు కాదు.. అనేకం ఉన్నాయి. ఉద్యోగ సమయాలు, అందుబాటులో ఉన్న టెక్నాలజీ, మారుతున్న జీవనసరళి వంటివి నిద్రపై ఎంత ప్రభావం చూపుతున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అయితే నిద్ర మనకు ఎంత అవసరమో, సరిగా నిద్రపోకపోతే ఏర్పడే సమస్యలేంటో తెలుసుకుందాం...

శారీరక ఆరోగ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని కాపాడటంలో నిద్ర ముఖ్య పాత్ర పోషిస్తుంది. మనిషికి ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. ఎప్పుడైనా తప్పనిసరైతే ఆ సమయాన్ని కొంచెం తగ్గించుకోవడం వల్ల పెద్ద సమస్యలు ఉండవు. కానీ అదే అలవాటైతే మాత్రం అనేక శారీరక, మానసిక సమస్యలకు దారి తీస్తుంటాయి. అంతేకాదు, నిద్ర అవసరం కదా అని అదే పనిగా నిద్ర పోయినా ప్రమాదమే. ప్రపంచవ్యాప్తంగా అన్ని వయస్సుల వారికి రోగాలెలా వస్తాయో చూస్తే.. ఎక్కువ నిద్ర, తక్కువ నిద్ర రెండూ ఆరోగ్యానికి మంచివి కావని పలు అధ్యయనాల్లో తేలింది. ఆరోగ్యంగా ఉండాలంటే మాత్రం ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు.

తేడాలు

ఎక్కువ నిద్ర, తక్కువ నిద్ర విషయానికి వస్తే ఆరు గంటల కంటే తక్కువగా నిద్రపోవడాన్ని తక్కువ నిద్ర అని, పది గంటల కన్నా ఎక్కువ నిద్రపోవడాన్ని ఎక్కువ నిద్ర అని నిపుణులు సూచిస్తున్నారు. ఈ రెండూ ఆరోగ్యానికి మంచివి కావట. అయితే ఇది అందరికీ ఒకేలా వర్తించదు.

అప్పుడే పుట్టిన పిల్లలు 18 గంటలు నిద్ర పోవాలని, చిన్న పిల్లలు 11 గంటలు నిద్రపోవాలని, టీనేజీలో ఉండే వారు 10 గంటలు నిద్రపోవాలని నిపుణులు అంటున్నారు. నిద్రలేమి, అనారోగ్యం ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని లండన్‌లో నిర్వహించిన ఓ పరిశోధనలో వెల్లడైందట. ఈ రోజుల్లో ఎక్కువ నిద్ర పోయే వారు అరుదుగానే ఉంటారు. ఇక తక్కువ నిద్ర పోయే వారికి సంబంధించి కొన్ని విషయాలున్నాయి.

శరీరంపై ప్రభావం

నిద్రలేమి ఎన్నో రుగ్మతలకు దారి తీస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. నిద్రలేమికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన 153 అధ్యయనాల్లో చాలా మందికి నిద్రలేమితో మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బు, గుండె సంబంధిత వ్యాధులు, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చాయని వారు కనుగొన్నారు. యుక్తవయసులో వరుసగా కొన్ని రాత్రులు నిద్రలేకుండా ఉంటే కూడా అది మధుమేహానికి దారి తీస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. నిద్రలేమితో రక్తంలో గ్లూకోస్ స్థాయిని నియంత్రించే సామర్థ్యం దెబ్బతిని, తత్ఫలితంగా నిద్రలేమి రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. దీంతో తొందరగా ఇన్‌ఫెక్షన్‌లు సోకే అవకాశముంటుందని ఆ అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఏడు గంటల కన్నా ఎక్కువ నిద్ర పోయేవారి కన్నా, తక్కువ నిద్రపోయేవారికి జలుబు త్వరగా వస్తుందని ఓ అధ్యయనంలో తేలింది.

నిద్రలేమితో ఆకలిని పుట్టించే హార్మోన్ గ్రెలిన్ ఎక్కువగా విడుదలయ్యి ఆకలి ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుందని, కడుపు నిండిందనే భావన కల్పించే హార్మోన్ లెప్టిన్ తక్కువగా విడుదలయ్యి మరింత ఆహారం తినేవిధంగా చేసి, ఊబకాయానికి దారి తీస్తుందని మరో అధ్యయనంలో వెల్లడైంది.



మెదడు పనితీరుపై ప్రభావం

ప్రతిరోజూ మెదడులో కొన్ని వ్యర్థ కణాలు పెరుగుతాయని, నిద్రపోయినప్పుడు అవి తొలగిపోతాయని ప్రొఫెసర్ షేన్ ఓమారా పేర్కొన్నారు. అందుకే సరిపడ నిద్రలేకపోతే ఆ వ్యర్థ కణాలు మెదడులో పేరుకుపోతాయని, ఆ పరిస్థితి అలానే కొనసాగితే మెదడు పనితీరుపై ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు.

ఎక్కువ నిద్ర దుష్ప్రభావాల గురించి చాలా మందికి తెలియదు. కానీ అతినిద్రతో జ్ఞాపకశక్తి క్షీణించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.

పని వేళల వల్ల...

షిఫ్టుల్లో పనిచేసేవారికి సమస్యలు తప్పవు. షిఫ్టుల్లో పనిచేసే వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలా తక్కువ నిద్రపోయే వారికి మధుమేహం, ఊబకాయం వచ్చే ప్రమాదాలున్నాయని పరిశోధకులంటున్నారు. బ్రిటన్‌లో నిర్వహించిన ఓ అధ్యయనంలో ఇలాంటి వారు దీర్ఘకాల అనారోగ్యం పాలవుతున్నారని తేలింది.

నిద్రలేమి ప్రభావం శారీరక శ్రమతో కూడిన ఉద్యోగంలో, ఒకేచోట కూర్చొని చేసే ఉద్యోగుల విషయంలో భిన్నంగా ఉంటుందని కూడా తేలింది. ఒకేచోట కూర్చొని పనిచేసే ఉద్యోగులపై నిద్రలేమి ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు తెలుపుతున్నాయి.

స్త్రీలపై...

నిద్రలేమి స్త్రీలపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉందని, అయితే వారే ఎక్కువగా నిద్రలేమితో బాధపడుతున్నారని తేలింది.

పిల్లల పెంపకం, ఉద్యోగం మహిళల నిద్రలేమికి ముఖ్య కారణాలని అంటున్నారు. కెఫిన్, మద్యం కూడా నిద్రపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నిపుణులంటున్నారు.

రాత్రివేళల్లో పార్టీల్లో, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ.. పగటిపూట ఎక్కువసేపు నిద్ర పోయినా ఆ నిద్ర రాత్రి నిద్రకు సమానమవ్వదని తెలిపారు.

స్మార్ట్ ఫోన్‌ల ప్రభావం

టీనేజర్లు రాత్రిపూట ఎక్కువగా ఫోన్‌లు చూస్తూ నిద్రకు దూరమవుతున్నారట. ఒకప్పుడు బెడ్‌రూమ్ అంటే విశ్రాంతికి మాత్రమే ఉండేది. ఇప్పుడక్కడ ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు అత్యధికంగా కనిపిస్తున్నాయి. వీటి నుంచి వెలువడే నీలి రంగు వెలుతురు కళ్లపైపడి నిద్ర రాకుండా చేస్తుందని పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి.

పరిష్కారాలు

నిద్రలేమికి 'కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ' అంటే.. ఆలోచనా, ప్రవర్తనా విధానాన్ని మార్చే చికిత్సే పరిష్కారమని నిపుణులు అంటున్నారు. నిద్రలేమి సమస్యకు నిద్రమాత్రలు పరిష్కారం కాదని హెచ్చరిస్తున్నారు.

అంతామాయ..

(మొదటిపేజీ తరువాయి)

ఆహార కల్తీ మాఫియా విజృంభిస్తోంది. నీరు, తిండి, రక్తం, పాలు, పాలపొడి, పసుపు మొదలు కారం, పండ్లు, శీతల పానీయాలతోపాటు వంటనూనెల దాకా అన్నింటా పెచ్చురిల్లుతున్న కల్తీ దందా ప్రజారోగ్యాన్ని కుళ్లబొడుస్తోంది. చట్టాలు ఉన్నా వాటిని సరిగా అమలు చేయకుండా.. తూతూమంత్రంగా కొనసాగుతున్న దాడులు, మోసగాళ్లకు శిక్షలు పెద్దగా పడకపోవడంతో నగరంలో నలుమూలలా కల్తీ మాఫియా పెరుగుతోంది. రసాయనాలు కలగలసిన కల్తీ వస్తువులతో జనం కడుపులో విషం నింపుతున్నారు. పాలల్లో కల్తీ పసిబిడ్డల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుండగా.. ఎక్స్‌పైరీ వస్తువులు, రసాయనాల వినియోగం నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తోంది. నూనెలు తదితరాల కల్తీ క్యాన్సర్లు, పేగుల్లో పుండ్లకు కారణభూతమవుతోంది. వీటి వెనుక పెద్ద పెద్ద తలకాయల హస్తం ఉండటం.. రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో అధికారులు చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారు. చిన్న చిన్న వారిపై దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

గరంమసాల నుంచి నూనెవరకు

గరం మసాల నుంచి నూనె వరకు ప్రతొక్కటీ కల్తీ చేస్తున్నారు. జంతువుల కొవ్వు, కళేబరాల నుంచి తీసిన నూనె లీటర్ రూ.50 నుంచి రూ.70 ధరకు విక్రయిస్తున్నారు. దానిని ప్యూరిఫై చేసి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. చిన్న హోటల్ నుంచి ఓ మోస్తరు పెద్ద హోటళ్లకు దీన్ని సరఫరా చేస్తున్నారు. హోటళ్లకు వచ్చే వినియోగదారులకు అనుమానాలు రాకుండా నిర్వాహకులు అసలైన నూనె సగం, నకిలీ నూనె సగం వాడుతుంటారు. డబ్బాలలో నింపి విక్రయిస్తుండటంతో కొందరు మంచి నూనెగా భావించి కొంటున్నారు. నకిలీ నూనె పామాయిల్‌లా తెల్లగా గడ్డకట్టి ఉంటుంది. నూనె దురాస్వన వస్తే అది కచ్చితంగా నకిలీదేనని చెప్పొచ్చు. డాల్డాలా ఉండే ఈ నకిలీ ఆయిల్ అసలు డాల్డా, పామాయిల్ కరిగే సమయం కంటే ఆలస్యంగా కరుగుతుంది. ఈ నూనెలు వాడిన ఆహారం తింటే భవిష్యత్‌లో గుండె, ఊపిరితిత్తులు, కాలేయంపై ప్రభావం పడుతుంది.

ఐదు రోజుల్లో మూడు కేసులు

ప్రముఖ కంపెనీలకు చెందిన టీపౌడర్లు, వాషింగ్ పౌడర్ల పేరుతో నకిలీ వస్తువులు తయారీ చేస్తూ దుకాణదారులకు సరఫరా చేస్తున్న ముగ్గురు నిందితులను గత శనివారం సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2కోట్ల విలువైన కోకోనట్ ఆయిల్, టీ పౌండర్, లైజాల్, హార్పిక్, ఎవరెస్ట్ తదితర కంపెనీలకు చెందిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గడువుతీరిన రసాయనాలతో బూందీ, మిక్చర్ తయారీ చేస్తూ మార్కెట్‌లో సరఫరా చేసిన నిందితుడిని గత సోమవారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. తాజాగా నగరంలో సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు బేగంపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నకిలీ అల్లం పేస్టు తయారీదారులు నలుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.5లక్షల విలువగల అల్లంపేస్ట్ తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

సులువుగా సంపాదన కోసం

కష్టపడకుండానే సులువుగా డబ్బులు సంపాదించాలన్న దురాలోచనతో అన్నిటినీ కల్తీ చేస్తున్నారు. పాడుబడ్డ కార్ఖానా, గోదాంను అడ్డాగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా తయారు చేస్తున్నారు. ఇంకొందరు కుటీర పరిశ్రమలాగా ఏకంగా ఇంట్లోనే తయారు చేస్తున్నారు. గడువుతీరిన వాటిని తీసుకొచ్చి కొత్తగా ప్యాక్ చేసి సరఫరా చేస్తున్నారు. బెల్లంతో పానకం తయారు చేసి వాటిలో కెమికల్స్ కలిపి తేనెగా అమ్ముతున్నారు. డాల్డా, పామాయిల్, నకిలీ నెయ్యి తయారు చేస్తూ స్థానిక కిరాణ జనరల్ స్టోర్స్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. డేట్ అయిపోయిన మందులను కూడా.. వాటిపై స్టిక్కర్స్ తొలగించి కొత్త వాటిగా మార్పు చేసి మెడికల్ షాపుల్లో అమ్ముతున్న వైనాలు జరుగుతున్నాయి. కల్తీ అయిన ఆహార పదార్థాలను తినకూడదని వైద్యాధికారులు చెబుతున్నా.. సూచనల వరకే పరిమితమవుతున్నాయి. దీన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటే తప్ప ఇలాంటి కల్తీలను అరికట్టడం సాధ్యపడదని విద్యావేత్తలు అంటున్నారు.

శాంతిభద్రతలపై కేంద్రం పెత్తనమేంది?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అనుమతి లేకుండా ఎన్ఐఏ సోదాలు చేయకూడదు, కేసులు పెట్టకూడదు అని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. వేణుగోపాల్ ఇంటిపై ఫిబ్రవరి ఎనిమిదో తేదీన ఎన్ఐఏ దాడి చేసి, అతని సెల్ ఫోన్ ఎత్తుకుపోయిన నేపథ్యంలో 'జర్నలిస్టులపై ఎన్ఐఏ దాడులను ఖండించండి' అనే పేరుతో వీక్షణం కలెక్టివ్ ఆధ్వర్యంలో బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టుల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..పాలకుల లోపాలను ఎత్తిచూపుతూ మెరుగైన సమాజ నిర్మాణానికి సూచనలు చేసే జర్నలిస్టులపై ఎన్ఐఏ దాడులు చేయడం సరిగాదన్నారు. పాలకపక్షాలను ప్రశ్నిస్తే దేశద్రోహులని ముద్ర వేస్తారా? అని ప్రశ్నించారు. ప్రొఫెసర్ హరగోపాల్, వేణుగోపాల్‌పై కేసులను ఎత్తివేయించాలనే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.. పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తున్నదనీ, వాటిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని విమర్శించారు. చివరకు జర్నలిస్టుల భావప్రకటనా స్వేచ్ఛ మీదా దాడి చేస్తున్నారనీ, వీటిని సమాజంపై దాడిగా చూడాలని చెప్పారు. ప్రత్యామ్నాయ భావజాల విస్తరణకు ఫాసిజం అంగీకరించదనీ, అందులో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని అన్నారు. వీక్షణం సంపాదకుడితో పాటు అనేక మంది మీద గత ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలనీ, ఉపా వంటి అక్రమ చట్టాలను ఉపయోగించవద్దని సూచించారు. రాజ్యాంగ, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఎన్ఐఏను రాష్ట్రాల్లోకి చొరబడకుండా అడ్డుకోవాలని పౌరసమాజానికి పిలుపునిచ్చారు. ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒకప్పుడు స్వేచ్ఛగా అభిప్రాయాలు ప్రకటించే వెసులుబాటు ఉన్న ఏకైక వృత్తిగా ఉండిన జర్నలిజం పదేండ్లల్లో ఆ స్థానాన్ని పోగొట్టుకున్నదన్నారు. విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టు సిద్ధిఖీ కప్పన్‌ను తప్పుడు కేసులో ఏండ్ల తరబడి జైలులో నిర్బంధించిన పరిణామాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పాలకులు జర్నలిస్టుల విశ్వసనీయతను పోగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారనీ, అందులో భాగంగానే దాడులు, తప్పుడు కేసుల బనాయింపులు జరుగుతున్నాయని చెప్పారు. సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ..రాష్ట్ర జాబితాలోని శాంతిభద్రత విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఇది సమాఖ్య స్ఫూర్తిని అవమానించడమేనన్నారు. టెర్రరిస్టులపై పెట్టాల్సిన కేసులను జర్నలిస్టులపై ఎందుకు మోపుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. వీక్షణం సంపాదకుడిపై కేసు, దాడులనేవి పాలకులందరిలోనూ పెరిగిపోతున్న అసహనానికి నిదర్శనమన్నారు.

వారు భిన్నాభిప్రాయాలను సహించలేని పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. భీమాకోరేగావ్ లాంటి హాస్యాస్పద కేసు ప్రపంచ చరిత్రలో ఎక్కడా నమోదు కాలేదని విమర్శించారు. సీనియర్ జర్నలిస్టు కల్లూరి భాస్కరం మాట్లాడుతూ.. వేణుగోపాల్‌ను సొంతింటిలో నాలుగుగంటల పాటు ఎన్ఐఏ వేధించడాన్ని ఖండించారు. నేడు దేశంలో పౌరుల హక్కులపై దాడి జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అధ్యక్షులు విరాహత్ అలీ మాట్లాడుతూ గత ప్రభుత్వం కొన్ని వందల మంది మీద ఇటువంటి తప్పుడు కేసులు బనాయించిందనీ, కొత్త ప్రభుత్వం ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటున్నది గనుక ఆ కేసులన్నింటినీ సమీక్షించి, ఉపసంహరించుకోవాలని కోరారు. ఎ.నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనం సాక్షి ఎడిటర్ ఎం.రహమాన్, జర్నలిస్టు సంఘం నాయకులు మారుతీసాగర్, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ఎంపిక చేశామని వివరించారు. నల్లగొండ, మెదక్, జనగామ, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల్లో ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు వెళ్లి పరీక్షను పరిశీలించారని తెలిపారు. ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కొనసాగిందని పేర్కొన్నారు. గురువారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. వారికి సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష ఉంటుంది.

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. మొబైల్‌ఫోన్లను పరీక్షా కేంద్రాల వద్ద అనుమతించొద్దని కోరారు.

2029లో జమిలి ఎన్నికలు..!

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జస్టిస్ (రిటైర్డ్) రీతు రాజ్ అవస్తీ ఆధ్వర్యంలోని కమిషన్, ఏకకాల ఎన్నికలపై "కొత్త అధ్యాయం, భాగాన్ని" జోడించడానికి రాజ్యాంగంలో సవరణను సిఫారసు చేస్తుందని తెలిపాయి. 19వ లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న 2029 మే-జూన్‌లో మొదటి ఏకకాల ఎన్నికలను నిర్వహించేందుకు వీలుగా వచ్చే ఐదేండ్లలో శాసన సభల నిబంధనలను "మూడు దశల్లో" సమకాలీకరించాలని కూడా ప్యానెల్ సిఫారసు చేస్తోంది.

రాజ్యాంగంలోని కొత్త అధ్యాయంలో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలు, పంచాయతీలు, మునిసిపాలిటీలకు "ఏకకాల ఎన్నికలు", "ఏకకాల ఎన్నికల సుస్థిరత", "కామన్ ఎలక్టోరల్ రోల్"కు సంబంధించిన అంశాలు ఉంటాయి. సిఫార్సు చేయబడిన కొత్త అధ్యాయం రాజ్యాంగంలోని అసెంబ్లీ నిబంధనలతో వ్యవహరించే ఇతర నిబంధనలను భర్తీ చేసే అధికారం కలిగి ఉంటుంది.

సమావేశాల నిబంధనలు సమకాలీకరించబడే ఐదేండ్ల వ్యవధి మూడు దశల్లో విస్తరిస్తుంది. మూడు లేదా ఆరు నెలల కాలవ్యవధిని కొన్ని నెలలు కుదించాల్సిన రాష్ట్రాల అసెంబ్లీలతో మొదటి దశ ఉంటుందని కమిషన్ సిఫార్సు చేస్తుంది. అవిశ్వాసం కారణంగా ప్రభుత్వం పతనమైతే లేదా హంగ్ ఏర్పడితే, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కూడిన "ఐక్య ప్రభుత్వాన్ని రాజ్యాంగాన్ని కమిషన్ సిఫారసు చేస్తుంది. ఐక్య ప్రభుత్వ ఫార్ములా పని చేయని పక్షంలో, మిగిలిన సభ వ్యవధిలో తాజా ఎన్నికలు నిర్వహించాలని లా ప్యానెల్ సిఫారసు చేస్తుంది. లా కమిషన్‌తో పాటు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి కమిటీ కూడా రాజ్యాంగాన్ని, ప్రస్తుత చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను మార్చడంతో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలు, మునిసిపాలిటీలు, పంచాయతీలకు ఏకకాలంలో ఎన్నికలు ఎలా నిర్వహించవచ్చనే దానిపై నివేదికను రూపొందిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్-మేలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలతో పాటు, కనీసం ఐదు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాలకు ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది బీహార్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ 2026లోనూ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ మరియు మణిపూర్‌లకు 2027లో ఎన్నికలు జరగనున్నాయి. 2028లో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, కర్ణాటక, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ వంటి తొమ్మిది రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగవచ్చు.

రోడ్డున పడిన నేతన్న

(మొదటిపేజీ తరువాయి)

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. 70శాతానికి పైగా మరమగ్గాలు ఆగిపోయాయని, నేత కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాధర్నాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు, తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర అధ్యక్షులు మూశం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, నేత కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జార్ఖండ్‌లో ఘోర రైలు ప్రమాదం

రాంచీ: జార్ఖండ్‌లో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే ట్రాక్ దాటుతున్న వ్యక్తులను బెంగళూరు -భాగల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 12 మంది చనిపోయినట్టు సమాచారం. ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాలను గుర్తించారు. ప్రమాదం జరిగిన చోట చీకటిగా ఉండటంతో.. సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని రైల్వే అధికారులు తెలిపారు. అనసోల్ పరిధి జంతారా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్రమత్తమైన సిబ్బంది ఘటనాస్థలానికి వైద్య బృందాలను, అంబులెన్స్‌లను తరలించారు. పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

నేడే డీఎస్సీ నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

భర్తీ చేయనుంది. అయితే స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 ఉన్నాయి. అందులో 507 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. మిగిలిన 1,016 పోస్టులను నేరుగా భర్తీ చేస్తారు. డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) 2,849 పోస్టులు, సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) 7,304 పోస్టులు, పండితులు 727 పోస్టులు, పీఈటీలు 182 పోస్టులున్నాయి. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి 2017, అక్టోబర్ 21న ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) నోటిఫికేషన్‌ను మొదటిసారి జారీ చేసింది. ఆ నియామకాల ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. మళ్లీ గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రెండోసారి నోటిఫికేషన్‌ను విడుదల అయ్యింది. అదనంగా మరిన్ని పోస్టులను కలిపి కొత్తగా నోటిఫికేషన్‌ను విద్యాశాఖ గురువారం జారీ చేయనుంది.

మేలో డీఎస్సీ రాతపరీక్షలు?

డీఎస్సీ రాతపరీక్షలు మేలో నిర్వహించే అవకాశముందని విశ్వసనీయంగా తెలిసింది. వచ్చేనెలలో పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఏప్రిల్‌లో పోలింగ్ ఉంటుంది. మే రెండో వారం వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. దీంతో మే మూడో వారం లేదా నాలుగో వారంలో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించే అవకాశమున్నది. ఇంకోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వం డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని అభ్యర్థులు కోరుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి. గురువారం విడుదల చేసే నోటిఫికేషన్‌లో స్పష్టత ఇవ్వనుంది.

డీఎస్సీ వివరాలు

కేటగిరీ	పోస్టులు
స్కూల్ అసిస్టెంట్	2,849
ఎస్జీటీ	7,304
పండితులు	727
పీఈటీలు	182
మొత్తం	11,062

మార్చి 4,5 తేదీల్లో రాష్ట్రానికి ప్రధాని రాక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసేందుకు, బహిరంగసభల్లో పాల్గొనేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మార్చి నాలుగు, ఐదు తేదీల్లో తెలంగాణకు రానున్నారు. నాలుగోతేదీన ఉదయం 10:20 నిమిషాలకు నాగపూర్ నుంచి ఆదిలాబాద్‌కు హెలిక్యాప్టర్ ద్వారా రానున్నారు. 11:15 నుంచి 12 గంటల వరకు బహిరంగసభలో పాల్గొంటారు. ఆ వెంటనే తమిళనాడుకు వెళ్లి రాత్రికి హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. నాలుగో తేదీ రాత్రి రాజ్‌భవన్‌లో బసచేస్తారు. ఐదో తేదీన ఉదయం సంగారెడ్డిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో, 11:30 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

ఇషాన్, శ్రేయస్‌పై బిసిసిఐ కొరడా

● వార్షిక కాంట్రాక్ట్‌ల పొడిగింపునకు 'నో' ● యువ క్రికెటర్లకు పెద్దపీట

ముంబయి: భారత క్రికెట్ బోర్డు(బిసిసిఐ) శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లపై కొరడా ఝళిపించింది. 2023-24 సీజన్‌కు సీనియర్ క్రికెటర్ల వార్షిక ఒప్పందాలను బిసిసిఐ బుధవారం ప్రకటించగా.. అందులో వీరిద్దరికీ చోటు దక్కలేదు. దేశవాళీ టోర్నీల్లో కచ్చితంగా పాల్గొనాలని బిసిసిఐ తేల్చిచెప్పినా.. వీరిద్దరూ వేర్వేరు కారణాలను సాకుగా చూపుతూ ఉండడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీంతో ఈసారి ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్‌ను కాంట్రాక్టుల నుంచి తొలగించింది. దక్షిణాఫ్రికా పర్యటన నుంచి మధ్యలోనే వచ్చేసిన కిషన్ తరువాత జరిగిన ఏ సిరీస్‌లోనూ పాల్గోలేదు. ఐపిఎల్ కోసం హార్దిక్ పాండ్యాతో కలసి ప్రాక్టీస్ చేశాడని వార్తలొచ్చాయి. రంజీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టు ఆడాలని బిసిసిఐ చెప్పినా ఆడలేదు. ముంబయి తరపున అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో, బరోడాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆడాలని శ్రేయస్ అయ్యర్‌ను కోరినా అతడూ దూరంగా ఉన్నాడు. దీంతో అతనిపైనా వేటు పడింది. రోహిత్, కోహ్లి, బుమ్రా, జడేజా గ్రేడ్-ఎ+లో ఉండగా.. గ్రేడ్-ఎకు రాహుల్, గిల్, సిరాజ్ పదోన్నతి పొందారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఏడాదిగా జట్టుకు దూరమైన రిషబ్ పంత్ గ్రేడ్‌లో ఉన్నాడు. టి20 స్పెషలిస్ట్ బ్యాటర్ రింకూసింగ్, తిలక్‌వర్మ కొత్తగా గ్రేడ్-సిలో చోటు దక్కించుకున్నారు. నిర్దేశించిన వ్యవధిలో కనీసం మూడు టెస్టులు కాని, 8 వన్డేలు లేదా 10 టి20లు ఆడితే వారిని కూడా గ్రేడ్‌లో చేరుస్తారు. ఇప్పటికే రెండు టెస్టులు ఆడిన ధృవ్ జురెల్, సర్ఫరాజ్ ఇంగ్లండ్‌తో జరిగే ఐదో టెస్ట్‌లోనూ ఆడితో వారి కెరీర్‌లో ఇది మూడో టెస్టు కానుంది. దీంతో వారు కూడా గ్రేడ్ జాబితాలో చేరే ఛాన్స్ ఉంది. అలాగే సెలెక్షన్ కమిటీ బౌలింగ్ కాంట్రాక్టులకు ఆకాశ్ దీప్, విజయ్‌కుమార్ వ్యాషక్, ఉమ్రాన్ మాలిక్, యశ్ దయాల్, కావేరప్పను సిఫార్సు చేసింది. ఈ కాంట్రాక్టులు అక్టోబర్ 1, 2023 నుంచి సెప్టెంబర్ 30, 2024 వరకు అమలులో ఉంటుంది. ఫాస్ట్ బౌలింగ్ కాంట్రాక్టును బీసీసీఐ కొత్తగా సిఫార్సు చేసింది. దీనిలో ఆకాశ్‌దీప్, విజయ్‌కుమార్, ఉమ్రాన్ మాలిక్, యశ్ దయాల్, విద్వాంత్ కావేరప్ప ఉన్నారు.

వార్షిక కాంట్రాక్టుల్లో ఉన్న ఆటగాళ్లు వీరే..

గ్రేడ్-ఎ+ : రోహిత్, కోహ్లి, బుమ్రా, జడేజా

గ్రేడ్-ఎ : అశ్విన్, షమీ, సిరాజ్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్, హార్దిక్.

గ్రేడ్-బి : సూర్యకుమార్, పంత్, కుల్దీప్, అక్షర్, జైస్వాల్.

గ్రేడ్-సి : రింకూ సింగ్, తిలక్ వర్మ, గైక్వాడ్, శార్దూల్, దూబే, బిష్ణోయ్, జితేష్, సుందర్, ముఖేష్ కుమార్, సంజు శాంసన్, అర్షదీప్, కేఎస్ భరత్, ప్రసిద్ధ కృష్ణ, అవేష్ ఖాన్, రజత్ పటీదార్.

జైస్వాల్ @12

కెరీర్ బెస్ట్ సాధించిన యువ ఓపెనర్
ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్ : అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారత యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో నిలిచాడు. ఇంగ్లండ్‌తో జరిగిన నాల్గో టెస్ట్‌లో రాణించిన యశస్వి జైస్వాల్ కెరీర్ బెస్ట్ మూడు స్థానాలను మెరుగుపర్చుకుని 12వ ర్యాంక్‌లో నిలిచాడు. నాల్గో టెస్ట్‌లో జైస్వాల్ 73, 37 పరుగులతో రాణించాడు. ఇక శుభ్‌మన్ గిల్ (38, 52 నాటౌట్), ధృవ్ జురెల్ (90, 39 నాటౌట్) ర్యాంకింగ్స్‌లో కెరీర్ అత్యుత్తమ స్థానానికి చేరుకున్నాడు. గిల్ నాలుగు స్థానాలు మెరుగుపర్చుకుని 31వ స్థానానికి.. జురెల్ 31 స్థానాలు మెరుగుపర్చుకుని 69 స్థానానికి ఎగబాకారు. ఇదే టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో అజేయ సెంచరీతో కదంతొక్కిన ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని మూడో స్థానానికి చేరుకోగా.. న్యూజిలాండ్ స్టార్ ఆటగాడు కేన్ విలియమ్సన్, స్టీవ్ స్మిత్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. భారత్ నుంచి టాప్-10లో విరాట్ కోహ్లి ఒక్కడే చోటు దక్కించుకున్నాడు. అయితే విరాట్ ప్రస్తుత ఇంగ్లండ్ సిరీస్‌కు దూరంగా ఉండటంతో అతని ర్యాంక్ ఏడు నుంచి తొమ్మిదో స్థానానికి పడిపోయింది. నాలుగో టెస్ట్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీ చేసినప్పటికీ టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఓ స్థానాన్ని కోల్పోయి 13వ ప్లేస్‌కు పడిపోయాడు. బౌలర్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. ఈ విభాగంలో చెప్పుకోదగ్గ మార్పులేమీ జరగలేదు. భారత బౌలర్లు బుమ్రా, అశ్విన్, జడేజా ఒకటి, రెండు, ఆరు స్థానాల్లో కొనసాగుతుండగా.. రబాడ, కమిన్స్, హాజిల్‌వుడ్ మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. మరో భారత స్పిన్నర్ కుల్దీప్ రాంచీ టెస్ట్‌లో మెరుగైన ప్రదర్శన కారణంగా 10 స్థానాలు మెరుగుపర్చుకుని కెరీర్ అత్యుత్తమ 32వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత్‌తో నాలుగో టెస్ట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ ఏకంగా 38 స్థానాలు మెరుగుపర్చుకుని 80వ ర్యాంక్‌కు ఎగబాకాడు. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లోనూ పెద్దగా మార్పులేమీ జరగలేదు. భారత ఆటగాళ్లు రవీంద్ర జడేజా, అశ్విన్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతుండగా.. ఇంగ్లండ్ జో రూట్ మాత్రం మూడు స్థానాలు మెరుగుపర్చుకుని నాలుగో ప్లేస్‌కే చేరాడు.

లండన్‌కు కెఎల్ రాహుల్

ఇంగ్లండ్‌తో ఐదో టెస్టుకూ దూరం



ముంబయి: టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ ఇంగ్లండ్‌తో ఐదో టెస్టుకూ దూరమయ్యాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోని కెఎల్ రాహుల్‌ను చికిత్స నిమిత్తం లండన్‌కు వెళ్లనుండడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇంగ్లండ్‌తో హైదరాబాద్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో ఆడిన రాహుల్.. రెండు ఇన్నింగ్స్‌లో 108 పరుగులు చేశాడు. ఆ మ్యాచ్ సందర్భంగా తొడకండరాలు పట్టేయడంతో ఆ తర్వాత టెస్టులకు దూరమయ్యాడు. ఈ క్రమంలో బిసిసిఐ వైద్య బందం పర్యవేక్షణలో చికిత్స పొందిన కేఎల్ రాహుల్ పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో మిగిలిన మూడు టెస్టులకు అందుబాటులో లేకుండా పోయాడు. ధర్మశాల వేదికగా జరగనున్న ఆఖరి మ్యాచ్‌లోనైనా అతడు మైదానంలో దిగుతాడని భావించగా.. గాయం మళ్లీ తిరగబెట్టినట్లు తెలుస్తోంది. రాహుల్ సమస్య ఏమిటో బీసీసీఐ వైద్య బందానికి అంతుపట్టడం లేదని... ఈ నేపథ్యంలో అతడిని లండన్‌కు పంపించేందుకు బోర్డు సిద్ధమైనట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. అక్కడి వైద్య నిపుణుల వద్ద ఈ కర్ణాటక బ్యాటర్ చికిత్స పొందనున్నట్లు సమాచారం.

ప్రేక్షకుల హృదయాల్లో నిలిచేలా ...



మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమార్ నటించిన 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం) సినిమా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేస్తుందని సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్ అన్నారు. మార్చి 28న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమా గురించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వరల్డ్ క్లాసిక్ మూవీ 'లారెన్స్ ఆఫ్ అరేబియా' మాదిరిగా ఈ సినిమా ఉంటుందని అన్నారు. మార్చి 10న ఆడియో విడుదల పెద్దఎత్తున చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. హాలీవుడ్ నటుడు జిమ్మి జీన్ లూయిస్, అమలాపాల్, కెఆర్ గోకుల్, అరబ్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ ఆబే ఇతర కీలకపాత్రల్లో నటించారు. బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా ఈ సినిమాను డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు.

నవచిత్రం

త్వరలో తాప్సీ వివాహం



హీరోయిన్ తాప్సీ త్వరలోనే వివాహం చేసుకోబోతున్నట్లుగా సమాచారం. ఢిల్లీకి చెందిన తాప్సీ 'ఝుమ్మంది నాదం' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించారు. తర్వాత ఇక్కడే కొన్ని సినిమాల్లో నటించారు. అనంతరం బాలీవుడ్‌కు వెళ్లి అక్కడ రాణించారు. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియస్ బోతో, తాప్సీ ప్రేమించుకుంటున్నారు. గతేడాది ఈ విషయాన్ని ఆమె అధికారికంగా ప్రకటించారు. త్వరలోనే రెండు కుటుంబాల సమక్షంలో ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరగబోతుందని సమాచారం.



నేడు శ్రీవిష్ణు సినిమాకు నామకరణం

హీరోగా శ్రీ విష్ణుతో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఓ కొత్త సినిమాకు శ్రీకారం చుట్టింది. నిర్మాత టిజి విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. దీనికి సంబంధించిన నామకరణం ఈవెంట్ పోస్టర్‌ను చిత్ర ప్రతినిధులు విడుదల చేశారు. గురువారం శ్రీవిష్ణు పుట్టినరోజును పురస్కరించుకుని సినిమా పేరు ప్రకటించబోతున్నారు.

2న వ్యూహం విడుదల

తాను తీసిన 'వ్యూహం' సినిమా మార్చి 2న విడుదల కానుందని దర్శకుడు రాంగోపాల్ వర్మ తెలిపారు. తొలుత ఈనెల 25న విడుదల చేయాలని భావించామని, సాంకేతిక కారణాలతో మార్చి 1కి వాయిదా వేశామని తెలిపారు. అయితే ఇప్పుడు ఒకరోజు ఆలస్యంగా మార్చి 2వ తేదీన విడుదల చేస్తున్నామని చెప్పారు. 'పట్టు వదలని విక్రమార్కుడిని' అనే క్యాప్షన్‌తోపాటు సెన్సార్ సర్టిఫికెట్‌ను చేతిలో పట్టుకుని ఉన్న ఫొటోను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. వ్యూహం సినిమా విడుదలను నిలిపేయాలని కోరుతూ నారా లోకేష్ తెలంగాణా హైకోర్టును పిటిషన్ వేయటంతో ఇప్పటివరకూ వాయిదా పడుతూ వచ్చింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా శపథం కూడా రానుంది.



దాశరథికి యూత్ ఐకాన్ అవార్డు



క్యారెక్టర్ ఆర్టిస్ట్ దాశరథి నరసింహన్‌కు అమైది తమిళ్ వర్సిటీ యూత్ ఐకాన్ అవార్డు లభించింది. నౌకాదళంలో పనిచేసిన ఆయన సినిమాలపై ఉన్న ఆసక్తితో 2016లో చిత్రరంగ ప్రవేశం చేశారు. వెంకటేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన 'చెన్నై 600028-2' చిత్రంలో నటించారు. బ్యాడ్‌బాయ్స్ బృందంలో ఒకరిగా నటించారు. తర్వాత 'కణ', 'ఆర్కే నగర్', '100' చిత్రాల్లో కీలకపాత్రలు పోషించారు. రజనీకాంత్ అతిథి పాత్రలో పాత్రలో నటించిన 'లాల్ సలామ్' చిత్రంలో విష్ణు విశాల్‌కు మిత్రుడిగా నటించారు. ప్రస్తుతం అజిత్ హీరోగా నటిస్తున్న 'విడాముయర్చి' చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఎన్.శంకర్ పర్యవేక్షణలో మూడు వెబ్ సిరీస్



గతంలో అభ్యుదయ సినిమాలు తీసిన దర్శకుడు ఎన్.శంకర్ తాజాగా నిర్మాత, దర్శకత్వ పర్యవేక్షణలో మూడు హిస్టారికల్ వెబ్ సిరీస్‌లు తీయబోతున్నారు. ఎన్‌కౌంటర్, శ్రీరాములయ్య, జయం మనదేరా, ఆయుధం, భద్రాచలం, జై బోలో తెలంగాణా వంటి సినిమాలకు ఆయన దర్శకత్వం వహించారు. తాజాగా ఎన్.శంకర్ టీవీ అండ్ ఫిల్మ్ స్టూడియో బ్యానర్ స్థాపించారు. తానే నిర్మాతగా, దర్శకత్వం వహిస్తూ 'తెలంగాణా పోరు', మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తి, ఆదర్శప్రాయుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్' వంటి పేర్లతో వెబ్ సిరీస్ తీయబోతున్నట్లుగా శంకర్ ప్రకటించారు.

ఎస్ఎస్ఏ నిధులు వచ్చేనా..?

5 నెలలుగా వేతనాలు రాక కేర్‌టేకర్ల ఇబ్బందులు | తన వాటా ఇవ్వని కేంద్రం

● మోడల్ స్కూల్స్‌లో సమస్యల తిష్ట ● రూ.7.20 కోట్లు విడుదలలో తీవ్ర జాప్యం



మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న కేర్‌టేకర్ కమ్ వార్డెన్లు 2015 నుంచి పనిచేస్తున్నా వారి వేతనాల పెంపు విధానం మాత్రం అసమగ్రంగా ఉంది. తొలుత రూ.6,700 వేతనంతో పని ప్రారంభించిన వీరికి ప్రస్తుతం రూ.12,500 వేతనం ఇస్తున్నారు. సుమారు 10 గంటల మేరకు పైగా పనిచేస్తే వచ్చే వేతనం అత్యంత స్వల్పం కాగా, ఈ వేతనాన్ని సైతం సకాలంలో ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే శ్రమకు తగ్గ వేతనాన్ని ఇతర ఉద్యోగులకు ఎలా పెంచుతున్నారో, అదే ప్రాతిపదికన తమకు వేతనాలు పెంచి, సకాలంలో చెల్లించాలని వీరు కోరుతున్నారు.

శ్రమ అధికం..వేతనం స్వల్పం..

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) నుంచి నిధులు రాకపోవడంతో రాష్ట్రంలోని 192 మోడల్ పబ్లిక్ స్కూల్స్‌లోని కేర్‌టేకర్ కమ్ వార్డెన్‌లకు ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదు. అంతేకాదు.. ఐదు నెలలుగా డైట్ ఛార్జీలనూ సంబంధిత గుత్తేదార్లకు ఇవ్వకపోవడంతో గ్యాస్ సిలిండర్‌లకు సైతం వార్డెన్‌లే ఛార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. దాంతో మోడల్ స్కూల్స్‌లో సమస్యలూ తిష్టవేశాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,152 మంది తొమ్మిదేండ్లుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలోనే పనిచేస్తున్నారు. ప్రస్తుతం వీరికి నెలకు రూ.12,500 వేతనం ఇస్తుండగా.. 5 నెలలకు రూ.7.20 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో సకాలంలో వేతనాలు రాకపోవడంతో పాటు స్కూళ్ల నిర్వహణ బాధ్యత వారిపైనే ఉండటంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్టు ఉద్యోగులు వాపోతున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకమైన సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) పథకం కింద 192 మోడల్ స్కూల్స్ హాస్టల్స్‌లో కేర్ టేకర్ కమ్ వార్డెన్‌గా (టైప్-4)గా ఒక్కో స్కూల్‌లో ఆరుగురిని రాష్ట్రప్రభుత్వం నియమించింది. సుమారు 1,152 మంది తొమ్మిదేండ్లుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలోనే పనిచేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 30 స్కూల్స్ ఉండగా 180 మంది పనిచేస్తున్నారు. ప్రస్తుతం వీరికి నెలకు రూ.12,500 వేతనం ఇస్తుండగా.. ఒక్కొక్కరికీ ఐదు నెలలుగా రూ.62,500 వేతనం రావాల్సి ఉంది. అంతేకాదు, స్కూళ్ల నిర్వహణకు వారి చేతినుంచే డబ్బులు పెట్టాల్సిన పరిస్థితి. వీరికి నిర్దిష్టంగా సమయపాలన సైతం లేకపోవడంతో ఎక్కువ పనిగంటలు పనిచేస్తుండటంతో శ్రమ దోపిడికి గురవుతున్నారు.


(ఫైల్)

రూ.7.20 కోట్లు వేతనాలకే..

సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) పథకంలో కేంద్ర ప్రభుత్వం 85 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం నిధులు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వ వాటా ఎక్కువగా ఉండటంతో వారి నుంచి రావాల్సిన నిధులు రాక గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వేతనాలు ఇవ్వలేదు. దాంతో 192 మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న 1,152 మంది కేర్‌టేకర్ కమ్ వార్డెన్‌లకు వేతనాల కిందనే రూ.7.20 కోట్లను విడుదల చేయాల్సి ఉంది. వేతనాలు అందక వారి కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితి ఉంది.

విడుదల కాని డైట్ చార్జీలతో ఆర్థిక ఇబ్బందులు

మోడల్ స్కూల్స్ హాస్టల్స్‌కు డైట్ ఛార్జీలను సైతం ఐదు నెలలుగా ఎస్ఎస్ఏ విడుదల చేయలేదు. దాంతో గుత్తేదార్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒక్కో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యను బట్టి నెలకు రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు డైట్ చార్జీలు ఖర్చవుతున్నాయి. ఈ లెక్కన రాష్ట్రంలోని 192 మోడల్ స్కూల్స్ హాస్టల్స్‌లో డైట్ చార్జీల కింద సగటున రూ.4.70 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చవుతాయి. రూ.9.60 కోట్ల మేరకు డైట్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. దాంతో కేర్‌టేకర్‌లపై మరింత భారం పడింది. చివరకు వంట వండేందుకూ గ్యాస్ ఉండదు. దాని రీ ఫిల్లింగ్ ఛార్జీలూ వారే పెట్టుకుంటున్నారు. నెలకు ఒక్కో స్కూల్‌లో 6-7 సిలిండర్లు అవసరమవుతుండగా.. సుమారు రూ.6 వేల నుంచి రూ.7 వేల భారం కేర్‌టేకర్‌లపైనే పడుతుంది. అటు వేతనాలు రాక, ఇటు ఇతర ఖర్చులతో మరింత ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇచ్చిన మాట..చెప్పిన పథకం అమలే ధ్యేయం

ప్రాజెక్టుల దుస్థితికి కాళేశ్వరమే నిదర్శనం

● అధికారులు, వ్యవస్థల కంటే ప్రజల్లో ఉండటమే ఇష్టం : మాదిరిపురం సభలో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-
ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఇచ్చిన మాట.. చెప్పిన పథకం అమలే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టుల దుస్థితికి కాళేశ్వరమే నిదర్శనమని, పైగా సిగ్గూ శరం లేకుండా ప్రాజెక్టులు కట్టామని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న గిరిజన మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. తన చుట్టూ ఉండే అధికారులు, వ్యవస్థల కంటే ప్రజల్లో ఉండటమే తనకు ఎక్కువ ఇష్టమని తెలిపారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగింటిని అమలు చేశామని చెప్పారు. ప్రజా పాలన దరఖాస్తుల్లో తప్పులను మండల కార్యాలయాల్లో సరిచేసుకోవచ్చని సూచించారు. 200 యూనిట్లలోపు బిల్లు వచ్చే వారందరికీ ఇక కరెంట్ ఉచితమేనని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తెచ్చి రాజధాని చుట్టూ భూములను కొల్లగొట్టిందన్నారు. చిన్నచిన్న సమస్యలనూ పరిష్కరించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని, లక్షలాది అర్జీలను పట్టించుకోలేదన్నారు. త్వరలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామని చెప్పారు. మరో వారం పది రోజుల్లో నియోజకవర్గ ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటానన్నారు. తాను హైదరాబాద్‌లో ఉన్నా.. అదీ రాష్ట్ర ప్రజల పని నిమిత్తమే అని వివరించారు. సభలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, ఎంపీపీ బాణోత్ మంగీలాల్, జడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రామిరెడ్డి చరణ్‌రెడ్డి, రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మీడియా ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు : మంత్రి దనసరి అనసూయ సీతక్క

నవతెలంగాణ - ములుగు



మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి తెలియజేసిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు, మీడియా ప్రతినిధులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశుసంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అభినందనలు తెలిపారు. బుధవారం ములుగు జిల్లా బండారుపల్లి గిరిజన భవన్‌లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్‌తో కలిసి మీడియా ప్రతినిధుల కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. జాతర విజయవంతంలో ప్రతి ఒక్కరి అనుభవాల అనుసారం పుస్తక రూపంలో పొందుపరిచి లోపాలను పునరావృతం కాకుండా చూస్తామని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహించిన అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మీడియా ప్రతినిధుల సలహాల మేరకు జాతర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని అన్నారు.

ములుగు కేంద్రంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి గిరిజన యూనివర్సిటీ తరగతులు, జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్లు ప్రారంభిస్తామని అన్నారు. గోదావరి నది జలాలు రామప్ప సరస్సు నుంచి లక్నవరం సరస్సులోకి మళ్లించే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ.. జాతర విజయవంతంలో కీలకపాత్ర పోషించిన మీడియా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏటూరునాగారం అదనపు ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, దేవాదాయశాఖ అధికారి రాజేందర్, పౌర సంబంధాలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎండీ రఫీక్, డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ విజయభాస్కర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పెండింగ్ జీతాలను చెల్లించాలి

● ఎక్స్ వేదికగా రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమగ్ర శిక్ష ఉద్యోగుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎక్స్ వేదికగా స్పందించారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఆచరణలో మాట తప్పిందని విమర్శించారు. 'గతేడాది డిసెంబర్ నెలకు సంబంధించి 10,632 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులకు, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి 12,660 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు అందలేదు. ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మధ్యాహ్న భోజనానికి సంబంధించి వంట ఛార్జీలు, కోడిగుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని ఎక్స్ వేదికగా స్పందించారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.